1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 3
సంచిక : 11
పుటలు :52
రు. 20/-లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

జనవరి 2018



తెలుగు మహాసభలకు ఘనమైన స్వాగతం



భారత ఉపరాష్ట్రపతిచే ఘనంగా మొదలైన ప్రపంచ తెలుగు మహాసభలు



భారత రాష్ట్రపతి ఆశీస్సులతో ముగిసిన తెలుగు మహాసభలు

తెలుగుతోనే తెలంగాణ వీణకు కోటి రాగాలు

ప్రపంచ తెలుగు మహాసభల్లో కొన్ని వేదికలపై దృశ్యాలు













◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



జనవరి 2017

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము. **అమ్మనుడి** లో ప్రచురణైన తరువాత ఇతర పత్రికలలోగాని, సోషల్ మీడియాలోగాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

లోపలి పుటలలో....

లోపలి పుటలలో....

సంపాదక హృదయం :	తెలుగుతోనే తెలంగాణ వీణకు కోటి రాగాలు		**7**
న్యాయస్థానాల్లో తెలుగు :	న్యాయస్థానాల్లో తెలుగు కోసం ఉద్యమం	**బి.హనుమారెడ్డి**	**9**
ప్రపంచ తెలుగు మహాసభలు :	తెలుగు వెలుగులను ప్రపంచానికి...	**సంకేపల్లి నాగేంద్ర శర్మ**	**13**
స్పందన :	తెలుగు లిపి సంస్కరణ	**మలయశ్రీ**	**20**
స్పందన :	– తెలుగులిపి దిద్దుబాటు తప్పనిసరి	**నంద్యాల నారాయణ రెడ్డి**	**22**
స్పందన :	కొన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవడం	**డి.నటరాజ్**	**22**
స్పందన :	తెలుగు లిపి సంస్కరణావశ్యకత	**అల్లంశెట్టి చంద్రశేఖరరావు**	**23**
జానపదం:	తెన్నాటి తెలుగు పాటలు – 2	**సామల మురళి**	**30**
తెలుగే ప్రాణం:	తెలుగు భాషకు ప్రబుద్ధాంధ్ర మద్ధతు	**శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి**	**32**
పిట్ట చూపు :	అత్యాచారాలు హత్యల నుండి విముక్తి ఎప్పుడు ।	**చలసాని నరేంద్ర**	**47**
జాతి వెలుగు :	కృత్రిమ మేథ సృష్టికర్త రాజ్‌రెడ్డి	**పుప్పల నరసింహం**	**49**
పుస్తక సమీక్ష :	సంపాదకశిల్పి పద్మశ్రీ డా॥ఎ.ఎస్.రామన్	**ఎం.వి.శాస్త్రి**	**50**

ధారావాహికలు :

1. మౌనంలోని మాటలు – 3 :	**ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు**	**37**
2. బౌద్ధం–వైజ్ఞానిక మార్గం – 9	**బొర్రా గోవర్ధన్**	**44**

భాషోద్యమ కథానికలు :	1. అభయ తారకం	**ఐతా చంద్రయ్య**	**26**
	2. తెలుగు తీవ్రవాదులు	**ద్విభాష్యం రాజేశ్వరరావు**	**41**

కవితలు :	1. అంతరంగ కాలుష్యం	**డా॥ కత్తి పద్మారావు**	**31**
	2. మహా సంకల్పం	**డా॥ ఎన్.గోపి**	**43**

రేఖా చిత్రాలు : **చిదంబరం** కార్టూన్లు : **సరసి, శేఖర్**
ప్రపంచ సభల ఫొటోలు : **గంగాధర్** కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* e-mail : editorammanudi@gmail.com
వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా.హైదరాబాదు **- 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

అమ్మభాష తెలుగును కాపాడుకొనే
ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికంగా 500రూ. ఇవ్వబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- తరువాత ఈ కథానికలతో ఒక సంకలనాన్ని తెస్తాం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.
- మన భావాలకు శాశ్వత రూపాన్నిచ్చే మన మాతృభాష కేంద్రంగా మీరు పంపే కథానికల కోసం ఎదురు చూస్తుంటాం. అమ్మభాష కోసం నిర్వహిస్తున్న ఈ వినూత్న శీర్షికకు విలువైన మీ కథానికలను పంపాల్సిన చిరునామా:

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. కార్యాలయం ఫోన్ : 0866-2439466. సంపాదకుడు : 9848016136. e-mail : editorammanudi@gmail.com

<u>గమనిక :</u> కథలను అనుఫాంట్స్‌లో గాని, యూనికోడ్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి.ఫైల్సులోపంపించాలి. చేతివ్రాతలో పంపేట్లయితే వ్రాసిన దానిని స్కాన్ చేయించిపంపాలి. లేదా వ్రాతప్రతిని పోస్టులో గాని, కొరియర్‌లో గాని పంపించాలి.

విచ్చేయండి

29వ విజయవాడ పుస్తక మహోత్సవం


స్వరాజ్య మైదానం (పి.డబ్ల్యు.డి.గ్రౌండ్స్), విజయవాడ

2018 జనవరి 1 నుండి 11 వరకు మధ్యాహ్నం 2 గం॥ నుండి 9గం॥ వరకు

తెలుగుజాతి (ట్రస్టు) స్టాల్ నెం. 85 ను సందర్శించండి.

లభించు పుస్తకాలు మరియు సిడి వివరాలు

స,వెం.రమేశ్ రచన



ఎల్లలు లేని తెలుగు
వెల : రు.200/-లు

ఆచార్య శ్రీగారపాటి ఉమామహేశ్వరరావు రచనలు



తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం
వెల :రు. 100/-



ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం
వెల : రు.350।-




అమ్మనుడి పత్రికకు చందాదారులుగా చేరి ప్రతినెలా పత్రికను పోస్టులో మీ ఇంటికే అందుకోండి.

చందా వివరాలు

శాశ్వత చందా	:	**రూ.5000**
5 సం॥	:	**రూ.1000**
3 సం॥	:	**రూ. 700**
1 సం॥	:	**రూ. 240**

నూతన చందా దారులకు జనవరి 2018 సంచిక ఉచితం

తెలుగు ఉద్యమం ప్రచార గీతాలు



వెల : 30/-

1. తెలుగు పతాకమా, 2. కమ్మనైన తెలుగు భాష, 3.పాదరా ఈ దేశము నీదని, 4. కడలి అంచులు దాటి కదిలింది తెలుగు, 5, పాడనా తెలుగు పాట, 6. అమ్మ నన్ను కన్నందుకు వందనాలు, 7. విన్నాను అమ్మ ఒడిలో 8. ఎట్టెట్టా బతికీనోళ్లం. 9. ఎగరేద్దాం తెలుగు భాష సంస్కృతుల జెండా వంటి గీతాలు దీనిలో ఉంటాయి. స్టాలులో లభిస్తుంది.

అమ్మనుడి పత్రికకు కొత్తగా చందాదారులుగా చేరేవారు ఉచిత బహుమతులుగా పై పుస్తకాలను పొందండి

శాశ్వత చందా రు. 5000/- చెల్లించి 'తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం', 'ద్రావిడ మంగోలు భాషల జన్యుసంబంధం' రెండు పుస్తకాలనూ ఉచితంగా పొందండి.

5 స॥లకు చందా రు.1000/-లు చెల్లించి 'ఎల్లలులేని తెలుగు' పుస్తకాన్ని ఉచితంగా పొందండి.

3 సం॥ చందా రు. 700/- చెల్లించి, 'తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం' పుస్తకాన్ని ఉచితంగా పొందండి.

భాషాభిమానులు, రచయితలు, భాషోద్యమకారులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ఆసక్తిగల వారంతా ఈ ప్రచురణలను కొనుగోలుచేసి, సహకరించగోరుతున్నాము.

తెలుగుజాతి (ట్రస్టు)

విక్రయశాల నిర్వాహకుడు : డా॥ సామల లక్ష్మణబాబు (9440448244)



ప్రభుత్వ పాలన, కోర్టుల్లో న్యాయ పాలన ప్రజల భాషలోనే జరగాలి



రెండు తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త ఉద్యమ కార్యక్రమం

2018 ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా

సంకల్పం

ఇందుకోసం జరిగే కార్యక్రమాల రూపకల్పనలో నిర్వహణలో ఆసక్తిగల వ్యక్తులు, సంఘాలు వెంటనే ఈ క్రింది వారితో సంప్రదించండి

రాష్ట్రాల స్థాయిలో, జిల్లాల స్థాయిలో పనిచేయుటకు బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తిగలిగిన వారు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

వివిధ ప్రజాహిత, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, భాషోద్యమాల్లో పనిచేస్తున్న వారుగానీ, కొత్తగా రాదలచుకున్న వారుగానీ - ఆసక్తిగలవారెవరైనా పాల్గొనవచ్చు.

కలసి సాగుదాం - కదలి రండి

ఫోనులో నేరుగా మాట్లాడండి.

డా॥ సామల రమేష్‌బాబు 98480 16136

అధ్యక్షుడు : తెలుగు భాషోద్యమ సమాఖ్య

samalarameshbabu@gmail.com

సంపాదక హృదయం

తెలుగుతోనే తెలంగాణ వీణకు కోటిరాగాలు

"తెలుగు వెలుగులు ప్రపంచానికి పంచుదాం...తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటుదాం" ఇదీ ప్రపంచ తెలుగు మహాసభల 'ఆహ్వానం'పై ప్రముఖంగా కనబడిన నినాదం. అదే సభల ఆశయ ప్రకటన. "ధన్యభూమి తెలంగాణ కళ లొలికిన తెలుగు...రాష్ట్రాంతర ఖండాంతర రత్నకాంతి వెలుగు' – ఇదీ ఘనమైన భాషా సాంస్కృతిక చరిత్రతో పెనవేసుకొని, తెలుగుప్రతిభను ప్రపంచమంతటా చాటాలనే తమ స్వప్నాన్ని సాకారం చేసుకోవాలన్న స్పష్టమైన అవగాహన. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' – ఇది ఆత్మగౌరవ సంకేతం. ఇవీ ప్రధాన వేదికపై ప్రముఖంగా కనపడిన అక్షరాలు!

ఈ మహాసభల హృదయం గురించి ఇంతకంటే వివరించవలసిందేమున్నది? నిజాం పాలననుంచి, బానిసత్వాన్నుంచి విముక్తికోసం చేసిన పోరాట దశనూ, తర్వాత విశాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పొసగని ఉమ్మడి కాపురం నుంచి బయటపడడానికి చేసిన ఉద్యమాల దశనూ దాటి, స్వరాష్ట్రాన్ని నిర్మాణం చేసుకొన్న తనదైన చరిత్ర కలిగిన తెలంగాణం ఇప్పుడు ఏమి ఆలోచిస్తున్నదో ఏమి కోరుకొంటున్నదో లోకానికి తెలుపడానికి ఇంతకంటె ఎలుగెత్తి చెప్పవలసినదేమున్నది?.

అయితే, ఈ అన్ని సందేశాలలోనూ ఇమిడి వున్న శాశ్వత సత్యం– తెలంగాణ అచ్చమైన తెలుగునేల అనీ, తమది తెలుగు భాష అనీ. ఎవరు ఒప్పుకొన్నా ఒప్పుకోకపోయినా 'తెలంగాణ భాష' అంటూ తెలుగుకాని భాష మరొకటి ఏదీ లేదనీ. తనదైన ఎన్నో ప్రత్యేకతలు – మాండలికాలు, యాస, జీవన సంస్కృతీ విలువలు, ఆచారాలు తెలంగాణకు సొంతంగా వున్నాయనీ...ఆ మాటకు వస్తే...తెలుగు భాష మూలాలు తమ నేల నుంచేనని! విశాల తెలుగు భాషాజాతికి చెందిన వివిధ ప్రాంత సమూహాల్లో ఇలాంటి స్వంతదనం కన్పిస్తుందనీ, అదంతా వైవిధ్యానికి సంబంధించినదేగాని, వైరుధ్యానికి సంకేతం కాబోదనీ! ఒక రాష్ట్రంగా స్వాభిమానంతో కుదురుకొంటున్న తెలంగాణ – ఇప్పుడు మొత్తం తెలుగుజాతికే మకుటాయమానంగా విలసిల్లగలదన్న సందేశం కూడా నర్మగర్భంగా ఈ సభల్లో తొణికిసలాడింది.

"రెండేళ్ల క్రితం చండీయాగాన్ని నిర్వహించి, తెలుగు ప్రజల అభిమానాన్ని చూరగొన్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుగారు ఈ ఐదురోజుల భాషా యజ్ఞం తలపెట్టారు" అని డా॥ నందినీ సిధారెడ్డి తమ ప్రసంగంలో అన్నారు. 15 కోట్ల తెలుగువారికి ఆదర్శంగా కె.సి.ఆర్. నిబద్ధత గురించి డా॥ ఎస్.వి. సత్యనారాయణ పలు వేదికలపై ప్రస్తావించి, తెలుగు భాషకు జరుగుతున్న అన్ని అన్యాయాలనూ తొలగించి విద్యారంగంలో ఉన్నత స్థితికి తెలుగును చేర్చేందుకు తెలంగాణలో ఆయన కృషి చేస్తున్నారని ప్రకటించారు.

ఉద్యమాలు వ్యూహాలతోనే ఉంటాయి. తెలంగాణ రాష్ట్రంకోసం సాగిన ఉద్యమంలో కూడా ఎన్నో వ్యూహాలు నడిచాయి. కొన్ని సైద్ధాంతిక లక్ష్యాల కోసం జరిగినా, స్వరాష్ట్ర సాధన అనే రాజకీయ లక్ష్యాన్ని సాధించే మార్గంలో అనేక వ్యూహాలు చోటు చేసుకున్నాయి. వాటిలో భాషా సంస్కృతులు కూడా అనివార్యంగా అంశాలయినాయి. అవగాహనలో భేదాలు చాలా ఉండవచ్చు. చారిత్రక, రాజకీయ, సామాజిక నేపథ్యంలోంచి చూస్తే విస్తారమైన తెలుగుజాతిలో ఎన్నో వైవిధ్యాలు కన్పడుతూనే ఉంటాయి. అయినా, వీరందరిలో ఇంతకాలంగా కొనసాగుతున్న ఏకసూత్రత – భాషా వారసత్వం. ఇప్పుడు మాతృభాషలు అస్తిత్వ సమస్యనెదుర్కొంటున్న తరుణంలో – పాలనావసరాల దృష్ట్యా చిన్న రాష్ట్రాల ఏర్పాటు తప్పనిసరి అనే అభిప్రాయం పాదుకొంటున్నది.

కె.సి.ఆర్ వ్యూహనిపుణుడు. మేకియవెల్లీ, చాణుక్యుడు వంటి వారితో పోల్చదగినవాడని కొందరు ఒప్పుకోకపోవచ్చు. ఇప్పటికి తాను రాజకీయంగా స్థిమితపడి, ముమ్ముందు తన అధికారాన్ని పూర్తిగా కొనసాగించేందుకు భావజాలపరంగా ఏమి చేయాలో ఆలోచించి, ఇప్పుడొక బలమైన వ్యూహాన్ని చేపట్టారాయన. అదే ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ. ఈ సంకల్పం ఎంత బలమైనదంటే తెలుగుజాతి జనులు ఎక్కడున్నా – దేశంలోగానీ, దేశం బయటగానీ, సాక్షాత్తూ నిన్న మొన్న తాను చీలిపోయిన దాయాది రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో సహా – అన్ని చోట్లా తెలుగు ప్రజల మనసుల్లో స్థానాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు. ఎన్టీఆర్ అభిమానిగా ఆయనకు తెలుగుజనం – వారి బోళాతనం – వారి నమ్మకం – తిరగబడేతత్వం – అన్నీ తెలుసు. అందుకే ఈ వ్యూహాన్ని చేపట్టాడు. దాని అమలులో ఎన్నో లోపాలున్నాయి. ఎన్నో పొరపాట్లున్నాయి. వాటినిప్పుడిక్కడ చర్చించనక్కర లేదు.

కె.సి.ఆర్ తన తొలి ప్రసంగంలోనూ, ముగింపు సభ ప్రసంగంలోనూ తనకు తెలుగు మీదున్న ప్రేమతో పాటు, సాహిత్యంపై తనకు గల పట్టును కూడ వెల్లడించడంలో గొప్పగా విజయవంతుడయ్యారు. ఈ మహాసభల లక్ష్యాలుగా

మొదట్లో మనం ప్రస్తావించుకొన్న వాటిని బలంగా ప్రజల మనస్సులలో నాటడంలోనూ విజయం సాధించారు. అయితే, భాష విషయంలో తన ఆలోచనలేమిటో తానేమి చెయ్యదలచుకొన్నారో ఎంత చెప్పినా, అందులో శాస్త్రీయత, హేతుబద్ధత లోపించాయి.

ఒకటవ తరగతి నుంచి 12 వరకూ ఒక భాషగా తెలుగును తప్పనిసరి చేస్తామని కెసిఆర్ ప్రకటించారు. ఎవరు నడిపే పాఠశాల అయినా, ఏ మాధ్యమంలో నడిచేదయినా ఈ తెలంగాణ గడ్డమీద ఉండాలంటే ఈ నిబంధనను పాటించి తీరాల్సిందే అన్నారు. ఈ అంశంపై సభలకు కొన్ని నెలల ముందు నుంచీ పలుమార్లు ప్రకటించడమే కాకుండా, అందుకోసం ఒక కమిటీని విద్యావేత్తలతో, అధికారులతో నియమించారు. వారు దానికోసం పలుమార్లు సమావేశమై, సభలకు ముందే నివేదికను సిద్ధం చేసినా, కేంద్ర సిలబస్ వల్ల వచ్చే కొన్ని ఆటంకాలను, మరికొన్ని సమస్యలనూ దాటవలసిన స్థితిలో – నేటివరకు కొత్త జి.ఒ.ను తేలేదు. ఈ విషయంలో కెసిఆర్ స్వయంగా పూనుకొని రంగంలోకి దిగినట్లు, పొరుగు రాష్ట్రాల అనుభవాలను కూడా అధ్యయనం చేసి, త్వరలో తన వాగ్దానాన్ని నిలబెట్టుకోనున్నట్లు తెలిసింది. లోగడ 2003లో వచ్చిన జి.ఒ 86ను అమలు చేయకుండా ఎలాంటి మోసం జరుగుతోందో, నానాటికీ తెలుగులో విద్యార్థులెంత బలహీనపడుతున్నారో తాజా గణాంకాలు బయటపెడుతూనే ఉన్నాయి. ఆ జిఒలోని లోపాలను సరిదిద్ది, 11,12 తరగతుల్లో కూడా తెలుగును తప్పనిసరి చేయడమే కొత్తగా తేవలసిన జి.ఒ. లక్ష్యం. ఏదో ఒక విధంగా ఈ సమస్యను పరిష్కరించినా, ఈ చర్యతోనే తెలుగు ఒక భాషగా వెలిగిపోతుందనుకొంటే అది భ్రమే అవుతుంది.

కెసిఆర్ ఆశిస్తున్నట్లు – 'జీవద్భాష' గా తెలుగు వెలుగొందాలంటే కావలసింది – తెలుగును పాలనలోనూ బోధనలోనూ అన్నిస్థాయిలలో మాధ్యమంగా పూర్తిగా వినియోగించడం. 'వాడని భాష వాడిపోతుందని' యునెస్కో ప్రతిఏటా చెబుతూనే ఉంది. ఈ ఆధునిక యుగంలో అన్నిరంగాల్లో అందరూ పోటాపోటీగా ఎదగాలంటే కావలసింది విద్య. అదంతా వారి అమ్మభాషలో అందితేనే వారికి సంపూర్ణ వికాసం. అన్ని రంగాల్లో తెలుగును వాడందే తెలుగు వికసించదు. జీవంతో వుండడం అంటే అదే. అంతేకాని, కేవలం ఒక భాషగా, ఒక సబ్జెక్టుగా – తెలుగును తప్పనిసరి చేస్తే తెలుగు జీవద్భాషగా నిలిచి వుంటుందంటే అది కేవలం ఒక భ్రమే కాదు, అబద్ధం కూడా.

సాహిత్యం, కళ, సంస్కృతితోనే భాష వికసించదు. అన్ని ఆధునిక అవసరాలకు వినియోగించలేకపోతే అది నిర్జీవభాషగా అణగారి పోతుంది. మాతృభాష స్థానాన్ని ఏ పరాయి భాషకు ఇస్తున్నామో, ఆ భాషే సాహిత్య, సాంస్కృతిక రంగాల్ని కూడా ఆక్రమించేస్తుంది. ఆ విధంగా త్వరితంగా జాతి పరాయీకరించబడుతుంది. అంటే – భాష నశిస్తే జాతి నశిస్తుంది.

తెలుగును జీవద్భాషగా పెంపొందించేందుకు కొన్ని విశేష ప్రకటనలను ముగింపు సభలో చేస్తామన్న కెసిఆర్, అందుకోసం మరి కొంత చర్చలు జరపాల్సి వుందని, అందువల్ల జనవరిలో తమ ప్రకటన చేస్తామని వెల్లడించారు. సభలకు ముందుగానే భాషా విషయకంగా – ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, అందుకు తొలి చర్యగా తెలంగాణ మొత్తంలో కనీసం ప్రాథమిక విద్యలో 'మాతృభాష' ను మాధ్యమంగా తప్పనిసరి చేయడానికి నిర్ణయాన్ని ప్రకటించివుంటే బాగుండేది. 6వ తరగతి నుంచి మాధ్యమంగా ఏ భాష ఉండాలనే నిర్ణయాన్ని విద్యార్థికీ, తల్లిదండ్రులకు వదిలి, ఏ మాధ్యమంలో చదువుకోవాలన్నా అవకాశాలను తెరచివుంచితే అది ప్రజాస్వామ్య బద్ధమైన విధానంగా ఉండేది. ప్రాథమిక విద్యలో మాతృభాషా మాధ్యమాన్ని తప్పనిసరి చేస్తూ ఇంగ్లీషును ఒక భాషగా మాత్రమే పటిష్టంగా నేర్పాలనే విధానాన్ని చేపడితే అది అందరి మెప్పును పొందేది. దీనికి న్యాయపరంగా ఉన్న అడ్డంకులను అధిగమించే సంకల్పాన్ని ప్రకటించివుంటే అది మరింత సజావుగా ఉండేది. ఈ విధమైన ఒక భాషా విధానాన్ని ప్రకటించడానికి ఈ సందర్భాన్ని కెసిఆర్ ఉపయోగించుకొనివుంటే అది చరిత్రాత్మకమూ, అందరికీ ఆదర్శమూ అయి వుండేది. కనీసం ఈ విషయమై తన ఆలోచనలను ప్రజలతో పంచుకోవడానికి సిద్ధపడకుండా దాటవేయడం నిరాశకు గురిచేసింది.

ప్రపంచ తెలుగు మహాసభల్లో మరొక చారిత్రక అవకాశాన్ని కెసిఆర్ కోల్పోయారు. 1984లో ముఖ్యమంత్రి ఎన్టిఆర్ రాష్ట్ర సచివాలయం నుంచి మొత్తం పరిపాలనను తెలుగులోకి తెస్తూ ఉగాదికి ముందుగా బలమైన నిర్ణయాన్ని ప్రకటించి అమలు పరచినట్లు – ఈ మహాసభల సందర్భంలో తెలుగులో పాలనకోసం కొత్తగా ఉత్తర్వులను జారీచేసి మొత్తం అధికార వ్యవస్థను అప్రమత్తం చేసినట్లయితే అద్భుతంగా ఉండేది. ఆ అవకాశాన్ని ఆయన కోల్పోయారు. ఈ సభలనాటికల్లా బోర్డుల మీద తెలుగు ప్రధానంగా కన్పిస్తుందని ఆయన చేసిన ప్రకటన ఎక్కడా ఆచరణలో కొచ్చినట్లు లేదు. ఇది ఆయనకు అపఖ్యాతిని తెచ్చిపెట్టింది. ఈ విషయమై ముందస్తు కృషి జరిగినట్లు లేదు.

మొత్తం మీద – 'తెలుగు వెలుగులను ప్రపంచానికి పంచడంలో, తెలంగాణ ఖ్యాతిని దశ దిశలా చాటడంలో 'ఈ ప్రపంచ మహా సభలు ఘనతను సాధించాయి. అయితే 'గుండెల నిండుగ జరిగిన తెలుగు పండుగ'గానే ఇది మిగిలిపోయింది. తెలంగాణకు, తెలుగుజాతికి ఊపిరిగా ఉన్న తెలుగు భాష విషయంలో తమ విధానం ఏమిటో ప్రకటించడంలో విఫలమైంది. అందుకోసం తగిన ప్రయత్నాలను సాగిస్తారన్న ఆశను మాత్రం మిగిల్చింది.

తేదీ : 30-12-2017

బి. హనుమారెడ్డి,
94402 88080

"మాతృభాష వాడకం ఒక హక్కు' - సుప్రీంకోర్టు
'న్యాయస్థానాల్లో తెలుగువాడకం చట్టబద్ధమే'

న్యాయస్థానాల్లో తెలుగు కోసం ఉద్యమం


దేశానికి స్వతంత్రం వచ్చాక మాతృభాషల గౌరవాన్ని, రక్షణను, హక్కులనుగూర్చి రాజ్యాంగంలో వ్రాసుకున్నాం. కాని ఇప్పుడు మన మాతృభాష తెలుగు అగౌరవించబడుతున్నది. శాసన విభాగంలోను, న్యాయ విభాగంలోనూ, పరిపాలనా విభాగంలోనూ, విద్య, వాణిజ్య రంగాలలోను ఏ ఇతర రాష్ట్రాలలోనూ వారి మాతృభాషలకు రాని ప్రమాదం తెలుగు రాష్ట్రాల్లో మన మాతృభాషకు వచ్చింది.

తెలిసే జరుగుతోన్న దుర్మార్గం

ప్రత్యేకించి న్యాయవ్యవస్థలో వచ్చిన ప్రమాదాన్ని గూర్చి చర్చించుకుందాం. ఈ ప్రమాదం న్యాయవాదులకు, న్యాయమూర్తులకు తెలిసే జరుగుతున్నదని తెలుపుటకు చింతిస్తున్నాను.

బ్రిటీషువారు దేశాన్ని పరిపాలించిన రోజుల్లో కూడా న్యాయస్థానాల్లో తెలుగుభాష, ఇతర మాతృభాషలు ఇంత నిరాదరణకు గురి కాలేదు. దాదాపు 1970 సంవత్సరం ప్రాంతాల వరకు గౌరవ ఉన్నత న్యాయ స్థానంలో తప్ప మిగతా దిగువస్థాయి న్యాయస్థానాల్లో చాలవరకు తెలుగు వాడకం ఉన్నది. ముఖ్యంగా న్యాయవాదులు, న్యాయవాది గుమస్తాలు తెలుగునే వాడుకున్నారు. వారికి ఇంగ్లీషు రాకకాదు. మాతృభాషపై ప్రేమతో, గౌరవంతో భావప్రసార సౌలభ్యంతో. కాని విద్య, ఉద్యోగాలు, ఉపాధులు, వ్యాపారాలు, వ్యాజ్యాలు ధనం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటం వలన, ఆంగ్లంపై మోజుతో తెలుగు ప్రక్కకు నెట్టివేయబడింది. తెలుగు భాషపై ఆంగ్లప్రభావం ఊపిరి తిప్పుకోలేనంతగా పడింది. తెలుగింటి తలుపులు మూసేశాము. తెలుగు పునాదులకు కూడ ప్రమాదం వచ్చింది.

గణాంక వివరాలను బట్టి మన తెలుగు రాష్ట్రాలలో న్యాయస్థానాలకు వచ్చే కక్షిదారులలో తెలుగు భాష రానివారు 5 శాతం



మాత్రమే. మిగతా వారందరూ తెలుగువారే. తెలుగు తెలిసిన వారే. తెలుగును వాడగలిగిన వారే. తెలుగును కోరుకునేవారే. ఆంగ్లంనే కోరుకున్న వారు కాదు. న్యాయస్థానాల్లో వారు దాఖలు చేయు పత్రాలన్నీ తెలుగువే. క్షేత్రస్థాయిలోని 95 శాతం కక్షిదారులకు జరుగు అన్యాయాన్ని ఆలోచించకుండా 5 శాతం వారికోసం ఆంగ్లంను వాడే విధానంలోకి వచ్చాయి న్యాయస్థానాలు. న్యాయవ్యవస్థలో తెలుగు నెందుకు వాడరు? తప్పెవరిది? ఇది కక్షిదారుల తప్పుకాదు. ముందు కారణం న్యాయవాదులదైతే, తరువాతి కారణం న్యాయమూర్తులది. మరికొంత కారణం ప్రభుత్వంలోని న్యాయపాలనా విభాగం. కక్షిదారులు కోరినా తెలుగును వాడే పరిస్థితిలో లేదు. ఇది రాజ్యాంగం లోని భాషా హక్కులకు విఘాతం కలిగించటమే. భాషా హక్కులను రక్షించే బాధ్యత న్యాయవ్యవస్థపై ఎక్కువగా వుంది.

ప్రస్తుతం న్యాయస్థానాల్లో దాఖలయే దావాలు, అర్జీలు, వాటికి జవాబులు, ఫిర్యాదులు, సాక్షుల సాక్ష్యాలు, తీర్పులు నూటికి నూరు శాతం ఆంగ్లంలోనే ఉంటున్నవి. ప్రథమంలో న్యాయవాదులవద్ద, తదుపరి న్యాయస్థానాలలో మాతృభాష తీవ్ర తృణీకారానికి గురైంది. ఈ పరిస్థితి న్యాయవాదులకు, న్యాయస్థానాలకు, ప్రభుత్వానికి తెలియనిది కాదు. వారికదొక సంతృప్తి. ఆంగ్లం భుజకీర్తి అనే భావన. అది తెలివికలవాడి భాష అనే అనుచిత భావన. ఏ తెలుగువాడి మెదడును తెరచి పరిశోధించి పరిశీలించినా తెలుగు "సాఫ్ట్‌వేర్" ఉంటుంది. అది వీరి కోరిక మీద విషయాన్ని తెలుగులో ఆలోచించి ఆంగ్లంలోకి తర్జుమాచేసి చెబుతుంది. ఇది సైన్సు. కాదనలేము. తమ వ్యాజ్యాలలో ఏమి జరుగుతున్నదో, ఏమి నమోదౌతున్నదో కక్షిదారులు స్వయంగా తెలుసుకోలేక నష్టపోతున్నారు. వారు చీకటిలోకి నెట్టబడుతున్నారు. తాను చెప్పదలచిన, చెప్పిన, అంశం యథాతథంగా వ్రాయబడిందో – లేదో స్వయంగా తెలుసుకునే అవకాశం కక్షిదారునికి లేకుండా పోతున్నది. కక్షిదారుడు స్వయంగా తన దస్త్రం తాను తెలుసుకోలేకుండా, తన న్యాయవాది చేసే వాదనను తాను తెలుసు కోలేకుండా ఉన్నాడు. ఆంగ్లంలో నమోదైన సాక్ష్యాలను సాక్షుల మాతృ భాషలో చదివి, వినిపించి, సరిగా ఉన్నదని నిర్ధారణ చేసుకునే చట్టం వున్నా యంత్రాంగం లేనందున నమోదైన సాక్ష్యాలపై కక్షిదారులు, సాక్షులు, అయోమయంగా, నిరాధారంగా, గుడ్డిగా సంతకాలు చేయ టం రోజూ న్యాయస్థానాల్లో చూస్తూనే వున్నాం. వాదోపవాదాలు ఆంగ్లంలో ఉండటం వలన న్యాయస్థానంలో తన వ్యాజ్యంలో ఉభ యుల న్యాయవాదులు ఏం చెప్పారో కక్షిదారులకు తెలియటం లేదు. ఫిర్యాదుదారులకు, నిందితులకు వారి వ్యాజ్యంలో అభియోగాలేమిటో, సాక్ష్యాలేమిటో, తీర్పు ఏమిటో తెలియటం లేదు. తెలుసుకోవటానికి మరొకరి దయా దాక్షిణ్యాలు, వారి పరిజ్ఞానంపై ఆధారపడవలసి వస్తుంది. వారికి **రాజ్యాంగం ఇచ్చిన మాతృభాషా హక్కులను ఈ వ్యవస్థ కాలదన్నుతుంది. ఇది విచారకరం. భాషా ప్రాతిపదికపై రెండు తెలుగు రాష్ట్రాలలో పరిపాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఏర్పడ్డాయి. కాని అవి భాషాపరంగానే దారి తప్పాయి.**

గాంధీ, వివేకానందుడు లాంటి పెద్దలు మాతృభాషలలో విద్య, దస్త్రాలు, ఉండాలన్నారు. సామాన్య ప్రజల కోసం, సామాన్యుల భాషను న్యాయస్థానాల్లో వాడాలని, అందుకు వ్యవస్థలో మార్పు రావాలో 1931లో గోల్కొండ పత్రిక సంపాదకులు కీ.శే సురవరం ప్రతాపరెడ్డి సంపాదకీయం వ్రాశారు. భాషాభిమానులు, కక్షిదారులు, తెలుగు వాడకం అవసరాన్ని గురించి నొక్కి చెప్పారు. కొందరు రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తులు సానుకూలంగా స్పందించారు. భావ వ్యక్తీకరణ పరాయి భాషలో కంటే మాతృభాషలోనే స్పష్టంగా ఉంటుందని పరి శోధనలు తెలిపాయి. మాతృభాషలో వ్యాజ్యాలను పరిష్కరిస్తే కక్షిదా రుల భాషా హక్కులు కాపాడబడతాయి. 'వాడుకలో లేనిభాష వాడిపోయినట్లే'నని ఐక్యరాజ్య సమితివారు పదేపదే గుర్తు చేస్తున్నారు. మాతృభాష కొరకై బంగ్లాదేశ్‌లో వచ్చిన ఉద్యమంలో 1952 ఫిబ్రవరి 21వ తేదీన పోలీసు కాల్పుల్లో మరణాలు జరిగిన తరువాత ఐక్య రాజ్య సమితి దీర్ఘకాలం భాషాశాస్త్రం భాషల వాడకంపై అధ్యయనం చేసి ప్రపంచంలోని దేశాలన్నింటిని ప్రతి ఫిబ్రవరి 21వ తేదీని ప్రపంచ మాతృభాషా దినంగా పాటించాలని నిర్ణయించి ప్రపంచానికి పిలుపు నిచ్చారు. ఏదేశంలోని మాతృభాషలను ఆదేశం గౌరవించుకుంటుంది. మనంకూడ మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నాము. ఇది **న్యాయస్థానాలకు వర్తించదంటే పొరపాటే. మాతృభాషకు ప్రపంచమే ప్రాముఖ్యతనిచ్చింది. కాని మనం చైతన్యవంతులం కాలేక పోతున్నాము.**

రాజ్యాంగం – ప్రభుత్వ ఉత్తర్వులు

మన రాజ్యాంగం గుర్తించిన 22 భాషలలో తెలుగొకటి. మాతృభాషలను (మనకు తెలుగు, ఉర్దూ వగైరా) న్యాయస్థానాలలో వాడుటకు వీలు కలిగిస్తూ రాజ్యాంగంలో ఆర్టికల్ 29, 345 నుండి 349 వరకు పొందుపరిచారు. రాజ్యాంగం మృతవాక్యం కారాదు. బ్రిటీషువారు వ్రాసిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో 272, 354, 363, 364 సెక్షన్‌లలో, సివిల్ ప్రొసీజర్ కోడ్‌లో 137 సెక్షన్, ఆర్డరు – 18 రూలు 9 లను న్యాయస్థానాలలో మాతృభాషల వాడకం కోసం వ్రాశారు. మన రాష్ట్రంలో 1966లో చేసిన అధికార భాషా చట్టం న్యాయస్థానాల్లో తెలుగు వాడకం అవసరాన్ని నిర్ద్వంద్వంగా తెలిపింది. అదే అవసరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ.ఎమ్.ఎస్. నం. 485 (హోం) తేది 29-03-1974ను విడుదల చేసి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మాతృభాషలైన తెలుగు, ఉర్దు, తమిళం, కన్నడ, మరాఠి భాషలను జిల్లాల వారీగా చెబుతూ వాటితోపాటు ఇంగ్లీషును కూడ చేర్చి న్యాయస్థానాల్లో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి ఈ జి.ఓ.ను పంపింది. అంతేకాక ఇందుకొరకు పలువిధాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ.ఎమ్.ఎస్. సం.371 తేది28-06-1985, జి.ఓ. ఎమ్.ఎస్. నం. 536 తేది 21-10-1986 లను విడుదలచేసి న్యాయస్థానాల్లో తెలుగును వాడటానికి అవకాశం కల్పించింది. ఇవేకాక మరి 11/12 జి.ఓ.లు కూడ ప్రభుత్వం విడుదలచేసింది. వీటితో పాటు యు.ఓ.నోట్ నం. 4590-1 తేది 25-1-2005ను విడుదలచేసి న్యాయస్థానాల్లో తెలుగు మరితర మాతృభాషల వాడుకకు వీలుగా వుండునట్లు చర్యలు తీసుకోవాలనే ఉద్దేశాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి తెలిపింది. ఇదంతా న్యాయస్థానాలలో తెలుగును వాడే ప్రయత్నమే. కాని ఈ జి.ఓ.లన్నీ నిరర్ధకమైనాయి. న్యాయవాదులు, న్యాయస్థానాలు మాతృభాష తెలుగును ప్రక్కకు తోసేశారు.

1965 సంవత్సరంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం వారు

ఒక కేసు తీర్పులో మాతృభాషల వాడకాన్ని చర్చిస్తూ **"భాషలను భద్రపరచు హక్కు భాషా పరిరక్షణోద్యమంలో భాగం"** గా తీర్పు నిచ్చారు (చూడుము ఎ.ఐ.ఆర్. 1965 సుప్రీంకోర్టు 183వ పేజి). **మాతృభాష వాడకం ఒక "హక్కుగా" నిర్ధారించారు.** మనరాష్ట్ర ఉన్నత న్యాయస్థానం 2005వ సంవత్సరంలో ఒక హత్యకేసు అప్పీలులో క్రింది కోర్టువారు తెలుగులో వ్రాసిన కొంత భాగం తీర్పు చెల్లదని **న్యాయవాది వాదనచేయగా పై చట్టాలను, జి.ఓ.లను ఉటంకిస్తూ న్యాయస్థానాల్లో తెలుగు వాడకం చట్టబద్ధమేనని జస్టిస్ శ్రీ ఎమ్. వెంకటేశ్వరరెడ్డి, జస్టిస్ శ్రీ జె.చలమేశ్వర్‌లతో కూడిన ధర్మాసనం చరిత్రాత్మకమైన తీర్పునిచ్చింది.** (చూడుము 2005 (2) ఎ.ఎల్.డి. (క్రిమినల్) 758). ఈ తీర్పు ప్రభుత్వానికి తెలిసినదే. న్యాయవాదులకు, న్యాయమూర్తులకు తెలిసినదే. కాని కనువిప్పు కలుగలేదు. కారణం అర్థం కాదు. వారికి తెలుగు రాకనా లేక వారు ఆంగ్లంలో పండితులనా? న్యాయస్థానాలలో తెలుగును తిరస్కరించటం దోషము, దుండగము అగునేమో ఆలోచించాలి.

మన మాతృభాష తెలుగులో మచ్చుకు వేళ్ళమీద లెక్కించదగ్గ తీర్పులు మాత్రం వచ్చాయేగానీ న్యాయస్థానాలలో తెలుగును వాడటం లేదు. ఉదాహరణకు లోకాయుక్త జస్టిస్ శ్రీ ఆవుల సాంబశివరావు, జస్టిస్ శ్రీ ఆర్. రామానుజం, జస్టిస్ శేషశయనరెడ్డి, న్యాయమూర్తులు శ్రీ మంగారి రాజేందర్, శ్రీ ఆదిత్య ప్రతాప్ భాంజ్‌దేవ్, శ్రీ కె.బాల కృష్ణారెడ్డి, శ్రీ జె.వి.వి. సత్యనారాయణ మూర్తి మరికొందరు మాత్రమే ఎక్కడో కొన్ని తీర్పులను తెలుగులో వెలువరించారు. ఈ మధ్యనే న్యాయస్థానంలో వాడే అవసరమున్న శవపరీక్ష నివేదికను డా॥ వరద రాజులు తెలుగులో వ్రాశారు. ఈ మధ్య ఒంగోలులోని అయిదు న్యాయస్థానాలలో ఒకే కాలంలో తెలుగులో తీర్పులొచ్చాయి. వారందరికీ మనం కృతజ్ఞతలు, అభినందనలు తెలిపాము, ప్రకాశం జిల్లా రచయితల సంఘం సన్మానించింది. ఇది ఎప్పుడో, ఎక్కడో జరుగు సంఘటన మాత్రమే.

హిందీ రాష్ట్రాలలోని న్యాయస్థానాల్లో హిందీని, మన పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు రాష్ట్రంలోని న్యాయస్థానాల్లో తమిళాన్ని, కర్నాటక రాష్ట్రంలోని న్యాయస్థానాల్లో కన్నడను వాడుతూ కక్షిదారులకు న్యాయం చేస్తున్నారు. మన రాష్ట్రంలో తెలుగును వాడటం తప్పుగా, నామోషీగా, చిన్నతనంగా భావించే న్యాయవాదులు, న్యాయమూర్తులు, సిబ్బంది వున్నారు. కొందరు వచ్చీరాని ఆంగ్లభాషను వాడి అర్థంకాని విధంగా వ్యవస్థను ఉభయ భ్రష్టత్వ దిశగా నడుపుతున్నారు. ఇది సిగ్గుతో తలదించుకోవలసిన విషయం. తెలుగు వాడితే న్యాయమూర్తులకు, న్యాయవాదులకు నష్టంరాదు. చట్టం అడ్డురాదు. వారి భుజకీర్తులు రాలిపోవు. భాషా హక్కుల రక్షణ బాధ్యత వారందరిపై ఉన్నది. మాతృభాషపై చిన్నచూపు మాతృద్రోహం.

దేశాన్ని బ్రిటీషువారు వదిలినా దేశప్రజల్లో భావ దారిద్ర్యం, భాషాదాస్యం వదల్లేదు. మనకు మాతృభాషపై గౌరవం కలగనే లేదు. విద్యా వ్యవస్థల్లో ప్రభుత్వంలోని పెద్దల దుర్భావనల వల్ల విద్యా పరిపాలనా రంగాల్లో మన మాతృభాష మరణానికి దగ్గరలో వుంది. న్యాయస్థానాలలో కూడా ఆ ప్రమాదం వచ్చింది.

న్యాయవ్యవస్థలోని వ్యక్తులందరూ తెలుగు ప్రజల కష్టార్జితంతో వేతనాలు, పరిహారాలు పొంది జీవిస్తున్నారు. తెలుగు గాలి పీలుస్తున్నారు. తెలుగు గడ్డపై పండిన పంటలను భుజిస్తున్నారు. తెలుగు ప్రజలకొరకు నియమించబడ్డారు. కనుక తెలుగు ప్రజల మేలుకు తెలుగు భాషను గౌరవించటానికి, తెలుగును న్యాయస్థానాల్లో వాడటానికి ఎట్టి అడ్డు, ఆటంకాలు లేవు. మన గాలికి, మన నీటికి, మన తిండికి మనం బాకీపడివున్నాం. బాకీ తీర్చుదాం. ఎవరి మాతృభాషను వారు వాడకుండా ఆయా ప్రదేశాల్లో నివసించు హక్కు వారికి ఉందా అని ప్రశ్నించుకోవాలి. ప్రజల ముంగిటకు న్యాయం తేవడమంటే ప్రజల భాషను న్యాయస్థానాల్లో వాడటమే. ప్రజలకు న్యాయం చేకూరేది ప్రజల భాష వాడటం వలననే. కక్షిదారుడు తర్జుమాకొరకు ఎక్కడకూ పోకుండా, తన న్యాయవాది, తనన్యాయమూర్తి తన భాషలోనే దస్త్రాలు, వాదప్రతివాదనలు, తీర్పులు ఇవ్వడమే రాజ్యాంగ బద్ధం.

అత్యవసర చర్యలు చేపట్టాలి

ఇందుకు ప్రభుత్వ పక్షాన, న్యాయవ్యవస్థ పక్షాన తీసుకోవలసిన అత్యవసర చర్యలు కొన్ని వున్నాయి. మొన్న 28-10-2017 న మన రాష్ట్రపతి గౌరవనీయులు రామ్‌నాథ్ కోవింద్‌గారు మరియు సర్వోన్నత ముఖ్య న్యాయాధిపతి, కేంద్ర న్యాయశాఖామంత్రి, హైకోర్టు జడ్జీలు, వగైరా రాజ్యాంగ బాధ్యులు కలిసి పాల్గొన్న కేరళ రాష్ట్ర హైకోర్టు వజ్రోత్సవ సభలో గౌరవ రాష్ట్రపతి ప్రసంగిస్తూ హైకోర్టుల లోని తీర్పులు ప్రాంతీయ భాషలలోకి మూడురోజులలోనే తర్జుమా చేసి కక్షిదారులకిచ్చి వారి హక్కులను కాపాడు వ్యవస్థను ఏర్పాటు చేయవలసినదిగా సూచించారు. అదేసభలో న్యాయస్థానాలలో ప్రాంతీయ భాషల వాడకం అవసరమైన హక్కుగా తెలిపారు. దేశ ఉప రాష్ట్రపతి గౌ॥ వెంకయ్య నాయుడు గారు కూడ వేరు వేరు సభలలో ఇదే సూచించారు. ఇవన్నీ దృష్టిలో వుంచుకొని రాష్ట్ర చట్టాలన్నీ తెలుగులో రాయాలి. చట్టాలన్నీ శాసన సభలలో తెలుగులో ప్రవేశ పెట్టాలి. ఇప్పటికీ ఆంగ్లంలో వున్న చట్టాలను తెలుగులోకి, ఇతర మాతృభాషల్లోకి అనువాదం చేయించాలి. ఒక పూర్తిస్థాయి అనువాద వ్యవస్థను ప్రభుత్వపరంగాను, మరొకటి న్యాయవ్యవస్థ పరంగా ఏర్పాటు చేయాలి. అవసరమైన దస్త్రాలను లేదా భాగాలను తర్జుమా చేసుకోవచ్చు. కేవలం 5 శాతం దస్త్రాలకోసం, కొందరు న్యాయమూర్తులకోసం తెలుగును వాడకపోవటం చట్టబద్ధం కాదు. న్యాయబద్ధం కాదు. తెలుగు సాఫ్ట్‌వేర్‌ను అన్ని న్యాయస్థానాలకు అందించి అనుభవజ్ఞులైన లేదా తర్ఫీదు పొందిన సిబ్బందిని నియమించుకొనే అధికారాన్ని న్యాయస్థానాలకు ఇవ్వాలి. న్యాయస్థానాల వెబ్‌సైట్‌లన్నీ తెలుగులో ఉండాలి. అవసరమగు సందర్భంలో ఆంగ్లానికి తర్జుమా చేసుకొను వ్యవస్థ ఉండాలి. న్యాయమూర్తులకు, సిబ్బందికి పునశ్చరణ తరగతులను నిర్వహించాలి. లా డిగ్రీల చదువులలో తెలుగు మాధ్యమం అవసరం. అలా చదవనివారికి అదనంగా తెలుగుభాషలో లేదా రాష్ట్ర ఆయా యితర మాతృభాషల్లో తగు విధంగా పరీక్షలు నిర్వహించి పట్టాలివ్వవచ్చు. ఇది ప్రభుత్వం తన బాధ్యతగా తీసు కోవాలి. మాతృభాషా మాధ్యమంలో లేదా మాతృభాషను (ఐ.ఎ.ఎస్.లో వలే) ప్రధానాంశంగా చదివి డిగ్రీలు పొందిన వారికి న్యాయ మూర్తులు ఉద్యోగాలలో ప్రాధాన్యతనివ్వటం అవసరం. మరియు ఆంగ్ల మాధ్యమంలో



ఒంగోలులో తెలుగులో కోర్టు తీర్పులు : జిల్లా జడ్జి ఆదర్శం



తెలుగులో తీర్పులు వెలువరించిన ప్రకాశం జిల్లా అత్యున్నత న్యాయమూర్తి ప్రియదర్శినిగారికి అభినందనలు తెలుపుతున్న ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు బి.హనుమారెడ్డి, కార్యదర్శి పొన్నూరు వెంకట శ్రీనివాసులు, కోశాధికారి వై.కొండారెడ్డి మరియు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.భాస్కరరావు.

ప్రపంచ తెలుగు మహాసభల స్ఫూర్తితో, మాతృభాషపై మమ కారంతో తెలుగులో తీర్పులిచ్చినట్లు ప్రకాశం జిల్లా జడ్జి ఎం.జి. ప్రియ దర్శిని ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ తెలుగు భాషలో న్యాయ స్థానాల వ్యవహారాలు జరిగితే... కక్షిదారు లకు తమ వ్యాజ్యంలో వాదోపవాదాలు ఎలా జరుగుతు న్నాయో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. త్వరితంగా వ్యాజ్యం పరి ష్కారం కావడానికి అవ కాశం ఉంటుందన్నారు. న్యాయస్థానాల్లో తెలుగులో తీర్పులు చెప్పే విషయంలో సాంకేతికంగా కొన్ని ఇబ్బం దులు ఉన్నా అధిగమించా మన్నారు. ప్రస్తుతం హైకోర్టు అందించిన కంప్యూటర్లు ఇంగ్లిష్‌ను మాత్రమే గుర్తిస్తాయన్నారు. తెలుగు స్టెనో గ్రాఫర్లు కావాల్సి ఉంటుందన్నారు. కొన్ని ఇంగ్లీష్ పదాలకు తెలుగు అర్థాలు లభించని పరిస్థితి ఉందన్నారు. ఒకటో అదనపు జిల్లా జడ్జి ఆర్.జె.విశ్వనాథం మాట్లాడుతూ మాతృభాషలో భావ వ్యక్తీకరణ చేసినట్లు పరాయి భాషలో చేయలేమన్నారు. న్యాయస్థానాల్లో తెలుగులో వాదోప వాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఏడో అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్ మాట్లాడుతూ వ్యవస్థలో మార్పు కోసం చిన్న ప్రయత్నం చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని తీర్పులు తెలుగులో చెప్పడానికి ప్రయత్నిద్దామన్నారు. భావ వ్యక్తీకరణ సరిగా లేకపోతే అర్థమే మారిపోతుందన్నారు. జూనియర్ న్యాయమూర్తులు ఎ.పూర్ణిమ, ఎం.అనూరాధ, ఎన్.శారద, బి.వాణీశ్రీ తెలుగులో తీర్పులు చెప్పడానికి చేసిన ప్రయత్నాలను వివరించారు. కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.భాస్కరరావు అధ్యక్షత వహించారు. సీనియర్ న్యాయవాదులు తెలుగులో న్యాయస్థానాల కార్యకలాపాలు నిర్వహించడం వల్ల న్యాయవాదులకు, కక్షిదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేసుల్లోని వాస్తవ పరిస్థితులను కక్షిదారులు తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ న్యాయవాది ఎం.అజయ్‌బాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శివరామకృష్ణ ప్రసాద్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కరణం వాసుదేవరావు, జె.రాజు,బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.వి.శివరామకృష్ణ, కోశాధికారి సి.హెచ్. కృష్ణమూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు. న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

చదివిన వారైనా మాతృభాషను విధిగా ఒక అంశంగా చదివిన వారికి మాత్రమే రాష్ట్రంలో న్యాయమూర్తి ఉద్యోగం యిచ్చునట్లు నియామక విధానంలో తగు విధంగా మార్పులు చేయాలి. రాష్ట్రంలో న్యాయ స్థానాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే వుండాలి. న్యాయ స్థానాలలో, న్యాయ పరిపాలనలో తెలుగువాడిన న్యాయమూర్తులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. తెలుగు వాడకంలో మేటియైన వారికి పదో న్నతి నిచ్చుటకు తగు విధంగా సర్వీసు నిబంధనలు రూపొందించాలి. అలానే, తెలుగు వాడని వారిని నిబద్ధించుటకు నిబంధనలు తేవాలి. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం, పరిపాలనా విభాగం వారు భాషాపరంగా జవాబుదారీతనాన్ని స్వీకరించి తెలుగు వాడకాన్ని ప్రోత్సహించడమే కాకుండా అజమాయిషీ చేస్తూ కొన్ని కొన్ని విషయాలలో నిర్బంధం చేయవచ్చు. ఇందుకై దేశ సర్వోన్నత న్యాయ స్థానంతో సంప్రదించాలి.

న్యాయవ్యవస్థ, తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ చేయి చేయి కలిపి నడిచే విధానం అవసరం. భాషా ప్రాముఖ్య తల విషయంలో ప్రభుత్వాలకు, న్యాయమూర్తులకు, న్యాయవాదులకు మాతృభాష తెలుగు పై చిన్నచూపు తగదు.

ధనికులకోసమే కాదు న్యాయస్థానాలు. పేదప్రజలకు కూడా న్యాయస్థానంలో భాషాపరంగా న్యాయం జరగాలి. ఎవరూ తన మాతృభాషను పోగొట్టుకోరాదు. ఎవరూ మాతృభాషా హక్కుకు భంగం కలిగించరాదు.

రాష్ట్రంలో క్రిందిస్థాయి న్యాయస్థానాల్లోని న్యాయవాదులు, న్యాయమూర్తులు, సిబ్బంది తెలుగునే వాడేట్లు ప్రతిజ్ఞ చేద్దాం. తెలుగు రాష్ట్రాల అవతరణ ఉత్సవాలను, మాతృభాషా దినోత్సవాలను న్యాయ స్థానాల ప్రాంగణంలో కూడా జరుపుకునేట్లు ఉన్నత న్యాయస్థానాన్ని సంప్రదించాలి. దేశభక్తి గీతాన్ని గౌరవించినంతగా మాతృభాషను గౌరవిద్దాం. దావా అర్జీలు, సాక్ష్యాలు, వాదోపవాదాలు, తీర్పులు మాతృభాషలోనే రాద్దాం. తెలుగు, మరితర భాషలు మాతృభాషలుగా గల సామాన్య ప్రజలకోసం, ఆ ప్రజలవలన, ఆ ప్రజలచేత న్యాయ స్థానాలు ఏర్పాటు చేయబడ్డాయన్న సత్యాన్ని గుర్తిద్దాం.

రచయిత – ప్రముఖ న్యాయవాది. ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు. తెలుగు భాషోద్యమకారుడు.

- సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650.

తెలుగు వెలుగులు ప్రపంచానికి పంచుదాం
తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటుదాం

తెలంగాణా సాహిత్య వైభవాన్ని ఎలుగెత్తి చాటిన తెలుగు ప్రపంచ మహాసభలు!



డిసెంబర్ 14, 2017 నుండి 19 వ తేదీ వరకు అయిదురోజులపాటు జరిగిన తెలుగు ప్రపంచ మహాసభలు తెలంగాణా భాషా సాహిత్య, చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ఎలుగెత్తి చాటాయి. 2013లో తిరుపతిలో ఉమ్మడిరాష్ట్రంలో ఉన్నప్పుడు జరిగిన 4వ ప్రపంచ మహాసభలను తెలంగాణా ఉద్యమకారులు బహిష్కరణకు పిలుపునిచ్చారు. 1975లో తొలిసారి హైదరాబాద్‌లో తొలి ప్రపంచ తెలుగు మహాసభల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఆవిష్కరణ జరిగిన 3 సంవత్సరాలకు తొలిసారిగా హైదరాబాద్ వేదికగా ఇప్పుడు మళ్లీ ప్రపంచ మహాసభలు జరిగాయి. అంటే 42 ఏళ్ళ తర్వాత హైదరాబాదులో జరిగిన సభలివి.

తెలంగాణా ప్రభుత్వ సారథి కెసిఆర్ తెలంగాణా సాహిత్య అకాడమీని ఏర్పాటుచేసిన తరుణంలో ఈ ప్రపంచ మహాసభల నిర్వహణకు తెరలేపారు. సుమారు 50 కోట్లు బడ్జెట్ ప్రాతిపదికగా ఈ మహాసభలను అకాడమి అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి నేతృత్వంలో జరుపనున్నట్లు ప్రకటించి, తెలుగు సాహిత్య లోకాన్ని అబ్బురపరచారు. దసరాకు జరగాల్సిన సభలు, వాయిదా పడి చివరకు డిసెంబర్‌లో ఐదురోజులపాటు జరపాలన్న నిర్ణయం కెసీఆర్ ఆదేశాలతో సజావుగా జరిగిపోయింది.

తెలంగాణా ప్రభుత్వం ఈ మహాసభలను ఎలా నిర్వహించ గలుగుతుందో అనే ఆసక్తి నెలకొంది. దీనికి ప్రణాళికా వ్యూహం తొలుత గజిబిజిగా కనిపించినా, ప్రగతిభవన్‌లో కేసీఆర్ అటు సాహిత్యవేత్తలు, తర్వాత అధికారులు, వివిధ ప్రభుత్వ సంస్థల ఛైర్మన్‌లతో విడివిడిగా, దఫదఫా లుగా చర్చించి ఈ మహాసభల కార్యక్రమాలను పకడ్బందీగా రూపొం దించారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.పి. సింగ్‌లతో పాటు, మున్సిపల్ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, హైదరాబాద్ బల్దియా అధికారులను, వివిధ శాఖల మంత్రులను గాడిన పెట్టడంతో మహా సభల వేదికల ఏర్పాట్లు, భోజన వసతుల ఏర్పాట్లకు అనుసంధానం జరిగిపోయింది. భోజన వసతులను పౌర సరఫరాలు, రెవెన్యూ శాఖలకు అప్పగించారు. తెలంగాణా రుచులతో వంటకాలను, తీపి పదార్థాలను ఆయా వేదికల వద్ద ఏర్పాటు చేసి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేశారు. దాదాపు 10 నుండి 12 వేల మంది కవులు, రచయితలు, పోలీస్ - ఇతరత్రా సిబ్బంది ఈ వంటకాల రుచులను ఆస్వాదించారు. అయిదు రోజులలో 60 నుండి 70 వేల మంది ఈ భోజనాల ఆతిథ్యాన్ని చవిజూసి - తమ సంతృప్తిని వ్యక్తం చేయడం కనిపించింది. ఆంధ్రప్రదేశ్‌తో సహా, కర్ణాటక, తమిళనాడు వంటి ఇరుగుపొరుగు రాష్ట్రాల నుండి అధికసంఖ్యలో తెలుగు భాషా ప్రియులు ఈ మహా సభలకు హాజరయినారు. ఒరియా, కేరళ, ఢిల్లీ, గుజరాత్ వంటి సుదూర ప్రాంతాల నుండి రచయితలు ఈ మహా సభలకు హాజర య్యారు. రాష్ట్రంలోని 31 జిల్లాలు దేశంలోని 17 రాష్ట్రాలు, 42 దేశాల నుండి దాదాపు 16 వేల మంది తెలుగు ప్రతినిధులు ఈ సభలకు ఒక వేడుకలో పాల్గొన్నట్లుగా హాజరయ్యారు. ఎన్.ఆర్.ఐ. తెలుగువారికి వివిధ స్టార్ హోటళ్ళలో వసతి, భోజన, వాహన సదుపాయాలు కల్పించారు. ఇరుగుపొరుగు రాష్ట్రాల తెలుగు ప్రతి నిధులకు చక్కటి ఏసీ సదుపాయం వున్న హోటళ్ళలో బస, వాహన సదుపాయాలు కల్పించారు. ప్రారంభసభకు 35 వేల మంది రాగా, ముగింపు సభకు 40 వేల మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సభల్లో దాదాపు 4 వేల మంది కవులు, రచయితలు సందడి చేశారు. మహిళా రచయిత్రిలు సైతం అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఈ మహాసభలలో భాషా సదస్సులు, బాల కవి సమ్మేళనం, మహిళా కవి సమ్మేళనం, అష్టావ - శతావధానాలు, బృహత్‌వచన కవి సమ్మేళనాలు, శాస్త్రీయ - జానపద నృత్య కార్యక్రమాలు, చర్చా గోష్టులు, కథా, నవలా, సదస్సులు, తెలంగాణ శతక, సంకీర్తనా, గేయ సాహిత్యం, తెలంగాణా విమర్శ - పరిశోధన, తెలంగాణా

పత్రికలు, న్యాయ పరిపాలనా రంగాలలో తెలుగు, తెలంగాణా చరిత్ర – పరిశోధనలు, బాల సాహిత్య సదస్సు, తెలంగాణా మహిళా సాహిత్యం సదస్సు, విదేశీ తెలుగువారితో గోష్ఠి, రాష్ట్రేతర తెలుగు వారితో గోష్ఠి, తదితర రంగాలపై కార్యక్రమాలు జరిగాయి.

రవీంద్రభారతి ప్రివ్యూ థియేటర్‌లో యువ చిత్రోత్సవ పోటీలో ఎంపిక చేసిన లఘుచిత్రాల ప్రదర్శనలు జరిగాయి. రవీంద్రభారతి, చిత్రమయి ఆర్ట్ గ్యాలరీలో కార్టూన్‌లు, ఛాయాచిత్రాలు, చిత్రకారుల కళాచిత్ర ప్రదర్శనలు జరిగాయి. తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వివిధ చిత్రకళాకారుల చిత్ర ప్రదర్శనలు, సాహితీ వేత్తల ముఖచిత్రాల ప్రదర్శనలు భాషా ప్రియులను ఆకర్షించాయి, ఎల్‌బి స్టేడియం, తెలుగు విశ్వవిద్యాలయంలో పుస్తక ప్రదర్శన అంగళ్ళను, ఆహార పదార్థాల అంగళ్ళను ఏర్పాటు చేశారు. ప్రతినిధులుగా నమోదు చేసుకొని మహాసభలకు విచ్చేసిన 6 వేలమంది ప్రతినిధులకు మహాసభల కిట్లను నిర్వాహకులు అందజేశారు.

ఈ మహాసభలకు ప్రధాన వేదికగా ఎల్‌బి స్టేడియాన్ని తీర్చి దిద్దారు. దానిని పాల్కురికి సోమనాథుడి ప్రాంగణంగా, వేదికను భాగవతకర్త మహాకవి బమ్మెర పోతనామాత్యుడి పేరున ఏర్పాటు చేశారు. వేదిక పైన తెలంగాణా తల్లి విగ్రహాన్ని వుంచి తెలంగాణా సాంస్కృతిక వైభవ ప్రశస్తిని పరిమళింపజేశారు. ప్రారంభసభకు ఉపరాష్ట్రపతి, తెలుగువారైన ముప్పవరపు వెంకయ్యనాయుడు హాజరుకాగా, ముగిం పుసభకు రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరై, ఈ మహాసభల గౌరవాన్ని పతాకస్థాయిలోకి తీసుకెళ్ళారు. విశిష్ట అతిథులుగా మహారాష్ట్ర గవర్నర్ తెలంగాణ వాడైన విద్యాసాగరరావు ప్రారంభ సమావేశంలో పాల్గొన్నారు.


ఉపవేదికలుగా తెలుగు విశ్వవిద్యాలయం, ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం, రవీంద్రభారతిలోని రెండు వేదికలు, తెలంగాణా సారస్వత పరిషత్తులను ఆడిటోరియం ఏర్పాటు చేసి, ఐదు రోజుల కార్యక్రమాలను సజావుగా నిర్వహించేలా చూసుకున్నారు.

నగరంలో 60కిపైగా వివిధ చారిత్రక, సాంస్కృతిక సాహితీ మూర్తుల స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు.నగరంలో ఎటు చూసినా తెలుగు మహాసభల స్వాగత ద్వారాలు, ఫ్లెక్సీలు, మినీ విద్యుద్దీప కాంతుల తోరణాలు కనిపించడంతో, తెలుగు తెలంగాణా సాంస్కృతిక వైభవం సజీవంగా కళకళలాడినట్లయింది.

ప్రధాన వేదికైన ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభ, ముగింపు సమావేశాలతో పాటు, మిగతా 3 రోజులు సాహితీవేత్తలతో చర్చాగోష్ఠులు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

నాలుగోరోజైన 18వ తేదీన జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో తెలుగు చిత్రసీమలోని అతిరథ మహారథులు సామూహికంగా కదిలివచ్చి, తెలంగాణా కళాతమతల్లికి తమ జోహార్లందించారు. మలేషియానుండి సుమారు వందమందికి పైగా వచ్చిన కళాకారులు, భాషా ప్రియులు, ఈవేదిక ద్వారా ఇచ్చిన సాంస్కృతిక కదంబ కార్యక్రమం ఆకట్టుకుంది.

మూడవ రోజున ఇదే ఎల్‌బి స్టేడియం వేదికపై తెలంగాణా సాంస్కృతిక సారథి, రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో దాదాపు 30 మందికి పైగా కళాకారులు జానపద సాంస్కృతిక నృత్యాల



జాతరను నిర్వహించి, అశేష ప్రేక్షక జనాల్ని ఉర్రూతలూగించారు.

ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో 700 మంది కవులు తమ కవితలను వినిపించాలని కవిసమ్మేళనాలు నిర్వహించినా, ఆ సంఖ్య తుదివరకు 1500 మందికి చేరుకొంది. కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులకు 3 వేల నగదు చొప్పున పారితోషికం ఇచ్చి, నిర్వాహకులు కవులను సముచితంగా సత్కరించారు.

అష్టావధానాలు, శతావధానాలు

తెలుగు భాషా ఔన్నత్యాన్ని విశ్వపౌరులను ఎలుగెత్తి చాటిని అష్టావధానాలు, శతావధానాలు ఈ మహాసభల్లో ఘనంగా జరిగాయి. తెలంగాణా సారస్వత పరిషత్తులో మెట్టు రామశర్మ ఆధ్వ ర్యంలో జరుగుతున్న శతావధానానికి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా హాజరై, ఆసాంతం ఆలకించి, అవధానంలో పాల్గొన్న కవులను, నిర్వాహకులను ఘనంగా సత్కరించారు.

3 వ రోజున రవీంద్రభారతి ప్రధాన వేదికగా జరిగిన జంట కవుల అష్టావధానాన్ని అవధానులు డా॥ ముదిగొండ అమరనాథశర్మ, ముల్కంపేట గౌరీశంకరశర్మలు నిర్వహించి, హాజరైన అశేష భాషా ప్రియుల అభిమానాన్ని చూరగొన్నారు. ఇదేరోజున మధ్యాహ్నం పుల్లూరు ప్రభాకర్‌చే అక్షర గణితావధానం, పగలు 3 గంటలకు అనంతసాగర్ సరస్వతీ ఆలయ నిర్మాత అష్టకాల నర్సింహరామశర్మచే అష్టావధానం ఘనంగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు కుమారి ఎం.వి.శిరీష, కె.శిరీషలచే నేత్రావధానం జరిగింది. తెలుగు చారిత్రక వైభవాన్ని చాటిచెప్పేలా డా॥ సంగనభట్ల నర్సయ్య ఆధ్వర్యంలో ప్రతాపరుద్ర విజయం సాహితీరూపక ప్రదర్శన విశేషంగా జరిగింది. భువన విజయం సాహితీ రూపకం వలె, గంటన్నరసేపు ఈ సాహితీ రూపకాన్ని డా॥ సంగనభట్ల తీర్చిదిద్ది, సాహితీప్రియుల మన్నన లనందుకున్నారు. డా॥ ములుగు అంజయ్య అష్టావధానం శ్రీ శంకర నారాయణ హాస్యావధానం ప్రేక్షకులను అలరించాయి.

జానపద సాహితీ వైభవానికి విశేష ఆదరణ

ఈ ప్రపంచ మహాసభల్లో జానపద సాహితీ వైభవానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అటుపక్క అవధానాలు, పద్య, రచన కవితా సరస్సులు, సాహితీ విమర్శలు, కథా సరస్సులు ఎన్ని జరిగినప్పటికినీ, జానపద సాహితీ వైభవం ప్రత్యేకంగా తళుకులీనింది.

జానపద సాహితీ స్రష్టలైన వాగ్గేయకారులు డా॥ గోరటి వెంకన్న, దేశిపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్, జానపద ఆచార్యులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీమతి మంగళ, శ్రీ రాఘవరాజ్ భట్, జయరాజు, సుద్దాల అశోక్‌తేజ, డా॥ కె.ముత్యం, శ్రీమతి బండారు సుజాతాశేఖర్ తదితరులు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు చేసి అలరించారు.

జ్ఞానపీఠిలు

ఈ మహాసభల్లో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన జ్ఞానపీఠ్ అవార్డు పొందినవారు పాల్గొన్నారు. సత్యవ్రత శాస్త్రి, సీతాకాంత్ మహాపాత్ర, ప్రతిభారావు కేంద్రసాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత మార్గరెట్ మెరిస్టో తదితరులు పాల్గొన్నారు. సంస్కృత సాహిత్యంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సత్యవ్రతశాస్త్రి గారిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు 3వ రోజు సభలో ఘనంగా సత్కరించి, 10 వేల చెక్‌ను అందజేశారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

ఈ మహాసభల్లో శాస్త్రీయ నృత్యాలు, జానపద కార్యక్రమాలు సమాంతరంగా శోభించాయి. తెలంగాణా సాహిత్య నృత్య రూపకాన్ని నిర్మల్ వాస్తవ్యులైన డా॥ రాజారెడ్డి–రాధారెడ్డి దంపతులు ప్రదర్శించి తమ సత్తాను చాటుకున్నారు. "జయజయోస్తు తెలంగాణ" సంగీత నృత్య రూపకాన్ని నటరాజ రామకృష్ణ శిష్యులు కళాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా ప్రదర్శించారు. దేశిపతి శ్రీనివాస్ ఈ నృత్యరూపకాన్ని రాయగా, శ్రీ ఎం.రాధాక్రిష్ణ సంగీతాన్ని సమకూర్చారు. వింజమూర్తి రాగసుధ (లండన్), డా॥ పుంజాల అలేఖ్య ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు హైలెట్‌గా నిలిచాయి.

అలరించిన సదస్సులు

ప్రధానవేదిక ఎల్‌బి స్టేడియంలో 16వ తేదీన జరిగిన సాహిత్యసభలో తెలంగాణాలో తెలుగు భాషా వికాసం సదస్సులో తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ, డా॥ ముదుగంటి సుజాతారెడ్డి పత్ర సమర్పణలు చేశారు. తెలంగాణాలో సాహిత్య వికాసం క్రీస్తు పూర్వం నుండి మొదలై, తెలంగాణా సాయుధపోరాటకాలంలో ఆత్మ గౌరవాన్ని సంతరించుకొందని, సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ సంచికలో 354 మంది కవుల రచనలు వచ్చాయని వీరు వివరించారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, డా॥ అయాచితం శ్రీధర్, స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి, రాష్ట్ర విద్యాశాఖామంత్రి కడియం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. ఇదే వేదికపై 17 వ తేదీన తెలంగాణా మౌఖిక వాఙ్మయం–భాష అనే అంశంపై డా॥ వెలిచాల కొండలరావు, డా॥ నలిమెల భాస్కర్, డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి, గోరటి వెంకన్న, ఆచార్య కొలకలూరి ఇనాక్‌లు చేసిన ప్రసంగాలు అలరించాయి.

పుస్తకాల ఆవిష్కరణలు

ఈ మహాసభల్లో 250 కి పైగా పుస్తకావిష్కరణలు, వందకు పైగా సదస్సులు జరిగాయి. తెలంగాణా సాహిత్య అకాడెమీ, తెలుగు పుస్తకాలను వెలువరించారు. తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సుమారు 220 పుటలతో వెలువడిన పరిచయ దీపికను ఆహ్వానిత ప్రతినిధులకు నిర్వాహకులు అందజేశారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ అధికార మాసపత్రిక 'తెలంగాణ' ప్రత్యేక సంచికను తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో జరిగిన శతావధానం కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా నిర్వాహకులు అందజేశారు. ఈ మహాసభల్లో జరిగే వివిధ సదస్సుల సమాచారిన్న, ప్రసంగ పాఠాలను అచ్చులోకి తీసుకొని రాదలచినట్లు, ఈ మహాసభల సమాచారాన్ని డాక్యుమెంటేషన్ చేయ దలచినట్లు ఈ మహాసభలకు కన్వీనర్‌గా వ్యవహరించిన 'తెలంగాణా' సాహిత్య అకాడమీ ఛైర్మన్ డా॥ నందిని సిధారెడ్డి ప్రకటించారు. డా॥ సాగి కమలాకర శర్మ సంపాదకత్వంలో 31 జిల్లాల సమాచారంతో వెలువడిన మూసీ ప్రత్యేక సంచికను డా॥ నందిని సిధారెడ్డి, డా॥కె.వి.రమణాచారి ఆవిష్కరించారు. 10 సీడీలు, 10 ప్రత్యేక



సంచికల ఆవిష్కరణలు జరిగాయి.

ప్రారంభోత్సవ వేదికపై డా॥ అయాచితం నటేశ్వరశర్మ పద్య కవిత్వం చదువగా, డా॥ఎన్. గోపి వచన కవిత్వాన్ని చదివి వినిపించారు. ప్రారంభోత్సవంలో, ముగింపుసభలో ముఖ్యమంత్రి కెసీఆర్ పలు పద్యాలు మౌఖికంగా అలవోకగా చదివి తనకు తెలుగు పద్య సాహి త్యంలో వున్న అభినివేశాన్ని వ్యక్తం చేశారు. తన చిన్ననాటి గురువు గారికి ఆ వేదికపై సాష్టాంగ ప్రణామం చేసి సత్కరించి, లోకానికే ఆదర్శంగా నిలిచారు, కె.సి.ఆర్. ప్రేక్షకులను ఆశ్చర్యానందాలలో ముంచివేశారు.

భాషా పండితుల సమస్యల పరిష్కారం

తెలంగాణా రాష్ట్రంలోని తెలుగుభాషా పండితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు, ఇందులకై అధికారికంగా చర్చలు మొదలైనట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ముగింపుసభలో ప్రకటించారు. తెలుగు భాషాభివృద్ధికై ప్రతి ఏటా డిసెంబర్‌లో రెండు రోజులపాటు సాహిత్య సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. తెలుగు అభివృద్ధికై ఈ మహాసభల్లో ప్రకటించాల్సిన నిర్ణయాలను వచ్చేనెలలో పరిశీలించిన తర్వాతే ప్రకటిస్తామని అన్నారు. వేలసంఖ్యలో పలు సూచనలు వచ్చాయని, వీటిని భాషావేత్తలతో ప్రత్యేకంగా సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. తెలుగుభాష మృతభాష కాకుండా చూస్తానని అన్నారు. ఈ మహాసభల నిర్వహణకు విశేషంగా కృషిచేసిన తెలంగాణా సాహిత్య అకాడమి ఛైర్మన్ డా॥ నందిని సిధారెడ్డి, సలహాదారు డా॥ కె.వి. రమణాచారి, డా॥ దేశిపతి శ్రీనివాస్, సాంస్కృతిక శాఖా కార్యదర్శి బుర్రా వెంకటేశం, మామిడి హరికృష్ణ తదితరులను సిఎం అభినందించారు.

చురుకుగా మంత్రులు, స్పీకర్లు, ప్రభుత్వ సంస్థల ఛైర్మన్‌లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీలు ఈ మహాసభలలో పాల్గొని, తెలుగుభాష పట్ల తమ మక్కువను వ్యక్తం చేయడం కనిపించింది. నిజామాబాద్ ఎం.పి. కల్వకుంట కవిత ఎన్ఆర్ఐ సదస్సులో పాల్గొని అరగంటకుపైగా తెలంగాణా సాహిత్య – సాంస్కృతికతల వైభవంపై డాక్యుమెంటరీ ప్రదర్శించి, ప్రేక్షకులను, భాషాప్రియులను సమ్మోహ పరచింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఆర్ఐ ప్రతినిధులు అమెరికా, మలేషియా తదితర దేశాలలోని యూనివర్శిటీలలో తెలుగు సాహితీ పీఠాలను ఏర్పరచాలని కోరారు. తెలుగేతర భాషా ప్రతినిధులు అక్కడి తెలుగు పాఠశాలల్లోని టీచర్ల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

'సినారె సంస్మరణ

ఈ మహాసభలలో ఇటీవల మరణించిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డికి సినీ కళాకారులు ఘనంగా నివాళు లర్పించారు. సినారె రాసిన పలు చలనచిత్ర గీతాలను గాయకబృందం హృద్యంగా ఆలపించి, సినారె ప్రతిభా విశేషాలకు హారతి పట్టారు. దాదాపు 40 మంది గాయనీ, గాయకులు సినారె రాసిన పాటలను పాడారు.

అలరించిన బాణాసంచా మిరుమిట్లు

ప్రారంభోత్సవం, సమాపనం సభల చివరలో 20 నిముషాల పాటు మిరుమిట్లు గొలిపే బాణసంచా విశ్వరూప ప్రదర్శన జరిగింది. విదేశాల నుండి తెప్పించిన బాణాసంచాలలో ఆకాశాన్ని రంగుల నక్షత్రాల వెలుగులతో పూయించారు. ఈ మిరుమిట్లు, లేజర్ షోల విన్యాసాలు చూసి ఈ సభలకు విచ్చేసిన అతిథులు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. తెరపై సంగీతానికి అనుగుణంగా బాణసంచా ఆకాశ తోరణాలు వెల్లివిరిసాయి. ఇంటివైపు వెడదామను కున్న ప్రజలు ఈ బాణసంచా వెలుగుల్ని చూసి అక్కడే ఆగిపోయారు. ప్రపంచసభల ప్రత్యేక కార్యక్రమాలను టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేయ దంతో, దేశవిదేశాల్లో, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో మహాసభల వేదుకల వైభవం ప్రజలు చూసి ఎంతో ఆనందించారు. తెలంగాణాలోని 31 జిల్లాల నుండి ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులను ఈ రెండు సభలకు నడిపించి, జనసమీకరణకు నడుం కట్టింది. రాష్ట్రపతి శ్రీ రామ్‌నాథ్ కోవింద్ అధికారంలోకి వచ్చాక, హైద్రాబాద్‌లో పాల్గొన్న మొదటిసభ అదేనని నిర్వాహకులు ప్రకటించారు.

ఆంధ్రసాహితీవేత్తలు

పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాహితీవేత్తలు ఈ మహాసభల్లో పాల్గొనడమే కాకుండా, వివిధ జిల్లాలనుండి ప్రతినిధులుగా, తమ మాతృభాషాభిమానాన్ని చాటుకున్నారు. ఆంధ్ర సాహిత్యలోకం, ఈ మహాసభలకు హృదయపూర్వకంగా నీరాజనం పట్టింది. విజయనగరం, శ్రీకాకుళం వంటి సుదూర ప్రాంతాల నుండి ఈ మహాసభలకు కవులు, రచయితలు హాజరయ్యారు. ఐదు రోజుల పాటు జరిగిన బృహత్ కవిసమ్మేళనంలో, వివిధ సదస్సులలో పాల్గొని తమ వైశాల్యతలను చాటుకున్నారు. ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, డా॥ ద్వానా శాస్త్రి, తనికెళ్ళ భరణి, సిరివెన్నెల సీతారామశాస్త్రి, కె. శివారెడ్డి, ఎ.ఎన్.జగన్నాథశర్మ, డా॥ సామల రమేష్‌బాబు, శీలా వీర్రాజు, కాళీపట్నం రామారావు, డా॥ వేదగిరి రాంబాబు, ఓల్గా, విఆర్. రాసాని, డా॥ సి.మృణాళిని, సింగమనేని నారాయణ, మధురాంతకం నరేంద్ర, అట్టాడ అప్పలనాయుడు, డా॥ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, పొత్తూరు వెంకటేశ్వరరావు, డా॥ ఈమని శివనాగిరెడ్డి, ఆచార్య చెన్నారెడ్డి, లక్ష్మణ్‌రావు, డా॥ కొప్పర్తి తదితరులు పాల్గొన్నారు.

పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో అచ్చతెలుగు పదాల వినియోగం పెరగాలి

ప్రస్తుతం టీవీ, సోషల్ మీడియాలు తెలుగు భాషను పాడు చేస్తున్నప్పటికినీ, మాతృభాషపైన తెలుగును రక్షిస్తున్నది పత్రికలేనని, భాషాసేవలో పత్రికలే ముందున్న విషయం సత్యదూరం కాదని ఈనెల 18న నాలుగవ రోజైన ప్రపంచ తెలుగు మహాసభల్లో జరిగిన చర్చాగోష్టిలో మాట్లాడిన వక్తలు పేర్కొన్నారు. అర్థవంతమైన తెలుగు పదాల వాడకం పెరిగినపుడే పత్రికలు ప్రజాదరణ పొందుతాయని, మీడియా అకాడమీ వారు ఆమోదయోగ్యమైన ప్రామాణిక భాషా పదాల వినియోగానికి వివిధ భాషా, సాహిత్య, విద్యా సంస్థలను సమన్వయం చేసి, చిత్తశుద్ధితో కృషి చేయాల్సి వుంటుందని వక్తలు ఏకరువుపెట్టారు. మీడియా అకాడమీ, తెలుగు అకాడమీ, తెలంగాణా సాహిత్య అకాడమీ, వివిధ యూనివర్సిటీలు, జర్నలిజం కళాశాలలు, నిఘంటు సంస్థలు వంటివి సమన్వయంతో పనిచేయాల్సి వుంటుందని వక్తలు ఉద్ఘాటించారు. వివిధ జర్నలిజం శిక్షణా కళాశాలలు, శిక్షణా సంస్థలు ఎలా వ్యవహరించాలో అన్న అంశం కూడా తెరపైకి వచ్చింది. రవీంద్రభారతి మినీ సమావేశ మందిరంలో జరిగిన ఈ గోష్టిలో పలువురు పాత్రికేయులు, సంపాదకులు, ఆల్ ఇండియా రేడియో ఉద్యోగులు పాల్గొని, తమ ప్రసంగ పత్రాలను చదివి వినిపించారు.

గోష్టికి అధ్యక్షత వహించిన తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ, మాతృభాషను కాపాడుకోవడం, సజీవంగా నిలుపుకోవడం, ప్రసార మాధ్యమాలలో శుద్ధమైన తెలుగు వాడకాన్ని ప్రోత్సహించడం. సాహిత్యం. పత్రికల ధోరణులు తెలిసిన వారు పాత్రికేయులుగా రావడం వంటి విషయాలపై స్పష్టత వుండాలని సూచించారు. సాహిత్యం, కళలలో వుండే సజీవమైన భాషా వినియోగం వంటివి పరిశీలించాల్సి వుంటుందని అన్నారు. పాతతరం సంపాదకులు భాషా వినియోగంలో వ్యవహరించిన తీరును పరిశీలించాల్సి వుంటుందని అన్నారు. అర్థవంతమైన భాషా వినియోగానికి పత్రికాభాషకు వెన్నెముకగా నిలిచేలా తగిన సూచనలు ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రింటు, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలు భాష వినియోగంలో గురుతరమైన బాధ్యత వహించాల్సి వుంటుందని అన్నారు. తెలుగు భాషా పరిరక్షణలో మీడియా పాత్ర అద్వితీయమని అన్నారు.

అదిలాబాద్ రేడియో స్టేషన్ సంచాలకులు సుమనస్పతి చేసిన ప్రసంగం గోష్టిలో పాల్గొన్న వక్తలను ఆలోచింపజేసింది. గత కొన్ని దశాబ్దాల నుండి చక్కటి తెలుగు భాష ఎలా ఉండాలి అన్న విషయంలో ఆకాశవాణి నిర్వహించిన పాత్ర గొప్పదని, తన పనిని విజయవంతంగా తీర్చిదిద్దిందని అన్నారు. ఎందరెందరో కాకలు తీరిన రచయితలు, పత్రికా సంపాదకులు ఆకాశవాణిలో చేసిన ప్రసంగాలు తెలుగుభాషను ప్రామాణికంగా నిలిపాయి అన్నారు. వార్తలు చదవడం, వ్యవసాయ కార్యక్రమాలు, వివిధ రచయితల నవలలు చదవడం, నాటకాల ద్వారా ఆకాశవాణి తన భాషాశక్తిని ఇనుమడింపజేసుకున్నదని అన్నారు. పదాల వినియోగానికి నిఘంటువుల వాడకం పెరగాలని అన్నారు. ఆంగ్ల పదాల తర్జుమా విషయంలో, కొత్త పదాల సృష్టి విషయంలో గతంలో పత్రికా సంపాదకులు నార్లవంటి వారు ఎంతో కృషి చేశారని ప్రముఖ పాత్రికేయులు టి. ఉదయవర్లు అన్నారు. వివిధ నాయకుల పేర్లు తెలుగులో చెప్పడంలో జాగ్రత్త వహించాలని అన్నారు. మీడియా అకాడమీ సంపాదకులు, భాషావేత్తలతో ఒక సమన్వయ సంఘాన్ని ఏర్పాటుచేసి కొత్త పదాల వినియోగం అమలులోకి తేవాలని అన్నారు. ఒక పత్రికైతే, తెలుగులో అనువాద పదాల వినియోగాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తోందని, కొంతవరకు నయమైనా, అవి ఆమోదయోగ్యంగా ఉంటున్నాయా లేదా అన్న విషయం పరిశీలించుకోవాల్సి వుంటుందని అన్నారు.

జాతీయ సమాచార కమీషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ, పరిభాషా పదాలను సేకరించి సమన్వయం చేసే ప్రక్రియకు ఎవ్వరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సాంకేతిక, వైద్య, న్యాయ విభాగాల్లో, సాంస్కృతిక, సంగీత కార్యక్రమాల వార్తలు రాయడంలో ఏవైనా పద్ధతులు పాటిస్తున్నారాయని ప్రశ్నిస్తూనే, తెలుగుభాషను కాపాడే బాధ్యతను పత్రికలే భుజాలనెత్తున్నాయని కితాబునిచ్చారు. న్యాయ శాస్త్రంలో తెలుగు వాడకం పెరగాలని, ఇందులకై తాను వ్యాసాలు రాస్తున్నట్లు తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ వంటి అంతర్జాతీయ నిఘంటువుల్లో తెలుగు పదాలు కొత్తగా చేరుతున్నాయా లేదా అన్నది తెలువాల్సి వుందని అన్నారు. **ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు వాడకం, బళ్ళలో తెలుగు బోధన జరగకపోతే, తెలుగుకు భవిష్యత్తు అయోమయమేనని అన్నారు.** నమస్తే తెలంగాణా పత్రికా సంపాదకులు కట్టాశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, రిపోర్టర్లకు సాహితీ స్పృహ, భాషా స్పృహ, ఆకలింపు వున్నపుడే పత్రికల్లో రిపోర్టింగ్ సామర్థ్యం పెరుగుతుందని, ఇందులకు తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి జనరేషన్ సాహిత్యం చదువకుండానే విలేఖరులుగా వస్తున్నారని, ఇందువల్ల కొంత గందరగోళం వుందని అన్నారు. ఆంగ్లపదాల వినియోగాన్ని కట్టడి చేయాల్సి వుందని,ఆంగ్ల పదాలకు తెలుగు తత్సమాలు రావాలని సూచించారు. ప్రముఖ పాత్రికేయులు పొత్తూరి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ, కొత్త పదాల సృష్టి జరగాలని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్ళేలా చూడాల్సిన బాధ్యత పత్రికలపై వుందని అన్నారు. సీనియర్ పాత్రికేయులు, ఎంపి, కే. కేశవరావు, ఆంధ్రజ్యోతి ఎడిటర్, కె.శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడెమీ ఛైర్మన్, నందిని సిధారెడ్డి, సీనియర్ పాత్రికేయులు డా॥ జీఎస్‌వరదాచారి, జ్వాలా నరసింహారావు, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు ఈ గోష్టిలో పాల్గొన్నారు.

– సంకేపల్లి నాగేంద్రశర్మ

తెలంగాణా చరిత్ర సదస్సు

తెలంగాణాకు సుమారు రెండువేల ఏళ్ళకు పైగా చరిత్ర వుందని, గత కాలంలో ఇక్కడి చరిత్ర మరుగున వడిపోయిందని, ఇక్కడి గుళ్ళు గోపురాలు, ఇక్కడ పరిఢవిల్లిన జైనం, బౌద్ధం, ఇస్లాం, తదితర ప్రాచీన చారిత్రిక కట్టడాలు, శాసనాలు, నాణాలు, తాళపత్రాలు, శిల్పాలు, కోటలు, పుస్తకాలు వంటివి చారిత్రిక ఆధారాలని, విస్మృ తాంశాలుగా వున్న వీటిని సమగ్రంగా పరిశీలించి, తెలియని చారిత్రి కాంశాలను విశ్లేషించి వెల్లడించే తరుణం ఆసన్నమైందని, మన చరిత్రను మనమే రాసుకునే మహదవకాశం మన చరిత్రకారులకు దక్కిందని ప్రపంచ తెలుగుమహాసభల్లో భాగంగా, ఐదవరోజున జరి గిన తెలంగాణా చరిత్ర సదస్సులో మాట్లాడిన వక్తలు అన్నారు. రవీంద్ర భారతి మినీ సమావేశమందిరంలో డిసెంబర్ 19న జరిగిన సదస్సుకు తెలంగాణా రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమీషన్ చైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి అధ్యక్షత వహించగా, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మహమూద్ ఆలీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, నటుడు తనికెళ్లభరణి ఇందులో పాలుపంచుకొని మాట్లాడారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన చరిత్రకారులు తమకు కేటాయించిన వివిధాం శాలపై ప్రసంగించి, పలు సూచనలు చేశారు. వక్తలుగా ఆచార్య అడపానత్యనారాయణ, కుర్రా జితేంద్రబాబు, డా. దేమె రాజారెడ్డి, డా. ఈమని శివనాగిరెడ్డి, డా. ద్యావనపల్లి నత్యనారాయణ, మల్లేపల్లి లక్ష్మయ్య వివిధాంశాలపై ప్రసంగించారు. తెలంగాణా చరిత్రలో తెలుగుభాష మూలాలు ఇమిడి వున్నాయని, తెలంగాణా చరిత్రను తిరిగి రాయాల్సివుందని, ఆ కోణంలో పరిశోధనలు జరగాల్సిన అవసరాన్ని వక్తలు నొక్కిచెప్పారు.

నదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ, తెలంగాణానేల వేల ఏళ్ళ చరిత్రను నిక్షిప్తం చేసు కొందని, ప్రాచీన సమకాలీన బౌద్ధంతో ఇక్కడి చరిత్ర ముడిపడి వుందని, తెలంగాణాలో ఇటీవలి కాలంలో శాతవాహన రాజుల గోడలు, గుట్టల్లో ఆదిమమానవుడి పెయింటింగులు, లోయలు, ప్రాచీన కట్టడాలు కనుకొన్నట్లు వార్తలు వస్తున్నాయని, ఇన్నేళ్ళనుండి తెలంగాణా చరిత్ర కుగంతలు కట్టారని, కొత్తవిషయాలపై వార్తలు రావడం తెలంగాణా చరిత్ర విశిష్టాంశాల్ని తేల్చి చెబుతున్నట్లు అవు తోందని అన్నారు. ఇలాంటి పరిశోధనలు కొనసాగాలని అన్నారు. కోటిలింగాలలో, పెద్దబొంకూర్, ధూళికట్ట, కొండాపూర్ వంటి శాత వాహన స్థావరాలు, ఫణిగిరి, నాగార్జునసాగర్ వంటి బౌద్ధఆరా మాలు, కీసరగుట్ట, ఇంద్రపాల నగరం, శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, వేములవాడ చాళుక్యులు, బాదామీ చాళుక్యులు, రేనాటి చోళులు, కళ్యాణీ చాళుక్యులు, కాకతీయులు, విజయనగర రాజులు, బహుమనీలు, కుతుబ్షాహీలు, మొగలులు, ఆసఫ్జాహీలు, వివిధ సంస్థానాలు, చరిత్రపూర్వయుగం, లోహయుగం, వంటివి చరిత్రకు ఉపకరణాలుగా వున్నాయని సదస్సులో మాట్లాడిన వక్తల ప్రసంగాంశాలను ఉటంకిస్తు, డా. ఘంటా నమర్థించారు.

డా. ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణాలో వివిధ రాజుల పరి పాలనాకాలం నాటి శాసనాలు, రాగిరేకుల్లో తెలుగుతోపాటు, పాళీ, సంస్కృతం, కన్నడం, మరాఠీ, తమిళం భాషల్లో వున్నాయని, ఇందు లో తెలుగుభాషకి సంబంధించిన అనేక మూలాలు, సరికొత్త పదాలు దాగి వున్నాయని, వీటిని మరింతగా పరిశోధించాలని డా. ఈమని శివనాగిరెడ్డి అన్నారు. కోటిలింగాలలో శాతవాహనులు, పూర్వశాత వాహనుల చరిత్ర ఆధారాలు 1978 నాటి పురావస్తు తవ్వకాలలో వెలికితీయబడ్డాయని అన్నారు. డా.దేమెరాజారెడ్డి, సూర్యనారాయణ రెడ్డిలు శాతవాహనుల నాణాలపై పరిశోధనలు చేసి, పురాణాలలో లేని రాజుల పేర్లతోనహా, అనేకాంశాలను విశ్లేషించి, తేల్చి చెప్పారని అన్నారు. బిఎన్.శాస్త్రిగారు వస్తున్నారంటే అనేక శాసనాలు సంబర పడేవని, ఆయన అనేక శాసనాల్ని పరిష్కరించి, తెలంగాణా చరిత్రకి భిక్ష పెట్టారని అన్నారు. విష్ణుకుండినుల చరిత్రను వెలికి తీసిన మహాను భావుడని అన్నారు. కోటిలింగాల, పెద్దబొంకూర్, కొండాపూర్లలో కొంతవరకే పురావస్తు తవ్వకాలు జరిగాయని, అర్థాంతరంగా ఆగిన వీటిలో పురావస్తు తవ్వకాలు జరిపితే, అనేకాంశాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని అన్నారు. యాదాద్రి జిల్లాలో రాయగిరి వద్ద ఇనుప సమాధులు ఉన్నాయని, వీటిని పరిశోధించాలని అన్నారు. 7వ శతాబ్దం నాటి వాడపల్లి శాసనంలో, కాజీపేట, కీసరగుట్ట శాస నాల్లో తెలుగు భాషామూలాలున్నాయని, ఈ అంశాలపై పరిశోధనలు జరపడానికి ముందుకురావాలని ఔత్సాహికులకు పిలుపునిచ్చారు.

ప్రాచీన నాణాల పరిశోధనలో దిట్టయైన **డా. దేమె రాజారెడ్డి మాట్లాడుతూ,** శాతవాహనుల చరిత్రతో మన తెలంగాణా చరిత్ర మొదలైందని, అస్మక జనపదాల నాణాలతో చరిత్ర దర్వాజాలు తెరుచుకున్నాయని అన్నారు. కోటిలింగాల, కొండాపూర్, శాతవాహన పూర్వరాజుల చరిత్రలు, వివరాలు నాణాలవల్ల స్పష్టమైందని అన్నారు. 80శాతం పైగా చరిత్ర – నాణాల పరిశోధనల వల్లే తెలిసిందని అన్నారు. ప్రాచీన భారతదేశ చరిత్ర సమాచారం 1930 నుండి రావడం మొదలైందని అన్నారు. పెద్దబొంకూర్లో దొరికిన నాణాలతో లోహవిజ్ఞానం వెల్లడైందని అన్నారు. నాణాల వల్లే పాలీ తదితర లిపులు తెలిసాయని అన్నారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణు కుండినుల నాణాల్లో తెలంగాణా చరిత్ర దాగివుందని అన్నారు.

కుర్రా జితేంద్రబాబు: ప్రాక్ చరిత్రపై మాట్లాడుతూ, చరిత్రకూ, భాషకున్న సంబంధాన్ని భాషాభిమానంతో పరిశీలించాలని అన్నారు. ప్రాకృతమే మనకు తొలిభాషని, క్రీ.శ. 3–4 శతాబ్దాల నుండి మాత్రమే సంస్కృతంలో శాసనాలున్నాయని తేల్చిచెప్పారు. ఇక్ష్వా కులు, విష్ణుకుండినుల శాసనాల్లో ప్రాకృతమే ఎక్కువగా వాడబడిందని అన్నారు. ప్రపంచ ప్రాచీన సాహిత్య చరిత్రకు మూలాధార గ్రంథాలుగా ప్రాకృతంలో రాయబడిన గాథాసప్తశతి, బృహత్కథలు నిలిచాయని,


ఇవి తెలంగాణా నేల నుండే వచ్చాయని, ప్రాచీన భాషాచరిత్రకు దీపస్తంభాలని అన్నారు. ఇందులో తెలుగు పదాలున్నట్లు నిరూపణైందని అన్నారు. ప్రపంచ భాషలకు ప్రాకృతమే మూలంగా కనిపిస్తోందని అన్నారు. కాళిదాసు రచనల్లో ఎక్కువగా సంస్కృతం కంటే ప్రాకృతం వుందని అన్నారు. తెలంగాణాలో నన్నయకంటే వందేళ్ల ముందే తెలుగులో కందం బొమ్మలమ్మగుట్ట శాసనంలో రాయబడిందని, సోమన గురువైన పండితారాధ్యుడి శిల్పం స్వయంభూదేవాలయంలో వుందని అన్నారు. సోమన తెలుగు ద్విపద కావ్యాలు, దిగ్నాగుడి కుందపూల నాటకంలో ప్రాచీన తెలుగు భాషామూలాలున్నాయని అన్నారు. ప్రాచీన నాణాలు దొరకకపోతే బ్రాహ్మీ, ఖరోష్టి లిపులు తెలిసేవి కావని అన్నారు. స్టేట్ మ్యూజియంలో లక్షలాది నాణాలున్నాయని అన్నారు.

డా. ద్యావనపల్లి సత్యనారాయణ: తెలంగాణాలో అనేక గుట్టల్లోని గుహల్లో ఆదిమానవుడి చిత్రించిన బొమ్మల్లో, పేంటింగ్లల్లో ఆ కాలపు భాషాసంకేతాలున్నాయని, ఆనాటి గీతలు, దీనిపై తాను పరిశోధిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణా ప్రాక్చరిత్ర భాషామూలాలు అనే అంశంపై మాట్లాడారు. ఆదిమానవుల చిత్రాల్లో వాడే రంగుల్ని వర్ణాలు అంటామని, అందులోనుండే వర్ణమాల అనే పదం వచ్చిందని, రంగుల తయారీకి వాడే వివిధ రసాయనిక లేపనాల వల్ల లిపి అనే పదం వచ్చిందని అన్నారు. బొమ్మలలిపి నుండే బ్రాహ్మీలిపి పుట్టిందని అన్నారు. ఇందులో తొలి తెలుగు మూలాలున్నాయని అన్నారు. పశుపతి కంటే శివుణ్ణి కనిపెట్టిందని ఈప్రాంతమేనని అన్నారు. రాచకొండ పేంటింగుల వల్ల ఆనాటా గణరాజ్యాలు తెలుస్తున్నాయని, మొగస్తనీస్ చెప్పిన లెక్కలకు దగ్గరగా వున్నాయని అన్నారు. రాజన్ అనే పదం రజో నుండి వచ్చిందని, పూర్వశాతవాహన నాణాల్లో రజోపదం వాడబడిందని అన్నారు. ఆదిమానవుల చిత్రాల్లో, రాతల్లో అనేక చరిత్ర మూలాలు వున్నాయని అన్నారు.

మల్లేపల్లి లక్ష్మయ్య నాగార్జున సాగర్ బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలంగాణాలో పరిఢవిల్లిన సమకాలీన బౌద్ధవికాస మూలాల గూర్చి మాట్లాడుతూ, తెలంగాణా చరిత్ర ఆధారాలకి మూలం బౌద్ధమేనని స్పష్టం చేశారు. బౌద్ధసాహిత్యం, త్రిపిటికాలలోని సుత్తనిపాతంలోని పారాయణ వర్గలో సమకాలీన బౌద్ధం వికసించడానికి ఆధారమైన బావరి చరిత్ర రాయబడిందని అన్నారు. 16 జనపదాలలో ఒకటైన అస్మకంలో బాదనకుర్తి ద్వీపంలోని బావరి శిష్యులు 16మంది వైశాలి వెళ్ళి వచ్చారని, దీని దారి కనుగొనబడిందని అన్నారు. ఇక్కడి నుండే బౌద్ధం పరివ్యాప్తి అయిందని అన్నారు. మాగధీ భాషే పాళీగా మారిందని అన్నారు. బోధన్, కోటిలింగాల, ధూళికట్ట, పాశాయిగాం, తంబళ్లపల్లి, కొండాపూర్, ఫణిగిరి, గాజులబండ, నేలకొండపల్లి, నాగార్జున కొండ తది తర చోట్ల బౌద్ధం అనేక రకాలుగా వికసించిందని అన్నారు. ధూళికట్ట బౌద్ధ స్థూపం అభివృద్ధికి 32 ఎకరాల స్థలాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఆచార్య అడపా సత్యనారాయణ: ఆసఫ్ జాహీల ఆధునీకరణ గూర్చి మాట్లాడుతూ, తెలంగాణాలోని ఆసఫ్జాహీల పరిపాలనా కాలంలో ఉర్దూతోపాటు, తెలుగు వికాసం చెందిందని అన్నారు. మహబూబ్ అలీఖాన్, మీర్ ఉస్మాన్ అలీఖాన్ల పరిపాలనా కాలంలో తెలుగు మీడియం పాఠశాలలకు అనుమతి దొరికిందని అన్నారు. ముస్లిములు. హిందువులు కలిసి మెలిసి మత సామరస్యం పాటించారని అన్నారు. నైజాం కొలువులో ఎంతోమంది హిందువులు వుండేవారని, తెలంగాణా సంస్కృతి కొనసాగిందని అన్నారు. ఈ సదస్సుకు అనేక మంది చరిత్రాభిమానులతోపాటు, చరిత్రకారులు, చరిత్ర విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

– సంకేపల్లి నాగేంద్రశర్మ



స్పందన

తెలుగు లిపి - సంస్కరణ

'తెలుగు అక్షరమాలని కొంత సంస్కరించుకోవాలి'

ప్రతి భాషలోని అక్షరాలలో ఎన్నో ఒప్పులున్నా, కొన్నయినా లోపాలుంటవి. తెలుగుభాష అక్షరాల్లో ఒప్పులెక్కువ, తప్పులు తక్కువ. అక్షరాల రూపం (లిపి) విషయంలో స్వరాలు - ధ్వనులు (అచ్చులు - హల్లులు) విషయంలోనూ ఆ అంశాన్ని గమనించవచ్చు.

ఆంగ్లంలోనైతే అయిదే (అచ్చులు, వాటికి భిన్నభిన్న స్వరాలట' పైగా - హల్లులు సి,జి,లకు రెండేసి ధ్వనులు. టి, కొన్నిసార్లు చ.

తమిళంలో కచటతపలు తప్ప గజడదబలు లేవు - పదాదిలో పరుషాలు, పద మధ్యంలో సరళాలు అవుతవి, భారతమాతను వాళ్ళు 'పారదమాద' అనే రాస్తరు - అంటరు. కాంతి, గాంధి - ఈ రెండు పదాలను 'కాంది' అనే రాస్తున్నరు. ఉర్దూలో 'శ్రమ' - 'శర్మ' అవుతుంది. ఆ ఇబ్బందులు మన తెలుగుకు లేవు.

తెలుగు లిపి వెయ్యేండ్ల నుంచి ఎన్నో మార్పులు పొందింది. ఇప్పుడు కంప్యూటర్ల కారణంగా మరిన్ని మార్పులు చెందుతున్నది. మన అక్షరాల రూపాలు, వ్యాకరణం ఇంచుమించు పాతదే.

అమ్మనుడి (డి.2017) లోని 'రంగనాయకమ్మ'గారి వ్యాసం చదివిన. అది వ్యాకరణ బద్ధ సమీక్ష కాదు. అనుభవంతో గ్రహించిన తెలుగు అక్షరాల విశేషాల వివరణ (నేను 30 - 35 ఏండ్ల క్రితం 'తెలుగు లిపి'కి చేయవల్సిన మార్పుల గురించి ఒక వ్యాసం రాసిన. అది ఇప్పుడు నా దగ్గరే వుంది. దాని జోలికి పోను.) ప్రస్తుతం రచయిత్రి ఆక్షేపణల పరామర్శ ఈ నా 'స్పందన' వ్యాసం ఆ వ్యాసం 1-20 నంబర్లలో వివరణలు - విమర్శలు ఉన్నయి కాబట్టి, పాఠకుల సౌకర్యం కోసం నేను అంకెల క్రమంగానే సమీక్షిస్తున్న.

1. అక్షరమాల - తెలుగు అక్షరాలు వరుసగా దండగా ఉండి, పిల్లలను భయపెడుతున్నవట. అందుకు రచయిత్రి సూచన చేసినట్లుగా

అ, ఆ -

ఇ, ఈ-

ఉ, ఊ - అనే రాద్దాం. ఇక, ఆ బాధ ఉండదు కదా.

2. ఋ, ౠ - ఌ ౡ లు, రు రూ - లులూ - లుగా రచయిత్రి భావన. అట్లా ఇప్పటి పంతుళ్ళు చెప్తున్నా, విద్యార్థులు రాస్తున్నా, అది సరికాదు. రు,లు - హల్లులకు కొమ్ములు, ఋ, ఌ లు 4 అచ్చులు. రు, లులు వలె కాక ఆ అచ్చులను కొంత తేల్చి పలకాలె. ఛందస్సులోనూ - కృ (ఋత్వం) మీది అక్షరం గురువు కాదు. చక్రము - రకారం కలిసిన అక్షరం హల్ సంయుక్తం కాబట్టి దానిపైది గురువు. ఈ ఋ, ఌలు సంస్కృతం నుంచి వచ్చినై, తెలుగువి కాదు.

మరో అనుమానం రచయిత్రిగారికి ఎందుకు రాలేదో...

క్, గ్, చ్ అని కదా హల్లుల రూపాలు, క్ + అ = క, క్ + ఇ = కి, క్ + ఉ = కు, క్ + ఋ = కృ, ఈ కు, కృలకు తలకట్టు ఎట్లా వచ్చె? అకారం మనం చేర్చలేదు. అది అదనంగా వచ్చింది. ఎందుకంటే ఉచ్చారణ సౌలభ్యం కోసం. ఆ నాలుగు, ృ ఋ, ౠ, ఌ ౡ అక్షరాలను మనం తొలగించుకోవచ్చు. అచ్చ తెలుగు భాషలో - కావ్యాల్లో అవి లేవు.

3. క్ + అ = క. హల్లులకు అచ్చులు కలిస్తేనే పూర్ణ ధ్వనులు - అని వివరణ. అది పాత విషయమే. శబ్దం అంటే ధ్వని - అయినా, పదం అని దానికి మరో అర్థముంది.

4. ఋ, రుల పరీక్ష / విశ్లేషణ అనవసరం అవి రెండు వేర్వేరు అక్షరాలు.

5. ఋ, ఌ ల విశ్లేషణ సరికాదు. ఋ - అచ్చు, రు - హల్లు. రకు గుణితంతో రు అయింది.

6. ఋషి సంస్కృతం, ఋత్వం అంతే. రు - తెలుగు. హల్లు, రుషి అని రాసి చర్చ సరికాదు. ఆ నాలుగు అచ్చులు - ఋ, ౠ, ఌ ౡ లు లేకుంటే తెలుగుకు బాధలేదు.

7. రచయిత్రికి నచ్చనివి నాలుగైదు అక్షరాలని చూపినవి రెండు - ఙ, ఞ వాటి ధ్వనులు - ఇన్య, ఇని (ఇది చూపలేదు). నిజానికి వాటి ధ్వనులు - న్గ, న్య -

ఉ ॥ పన్చాఙ్గమ్ (పంచాంగం)

ఞ (న్య) - ఞా న్ (నేను) న్యాన్ - మలయాళం. తెలుగు కన్నడాలవలె అది కూడ ద్రవిడ సోదర భాష. ఆ అక్షరాలను మన తెలుగువాళ్ళు తప్పుగా పలుకుతున్నరు. వర్గాంత అనునాసిక అక్షరాలు 5. ఇవి.

కఖగఘ - ఙ

చఛజఝ - ఞ

టఠడఢ - ణ

పఫబభ-మ

వాటి కలయిక పదాలు ఇట్లా -

అఙ (అంగ), కఞ+ము) (కంచము), కణ్ఠము (కంఠము) కాన్త ఞ+ౘ (కాంత), కమ్పు (కంప).

ఇవి అన్నీ మనం సున్న (ం) పూర్ణ బిందువుతో రాస్తున్నం. సంస్కృత పదాలే అనునాసిక అక్షరాల కలయికతో ఉంటున్నవి. భగవద్గీత శ్లోకాల వ్రాత చూడండి. అయితే - తమిళంలో కూడ సున్నను (ఎక్కువగా) వాడక, సంస్కృత పద్ధతిలో రాయుట విశేషం. ఇదెందుకు? అని మనమంటే - అర్ధ 'న' కార, అర్ధ 'మ'కార ధ్వని, తెలుగు 'సున్న'తో తేడా తెలువదని వాళ్ల వాదన.

చెంబు - ఇందులో కలిసింది 'మ్'

కంచము - ఇందులో 'న్' ఉంది.

అవి అటు ఇటు అయ్యే, మన ఆధునిక నాగరికులు 'సంస్కృతం'

ను సాన్స్‌క్రిట్ (ఆంగ్లం) అంటున్నారు. సున్నవాడితే మనకు బాధ లేదు. పై అక్షరాల చర్చ అవసరం లేదు.

8. క్షను అక్షరమాలలో నేర్పినా దాన్ని 56 అక్షరాలలో లెక్కించరు.

త్ర – ఎక్కడ ఉండేదో కాని, మా ప్రాంతంలో మాత్రం లేదు.

క్ష – ఇది క్ష సంయుక్తాక్షరమేనట. కాని, ఇప్పుడు రిక్షా, రాక్షసుడులోని ధ్వని భేదం గమనించండి. క్ష సరే, క్షలో క, ష, లతో పాటు 'చ' కార ధ్వని అదనంగా ఉంది. అది జన వ్యవహారం వల్ల వచ్చిందే. క్ష సంస్కృత పదాలదే. ఉంచినా – వదిలినా మీ యిష్టం.

9. ర, ఱ – ఈ రెండు అక్షరాలు ఒకటి కావు. ధ్వని భేదముంది. ఱ – ది కటు ధ్వని. ర–ది సున్నితం, ఱ ద్రవిడ భాషలదే. సంస్కృత అక్షరాలలో అది లేదు. ఇంకా, తమిళంలో 'ళ డ ఱ' మూడు అక్షరాల ధ్వనులు (LDR) కలిసిన వింత అక్షరముంది. పలం మధ్యది అదే. ....(ఴ) ళ, సంస్కృతంలో లేదు. మన కళ వాళ్లకు కల. మన కల వాళ్ళకు స్వప్నం. కళ్యాణం సరి!

ళ – ఏమైనా, బండి 'ఱ' (శకట రేఫం) అరసున్నను (ఁ) మన భాషా సంస్కర్తలు వందేండ్లకు పూర్వమే వద్దన్నరు. విసర్గ (ః) కూడ సంస్కృత పదాలకే పరిమితం.

10. కి, కీ (గ,చ) లకు వలె మ, య లకు మీ, యీ – అని రాయక మీ, యీ అని ఎందుకు రాయాలి? అని ప్రశ్న. అది ముద్రణ – అచ్చు కాలం నాడు వచ్చిన మార్పు.

11. ఒ.ఓ.త్వాలు – ొ, ో లు హల్లులకు పై దిక్కున కదా ఉండేది. మ, య, లను మొ అన్నట్లు రాయక పైన ఏత్వం, కింద దీర్ఘంలతో రాయుట ఎందుకు? అని మరో ప్రశ్న. తెలుగులో మొదట అదే విధంగా రాసే వాళ్ళు, అది తర్వాత మారింది. తమిళ పద్ధతి, మొ (Secom) మధ్యతి మ. మొదటిది ఎత్వం, చివరిది 'ఆ' దీర్ఘం. అది ఇటు వచ్చింది. మొ, మో.

12. చ, ఛ – సరే. బ, భ లలో మొదట లేని తలకట్టు రెండవ అక్షరానికి ఎందుకు? అని ప్రశ్న, బకు తలకట్టు పెట్టినా, భకు తీసివేసినా బాధలేదు. కాని, భ, ఖ తో కలిసి పోయే ప్రమాదముంది. పూర్వంలో ప,స, తల కట్లకు సైతం పైన గీతలుం డేవి. ఎందుకంటే – అవి, వ, న, లతో కల్సిపోకుండా, (ఇంకా, క, గ, చ, త మొ॥ హల్లులకున్న తలకట్లు – ల,జ,ట,ణ,లకు ఎందుకు లేవు? అనే అనుమానం రచయిత్రిగారికి ఎందుకు రాలేదో. పైగా – కా,గా,లకు వలె అకార దీర్ఘం వస్తే, ప,ష,స,లకు కింది గీత పైకి ఎందుకు సాగతీయాలి? అనీ అడుగలేదు).

13. ఒత్తు అక్షరాలు (వర్గయుక్కులకు) వేరే అక్షరాలు ఎందుకు? అని మరో ప్రశ్న. అవి సంస్కృతపువే. సంస్కృత తత్సమ, తద్భవ పదాలకే వాటి వాడుక – వైభవము, విభవము. తెలుగు పదాలకు అవి అవసరం కాదు. ఆ అక్షరాల ధ్వనులు సంస్కృతపువి అయినా, వాటి రూపాలు (లిపి) మన తెలుగు వాళ్ళ సృష్టే. ఖ,ఘ...రాత కష్టమనిపించినా, అక్షరాలను తగ్గించాలనుకున్నా, కచటతపలకే అదనంగా ఓ గీత చేరిస్తే చాలు అనుకుంటే, మంచిదే.

14. ట, త – ఒత్తు అక్షరాల పరామర్శ. సమాధానం పాతదే. నం.13.

15. కథ అని మన మంటాం (ఎవరు?). కథ అని సంస్కృతంలో అంటారేమో! (అదీ అనుమానమేనా!) మనం 'కథ అనే అందాం. అంటే కథ– అనే పదం లేదు కదండీ. కథ – ప్రకృతి, కత – వికృతి. 'కత' అంటే చాలు. కథ తప్పు పదం, అనవసరం. అర్థం అన్నట్లే!

ఝ – రాత భయం నిజమే. భ కు తలకట్టు ఖ తో కల్సిపోకుండా. ఘ కు, షుకు, ఋకు తోకలు, కొమ్ములు ఎక్కడ అనేది ఇబ్బందే. అయినా ఇప్పుడు, క,గలకు గీతలతో ఆ చిక్కువిడిపోతుంది కదా.

16. ఇంగ్లీష్‌లో వలె తెలుగుకూ స్పెల్లింగ్ గుణింతం కష్టం ఉందట. ఎంత శాతమో? మార్చుకోవాలట – సరే.

17. పాత పుస్తకాలు చదివితే కొత్త అక్షరాలు తెలువక కష్టం – అందుకు కొత్త అక్షరాలతో పాత అక్షరాల పరిచయం చేయన్నట, ఆంగ్లం డిక్షనరీలకు ముందు పుటలో ఫొనెటిక్ సింబల్స్ ఇచ్చినట్టు. ఓ పట్టిక చూపుదాం లెండి.

18. అక్షరమాలను సంస్కరించే కొన్ని సూచనలు – సరే. విందాం.

19. రచయిత్రి 1వ, తరగతి తెలుగు వాచకం రాసినప్పుడు అక్షరమాలలోని 10 (పది) అక్షరాలు తొలగించారు. నేను చూడలేదు. ఆ పుస్తకాన్ని.

జ్ఞానం – తప్పురాత, తప్పు ధ్వని అని వాదన.

గ్యానం అంటే సరిపోయె. గ్నానం అని కదా కొందరికి.

అసలు ఆ సంస్కృత శబ్దాన్నే విడిచిపెడితే మంచిది కదా!

20. ఋత్వం(ృ), రకారం (U) పరామర్శ. వచ్చిందే.

రచయిత్రి సమీక్షకు ధన్యవాదాలు. ఇంకా వ్యాసాలు రానీండి. సరియైంది, సాధ్యమైంది స్వీకరిద్దాం.

– డా॥ మలయశ్రీ
9866546220

పురస్కారాలు

రామాచంద్రమౌళి (వరంగల్లు) రచించిన కవితా సంపుటి 'అసంపూర్ణ'కు 2017 – మద్దూరి నాగేష్‌బాబు స్మారక కవితా పురస్కారాన్ని 2018 జనవరి 7న గుంటూరుజిల్లా నర్సరావుపేటలో జరిగే సభలో ఇవ్వనున్నట్లు – బహుజన రచయితల వేదిక (9848187416) తెలియజేశారు.

డా॥ పత్తిపాక మోహన్‌కు (జీనుడి – 2017' సాహిత్య పురస్కారాన్ని జనవరి 22న ఒంగోలు (ప్రకాశం జిల్లా) లో జరిగే మల్లవరపు జాన్ జయంతి సభలో ఇవ్వనున్నట్లు – 'జానుడి' సాహిత్య సేవా సంస్థ తెలియజేసింది.

స్పందన

తెలుగులిపి దిద్దుబాటు తప్పనిసరి.

అన్ని ఊళ్ళకూ సర్కారు బడులు లేని కాలంలో ఊరి నడుమ పెద్దింటి వసారాలోని జగిలి(అరుగు) పైనో, దేవాలయాల వసారా లోనో 'అయ్యోరు' ఇసుకలో పిల్లవాడి వేలుపట్టి అక్షరాలు రాయించే వారు. ఆ కాలంలో మొదట ఓం నమః శివాయ ః సిద్ధం నమ ః అనే పది అక్షరాలు ఇసుకలో రాయించి స్పష్టంగా పలికించేవారు. ఆ తర్వాత 'అ ఆ ఇ ఈ' ల 18 అక్షరాలనూ ఇట్లే నేర్పేవారు. తర్వాత కకాకికీ గుణింతాల తలకట్టు, దీర్ఘం, గుడి, వట్రసుడి... ఏత్యాది సొంపులతో 7 వందలపైగా అక్షరాలనూ ఒకే సం॥లో క్షుణ్ణంగా రాయిస్తూ కనాఖచ్చితంగా పలికిస్తూ శ్రద్ధతో నేర్పేవారు. పెద్దబాలశిక్షయే నాటి మార్గదర్శి. ఈ అక్షర విద్య జతలో అంకెలూ, చిన్నచిన్న లెక్కలూ, ఎక్కాలూ సహా నేర్పేవారు. ఇక రెండవ ఏట పెద్ద బాలశిక్ష, నరసింహ శతకం, అమరకోశము (కొద్దిగా) కూడ స్పష్టంగా పలుక నేర్పేవారు. కొన్నేళ్ళకు ఓనమాలుతో సహా ఈ 3 పుస్తకాలు ఎత్తేశారు. తెలుగు వాచకములొచ్చినవి. పలకాబలపం లేక ఇసుకలో రాసే కాలంలో గొర్రెలు, గొడ్లు మేపుతూ, చెట్ల నీడల్లోనూ నేలపై రాసిరాసి నిద్రలోనైనా రాసి ఖచ్చితంగా పలకడం మాకు కొట్టిన పిండి.

కాల క్రమేణా ఇటు తమిళ్నాడులో తమిళులో 'ఇరుక్కు'పోయిన తెలుగువారికి తమ తల్లిభాష నేర్వవలెననే తపన కలగడంతో 'లిపి దిద్దుబాటు' అవశ్యకత తప్పనిసరైపోయింది. పదిహేనేళ్ళుగా మన నడుస్తున్న చరిత్ర (నేటి అమ్మనుడి)లో భాషా మేధావులు తరచూ చర్చిస్తున్నారు. శ్రీ స.వెం.రమేశ్‌గారు ఇక్కడి (త.నా.) తెలుగువారికి తెలుగు నేర్పను పాఠ్య ప్రణాళిక తయారు చేసి ఆనాడు వెల్లూరు జిల్లా నుండి కోయంబత్తూరు, చెన్నై, కాంచి పురం జిల్లాల వరకు తెలుగువాణి సంస్థ మరియు తా.నా. (అమెరిక) సంస్థ సాయంతో తెలుగు తరగతులను నడుపుతున్నారు. ఈ దిద్దుబాటుతోనే.

ఇప్పుడు మన విప్లవ రచయిత్రి రంగనాయకమ్మగారు ఈ లిపి దిద్దుబాటు గురించి సహేతుకంగా వివరించడం అభినంద నీయం. ఇంత పెద్ద వయసులోనూ, ఆమెగారింత శ్రద్ధ వహించి, వివరించారు. అందునా పాత కాలపు సాహిత్యం చదివే వారికీ ఆటంకం కలుగకుండా పాత లిపి పరిచయంతో కొత్త లిపి రావాలన్నది ముఖ్యం.

55 ఏళ్ళ క్రితం ఆనాటి ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 'కూలిన గోడలు' అనే దారావాహిక నవలతో నాలాంటి వేలాది పాఠకుల అభిమాన రచయిత్రి అయినారు. ఎన్నో నవలలు రాస్తూ హేతువాద విప్లవాన్ని ప్రజల హృదయాల్లో రగిలించారు. దిన, వార, మాస పత్రికల్లో నేటికీ సమాజ రుగ్మతల క్షాళనతో రచనలు చేయడం ఇంకా ఆపలేదు.

చివర మరో విషయం. ఆంధ్రదేశంలో 'జ' ని 'న్య'గాను'ఇ' ని ఇణి అనీ పలుకుతారట. మా ప్రాంతమంతటా 'జ'ని నడి నాలుకను సరిగ్గా పై అంగళానికి ముట్టించి పలుకుతారు. 'ఇ'ని నాలుకను కుడివైపు దంతపు పై దిండుకు తగిలించి పలుకుతారు. కావున **ఈ రెంటినీ అలాగే ఉంచేయడం మేలని నా అభిప్రాయం.** ఏదేమైనా లిపి దిద్దుబాటు తప్పనిసరి అంటూ రంగనాయకమ్మగారికి నా మది నిండు మప్పిదాలు.

– నంద్యాల నారాయణ రెడ్డి
09360514800

స్పందన

కొన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం.

తెలుగు అక్షరాల తీరు – రూపం మారాలి, మార్చాలి అన్న ఆలోచనలు చేస్తున్నారు కొంతమంది. మంచిదే. కానీ కొన్ని విషయా లను పరిగణనలోకి తీసుకోవడం అవసరం.

తెలుగు అక్షరాలు చాలా అందమైనవి. పువ్వుల వలె కొన్ని ఉంటాయి. ఎగిరే పక్షులవలె కొన్ని వుంటాయి. అంతేకాదు తెలుగు భాషలో ఏ భాషలోనూ లేని మూడు సొబగులు వున్నాయి. అది చిత్రభాష, సంగీతభాష మరియు భావనాభాష. ప్రతీ అక్షరం ఒక చిత్రంలా వుండటమే కాకుండా, ఒక పదం వుందంటే అది ఒక చిత్రాన్ని, ఒక చిత్ర సంజ్ఞను మన మనసులో కల్పన చేయిస్తుంది. అలాగే ఒక పదంగా అవసరం లేదు. ఒక అక్షరం అయినా సరే అందమైన సంగీత ధ్వనులను కలిగి వుంటుంది. అంతేకాదు ప్రతీ పదం ఒక భావనను మస్తిష్కంలోకి తెస్తుంది.

తెలుగు అక్షర రూపానికీ, యీ సంగీత, భావనా, చిత్ర సంజ్ఞలకూ సంబంధం వుండదు' అని చెప్పలేము. 'రాణి' అన్న పదంలో 'ణి' ని 'ని'గా అనుకోమని చెప్పడం వల్ల, ణ అనీ అన్న అందమైన అక్షరం కనుమరుగవుతుంది. 'న'కి పెట్టిన ఆ గుర్తు మరో అక్షరానికి కూడా పెడితే దాని అర్థం మారిపోతుంది.

18 కోట్ల తెలుగు ప్రజల విషయం యిది. కనీసం ఒక లక్షమంది అయినా యీ చర్చలో పాల్గొని, మార్పు ఏకగ్రీవంగా చెయ్యాలి. తెలుగువాళ్ళల్లో సలహాదారులు ఎక్కువ, పాటించేవాళ్ళు తక్కువ.

సీతని చేయబోతే కోతి అయిందన్నట్లు, అయ్యవారిని చేయబోతే హనుమంతుడైనట్టుగా కాకుండ అందరూ శ్రద్ధ వహించాలి. చెబుతున్న యీ మార్పులు చూస్తుంటే భాష రూపమే కాదు, ఎంతో అందమైన చరిత్రనీ, వ్యక్తిత్వాన్ని కూడా కోల్పోయేలా వుంది. ఇదంతా ఎందుకు, వున్న తెలుగును వున్నట్టుంచి, ఇంగ్లీషు అక్షరాలనే తెలుగు పదాలుగా మార్చుకుంటే పోతుందేమో. ఈ సిగపట్లు తగ్గి, నెత్తి బోడిగుండు అవకుండా వుంటుంది.

డి.నటరాజ్
9440428597

డా॥ అల్లంసెట్టి చంద్రశేఖర రావు
99496 05141

తెలుగు లిపి - సంస్కరణావశ్యకత

మానవుడు మాట్లాడడం నేర్చుకొన్న తరవాత ఎన్నోవేల ఏండ్లకు గాని రాత నేర్చుకోలేదు. ఇప్పటికీ లిపిలేని భాషలు చాలా వున్నాయి. లిపి అన్నది కంటికి కనిపించే ఒక గుర్తు. భాష గాని లిపి గాని సంప్రదాయకంగా, అనుస్రుతంగా ఒక భాషాసముదాయం యొక్క పరస్పర అంగీకారంతో కొనసాగుతున్న అసంబద్ధ (arbitrary) వ్యవ హారం. 'కమల' అన్న మూడక్షరాలు దేవనాగరి లిపిలో రాస్తే హిందీ భాషలో 'కమల్' అనీ, సంస్కృతంలో 'కమల' అనీ చదువుతారు. చివరి రెండు అక్షరాలు తారుమారు చేసి చదివితే అది హిందీలో 'కలమ్' అవుతుంది. హిందీలో ఒకే హల్లు అక్షరంగాను పొల్లుగాను ధ్వనిస్తుంది. తెలుగు లిపి చాలా వరకు ధ్వని విధేయంగా వుంటుంది. అంతేగాక దేవనాగరి లిపిలో లేని అక్షరాలు గూడ తెలుగులో ఉన్నాయి. కొత్తగా రెండుమూడక్షరాలు సృష్టించుకొంటే ఏ భాష నయినా ధ్వనివిధేయంగా తెలుగులో రాసుకోవచ్చు. ఇది తెలుగు లిపియొక్క గొప్పతనం.

లిపికీ భాషకీ సంబంధం లేదు. 'అ' అన్న గుర్తుని తెలుగు వారందరూ 'అ' అని చదవడంవల్ల ఆ గుర్తుకి 'అ' అనే ధ్వని వచ్చింది. ఇంగ్లీషులో & అన్న గుర్తుని and అని చదువుతారు. ఈ గుర్తు ఇతరభాషలు మాట్లాడేవారికి గూడ 'మరియు' అన్న అర్థాన్నే తెలియ జేస్తుంది. తెలుగులో 'మరియు' అని చదవవచ్చు. ఈ అక్షరాన్ని ఈ విధంగా పలకాలి అని అక్షరాభ్యాసం చేసిన ఉపాధ్యాయుడు చెప్తాడు. ఒకవేళ ఉపాధ్యాయుడే తప్పుగా ఉచ్చరిస్తే అతని విద్యార్థులకు అదే అలవాటయిపోతుంది. ఏ భాషనైనా ఏ లిపిలోనైనా రాయవచ్చు. అక్షరాలు ధ్వని సంకేతాలు కాబట్టి ఎక్కువ అక్షరాలు ఉన్నభాష ఎక్కువ భాషలు రాయడానికి ఉపయోగ పడుతుంది. తెలుగులో 56(అవసరం లేని రెండో చ, రెండో జ తో కలిసి) అక్షరాలు ఉన్నాయి కాబట్టి తెలుగులిపిలో సంస్కృతం, హిందీ, తమిళం, ఇంగ్లీషు మొదలయిన అనేక భాషలను రాసుకోవచ్చు. నేటి 'తమిళ్ ' లోని 'ఴ' నన్నయకు పూర్వపు తెలుగులో ఉండేది. తమిళం రాయడానికి కొత్తగా 'ళ' కింద గీతగీస్తే తెలుగులో తమిళ భాష రాసుకోవచ్చు. తమిళంలోని 'తిరావిడ మున్నేఴ్ఱ కఴగం' ను తెలుగులో 'ద్రావిడ మున్నేట్ర కజగం' అని రాస్తున్నాం. తమిళులు 'ఱ్ఱ' రాసినా 'ట్ర' అని చదువుతారు. నన్నయ్య నాటికే తెలుగులో 'ఴ' 'ళ', 'డ' లుగా మారిపోయింది. చోళ రాజులు, నన్ని చోడుడు అని రాస్తున్నాం. ఇంగ్లీషు వార్తా పత్రికలలో 'ఴ' కు "z" వాడుతున్నారు. ఈ జబ్బు మనకంటుకుంది.

తెలుగులో రెండు ధ్వనులు కొత్తగా ప్రవేశించాయి. 1. అ ఇ ల మధ్యస్థంగా వినబడే ధ్వని. వచ్చినాడు అన్న ప్రాచీన రూపం కోస్తాంధ్రలోను తెలంగాణలోను మార్పుకు లోనయింది. 'వచ్చి నాడు' అన్న మాటలోని న మీదున్న అచ్చు లోపిస్తే 'వచ్చి న్ డు' = 'వచ్చిన్డు' అవుతుంది. హల్లు లోపిస్తే 'వచ్చి ఆడు' వచ్ +ఇ +ఆడు'. ఇ ఆ ల మధ్యస్త ధ్వని వుంది కాని ఈ ధ్వనిని సూచించే అక్షరం లేదు.

ఇంగ్లీషులోని bank అన్న మాటను తెలుగులో 'బ్యాంకు' అని రాస్తున్నాం. ఈ విధంగా రాయడం సుమారు 150 సంవత్సరాల నుండి వుంది. చదివేటప్పుడు 'బ్యాంకు' అని చదవడం. 'బ్యాంకు' అని రాసేటప్పుడు య వత్తు వాడుతున్నాం. ఖ్యాతి అని రాసేటప్పుడు గూడ య వత్తు వాడుతున్నాం. ఒకే గుర్తుకి రెండు ధ్వనులు. దీనిని సరిదిద్దుకోవాలంటే ఒక కొత్త అక్షరాన్ని సృష్టించుకోవాలి. 'ఇ ఆ' మధ్య వినిపించే ధ్వని ఆధునిక భాషలో వర్ణంగూడ. అందుచేత ఒక కొత్త అక్షరం కావాలి. ఇది దీర్ఘాచ్చు. దీనికి హ్రస్వం లేదు. దీర్ఘానికి క్వొటేషన్ కలిపిరాస్తే చాలు. ప్రస్తుతానికి ప్రింటులో ఇది సాధ్యం కాదు. బా'ంకు, కా'ష్, వచ్చా'ను, చూశా'ను అని రాయొచ్చు.

2. 'కాఫీ' తో తెలుగులో "f" ధ్వని కలిసిపోయింది. కొందరు 'ఫలము' ను (fa) ఫలము' అని చదువుతున్నారు. ఈ భేదం తెలియ జేయడానికి ఒక కొత్త అక్షరం కావాలి. 'ఫ' కింద చుక్క పెడితే సరి పోతుంది. ఫీజులు తగ్గించాలి అని రాస్తున్నారు. ఇంగ్లీషు బహు వచనానికి మరొక తెలుగు బహువచన ప్రత్యయం 'లు' చేర్చి రాసేం తగా తెలుగయిపోయింది.

తెలుగు(2 రాష్ట్రాలలోని) లిపిని సంస్కరించాలి అంటూ అప్పుడ ప్పుడు పత్రికలలో వ్యాసాలు వస్తుంటాయి. ఇప్పటి రాతలో ఉన్న లోపాలేమిటి, వాటిని ఏ విధంగా సంస్కరించాలి అని ఆలోచించాలి. లిపి సంస్కారంవల్ల రాతలో వేగం పెరుగుతుందా? రాతలోని క్లిష్టత తొలగుతుందా? అనవసరమయిన విశేష చిహ్నాలు తొలగించే అవ కాశం వుందా? ఈ లిపిలో భాషలోని అన్ని వర్ణాలను నిర్దుష్టంగా రాయవచ్చా? అని ఆలోచించాలి.

నేను 1972-73 లో మయ్సూరులోని కేంద్రీయ భాషా అధ్యయన సంస్థాన్‌లో తమిళం నేర్చుకొన్నాను. అప్పుడు తెలుగు నేర్చుకోడానికి హరియానానుండి కొందరు ఉపాధ్యాయులు వచ్చారు. త్రిభాషా సూత్రం ప్రకారం హరియానా రాష్ట్రం తెలుగును ఎంపిక చేసుకొంది. హరియానాలోని ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు మూడవ భాషగా తెలుగును నేర్పడంకోసం తెలుగుభాష నేర్చుకోడానికి వచ్చిన ఉపాధ్యాయులు వారు. తెలుగు గుణింతాలు నేర్చుకోవడం వారికి కష్టమయింది. హిందీలో ద్విత్వ సంయుక్తాక్షరాలు రాయడానికి మొదటి హల్లుని సగంమాత్రమే రాసి దాని పక్క రెండో హల్లు రాస్తారు. 'పుస్‌తక్' అని హిందీలో రాస్తే దానిని తెలుగులో 'పుస్తక్' అని రాయాలి. తెలుగులో తకారానికి గుణింతంలో ఒక విశేష చిహ్నం వుంది. దీనిని వేరేగా నేర్చుకోవాలి. 'గ' విషయంలో ఈ ఇబ్బంది లేదు. ఈ ఇబ్బందిని చాలా సులువుగా దాటవచ్చు. హిందీ రాత

విధానాన్ని అనుసరిస్తే సరిపోతుంది. తమిళంలోనూ హల్లు పక్క హల్లు రాస్తారు. అయితే సగం హల్లు రాయరు. పొల్లు అక్షరం రాస్తారు. తెలుగులాగే తమిళం గూడ అక్షరలిపి, అంటే అకారంతో కూడిన హల్లు కలిగివుంది. మనం తలకట్టు వుంచుతాం. తమిళ అక్షరాలకు తలకట్టు లేదు. పొల్లును సూచించడానికి హల్లు మీద ఒక చుక్క వుంచుతారు. మనం 'అయ్యా' అని రాస్తే వారు 'అయ్‌యా' అని రాస్తారు. ఈ పద్ధతి తెలుగు భాష రాయడానికి అనువుగా వుంటుంది. మనం గూడ 'అయ్‌యా, అమ్‌మా, పక్‌షి, శాస్‌త్‌రము, అయ్‌యవసరము' అని రాసుకోవచ్చు. 'అయ్యవసరము' అన్న సమాసాన్ని 'అయ్య + వసరము' అని విద్యార్థులు తప్పుగా విడదీయలేరు. గుణింతాలలో హల్లులకు విశేష చిహ్నాలు లేనికారణంగా నేర్చుకోవడం సులభం. 'పక్షి' ని "ప, క కింద ష రాస్తే ఇక్ష, ఇక్ష కి గుడిస్తే ఇక్షి" అని కూడబలుక్కోవలసిన పనిలేదు. రాతలో 'క' కి గుడి ఇస్తాం. కాని చదివేటప్పుడు 'ష' కి గుడి ఇచ్చి 'షి' అని చదువుతాం. 'పక్‌షి' అని రాస్తే బాగుంటుంది కదా. ఈ పద్ధతిలో ధ్వనులు ఏవిధంగా వరుసగా ఒకదాని తరవాత ఒకటి వినిపిస్తాయో అదే విధంగా రాయడం జరుగుతుంది. ధ్వని విశ్లేషణకు ఈ పద్ధతి వీలుగా వుంటుంది. అక్షరం కింద అక్షరం రాని కారణంగా అక్షరం ఎత్తు తగ్గుతుంది. ఒక పేజీలో ఎక్కువ వరుసలు పడతాయి. కాని పొడవు పెరుగుతుంది. ఈ రాతవిధానం ఆచరణ సాధ్యమయినది. నేను సవర భాష రాయడానికి ఈ పద్ధతినే వాడుతున్నాను. సవర మాసపత్రికలో ఇదే పద్ధతిని అవలంభించాను. తెలుగు భాషలో విద్యాభ్యాసం చేస్తున్న సవర విద్యార్థులు కష్టం లేకుండా సవరభాష రాయగలుగుతున్నారు.

"తెనుగునకువర్ణములు ముప్పది యాఱు" అన్న సూత్రాన్ని పట్టుకొని తెలుగు వీరాభిమానులు మాభాషకు 36 అక్షరాలు సరిపోతాయి అని వాదిస్తున్నారు. కాని మనభాషలో అనేక ఇతరభాషా పదాలు తత్సమాలుగా చేరిపోయి వాడుకలో ఉన్నాయి. పండితుల భాషలోనే కాదు పామరుల భాషలో గూడ ఇవి గణనీయంగానే వున్నాయి. వాటిని రాయాలి కదా. అన్ని నాగరిక భాషలలోను ఇతర భాషాపదాలు వుంటాయి. కొన్ని హిందీ సినిమా పేర్లలో 'ఫ' కింద ఒక చుక్క ఉండడం చూసేవుంటారు. దేవనాగరి లిపిలో ఈ ధ్వని లేదు. దీని ధ్వని ఇంగ్లీషులోని f ధ్వనితో సమానమయినది. మడిగట్టుకొన్న తమిళులు గూడ ఇతరభాషా పదాలు రాయడానికి కొత్తగా అక్షరాలు సృష్టించుకొన్నారు. వీటిని గ్రంథాక్షరాలంటారు. వారు ఒత్తక్షరాలు వాడరు కాబట్టి రాతలో వాటి అవసరం లేదు. వారి లిపిలో పరుష సరళాలకు ఒకే అక్షరం రాస్తారు. అంటే క, గ లకు ఒకే అక్షరం. అలాగే చ జ లకు ట డ లకు త ద లకు ప బ లకు ఒకే అక్షరం రాస్తారు. పదాదిలోను, ద్విత్వంలోను పరుషం గాను మిగిలిన చోట్ల సరళం గాను పలుకుతారు. మన భాషలో 'క చ ట త ప లు, గ జ డ ద బ' లయినట్లు. తెలుగువారు 'వెంకమాంబ' అని రాయగలరు. అలాగే 'వెంగమాంబ' అనిగూడ రాయగలరు. తమిళ పండితులు 'హొటల్' అని రాయడానికి 'హ' అక్షరాన్ని, 'సా మిల్' అని రాయడానికి 'స' అన్న అక్షరాన్ని సృష్టించుకున్నారు. మనం 'దైవం' అన్న మాటని 'దయ్‌వం' అని పలికితే తమిళులు 'దెయ్‌వమ్' అని పలుకుతారు. 'జయలలిత' అన్న పేరుని 'జెయలలిత' అని రాస్తారు. వారి లిపిలో పదాదిలో సరళం పలకదు కాబట్టి 'జ' అక్షరాన్ని సృష్టించుకొన్నారు. అందుచేత రాయడానికి ధ్వనిసంకేతాలు (అక్షరాలు) తగ్గించాలి అన్న ఆలోచన సరయినది కాదు.

ఒకటవ తరగతిలో అక్షరాభ్యాసం చేస్తారు. సంపాదకులు మారినప్పుడల్లా ఒకటవ (ఒకటో) తరగతి వాచకంలోని అక్షరాల సంఖ్య మారుతూనే వుంటుంది. పిల్లలపై భారం తగ్గించడం కోసమని నేర్చుకోవలసిన అక్షరాల సంఖ్యను తగ్గిస్తున్నారు. అక్షరాభ్యాసంలో నేర్చుకోని అక్షరం పెద్దయిన తరవాత ఏ ప్రాచీన గ్రంథంలోనయినా కనిపిస్తే దానిని ఎలా చదవాలో తెలీక, ఎవరినడగాలో తెలీక ఎంత మధనపడాలో కదా. ఒకవేళ ఏ ముసలి పండితుని దగ్గరకు వెళ్ళి తెలుసుకోవాలన్నా నామోషీ కాదా. అందుచేత అక్షరాభ్యాస కాలంలోనే స్పష్టమయిన ఉచ్చారణతో అన్ని అక్షరాలు చదవడం నేర్చుకోవాలి.

తెలుగు అక్షరమాలలోని అక్షరాలను పరిశీలిద్దాం. కంఠబిలం నుండి ఎక్కడా ఏవిధమయిన ఆటంకం లేకుండా నోటినుండి ధారాలంగా వెలువడే ధ్వనులు అచ్చులు. అచ్చులలో 'అలు, అలూ' లను తొలగించవచ్చు. 'క్లుప్తము' అన్న మాటలో 'క' కింద 'అలు' రాయాలంటారు. (ఉచ్చారణ తప్పు. నా కీబోర్డులో ఈ అక్షరాలు లేవు) 'ఋ, ౠ' ల విషయానికి వస్తే ముందుగా వీటి ఉచ్చారణ తెలుసుకోవాలి. ఉచ్చారణ అనేది అనుస్రుతంగా వస్తుంది. చిన్నప్పుడు ఇంట్లో 'కృష్ణా, కృష్ణా' అని ముద్దుగా పిలుస్తారు. బడిలో వేసినతరవాత, మేష్టర్లు కదా, ప్రతీపదాన్నీ నొక్కి పలుకుతారు. 'కృష్ణుడు క్రుష్ణుడు' అయిపోతాడు. రాతలో మాత్రం కృష్ణుడే. కొందరు 'క్రిష్ణ' అనిగూడ పలుకుతారు. 'ఋ' కార ఉచ్చారణ ఇ ఉ ల మధ్యస్తంగా వుంటుంది. అచ్చులలాగ తేల్చి పలకాలి. 'అమృత' అన్న పదాన్ని ఇంగ్లీషులో Amritha అని రాయడం వుంది. విద్యార్థులు గురు లఘు నిర్దేశం చేసేటప్పుడు 'కృష్ణ' లోని 'కృ' ని 'క్రైక' లోని 'క్రై' ని సంయుక్తాక్షరంగా భ్రమిస్తుంటారు. కారణం ఈ రెండచ్చులూ వత్తుల్లాగ అక్షరం కింద రావడం. ద్విత్వ సంయుక్తాక్షరాలను నొక్కి పలుకుతాం. అందువల్ల సంయుక్తాక్షరంలోని మొదటి హల్లు దానిముందున్న అక్షరానికి పొడిగింపు అవుతుంది. 'అకృత్యము' లోని 'అ' లఘువు. గురువు కాదు. కాలానుగుణంగా 'ఋ' ధ్వని 'రు' తో సమానమయిపోయింది. ఆరుద్ర ఒక పాటలో 'అమృతము దేవతల పాలై అలసటే మాదైనదే' అంటూ రాస్తే 'అమ్రుతము' అని 'అ' మీద ఊనికవుంచి పాడారు. పాట, పద్యం లయ ప్రధానమయినవి. ప్రాచీన గ్రంథాలలోని పద్యాలలో గూడ ఈ విధమయిన ధ్వనిమార్పు చూడవచ్చు. అక్షరం పక్క అక్షరం రాసే పద్ధతి పాటిస్తే 'అమ్రుతము' ను 'అమ్‌రుతము' అని రాయాలి. అప్పుడు 'అమ్' ఒక syllable అవుతుంది. అది దీర్ఘాక్షరం.

'ఐ, ఔ' అన్న అక్షరాలు నేర్చుకోవచ్చుగాని కొత్తగా రాయవలసివచ్చేటప్పుడు 'అయ్, అవ్' అని రాస్తే సరిపోతుంది. ఈ రెండక్షరాలను సంధ్యచ్చులు అంటారు. వీటిని వాడుకనుండి తప్పించవచ్చు. చాలా మంది రచయితలు 'అయితే, అవును' అని రాస్తున్నారు. ఈ పద్ధతి వల్ల 'అయ్‌తే, అవ్‌ను' అని గూడ రాసుకోవచ్చు. 'దయ్‌వమ్, దెయ్‌వమ్' అనిగూడ రావచ్చు.

హల్లుల విషయానికొస్తే తెలుగులో 'ఙ, ఞ' లు సంయుక్తాక్షరాలలో మాత్రమే దర్శనమిస్తాయి. 'గంగా తరంగాల సారంగ రాగాలు' లో 'గ' ముందున్న ధ్వని 'ఙ్'. 'మంజరి' లో 'జ' ముందున్న ధ్వని

'ఞ్'. ఈ ధ్వనులను సున్న ద్వారా సూచిస్తున్నాం. సున్న ఉపయోగించడం వల్ల రాత సులభం అవుతుంది. తన తరవాత వచ్చే ధ్వని కారణంగా సున్న సమీకరణం చెంది వర్గానునాసికంగా మారుతుంది. పన్ది, కణడ, అమ్బరం వంటి పదాలను పంది, కండ అంబరం అని రాయొచ్చు.

'ఙ, ఞ ' లను ఒక్కొక్కరు ఒక్కోవిధంగా పలుకుతున్నారు. 'ఙ' క వర్గానికి చెందినది. అనునాసికం. దీని ఉచ్చారణ ఇంగ్లీషు "సిఙ్' లోని చివర వినిపించే ధ్వని. ముక్కు మూసుకొని 'గ' అంటే వెలువడే ధ్వని. "సింగ్" అని రాయడానికి కుదరదు. అలా రాస్తే 'సి' మీద ఊనికి వుంటుంది. అక్షరాభ్యాసంలోనే ఈ అక్షరాల ఉచ్చారణ నేర్చుకోవాలి.

ముక్కు మూసుకొని 'జ' అంటే వెలువడే ధ్వని.'ఞ'. ఈ అక్షరం తమిళం సవర భాషలలో పదాదిలో గూడ వస్తుంది. ఙ తెలుగులో 'జ్ఞానం, ప్రతిజ్ఞ' వంటి పదాలలో 'జ' తో కలిసి కసిపిస్తుంది. 'జ్ఞ' అనే సంయుక్తాక్షరంలోని ఏ హల్లు గూడ ఆ ధ్వనిని పలకదు. అనుసృతంగా వస్తున్న ధ్వనిని ఈ అక్షరాల ద్వారా సూచిస్తున్నాం. కొందరు 'గ్నానం, ప్రతిగ్న' అన్నా తప్పుపట్టలేం.

'ఙ' ధ్వని 'వాఙ్మయము' వంటి పదాలలో వినిపిస్తుంది. ప్రసార మాధ్యమాలలో 'వాగ్మయము' అని రాయడం చూస్తున్నాం. 'వాక్ + మయము' అన్న రెండుమాటలు తొందరగా పలకడంవల్ల (సంధి) క కారం తన తరవాత వచ్చే 'మ' అనే అనునాశికం కారణంగా సమీకరణం జరిగి 'ఙ్' గా మారుతుంది.

రెండో 'చ' రెండో 'జ' ని రాయడానికి ఆ అక్షరాలమీద తెలుగు 2వ అంకె వేసేవారు. వీటిని పూర్తిగా తొలగించవచ్చు. 56 అక్షరాలలో 2 అక్షరాలు తగ్గుతాయి.

తెలుగులో 'థ, ధ' లు సవర్ణాలు. 'రథము' అన్నా 'రధము' అన్నా అర్థభేదం లేదు. అందుచేత రెండక్షరాలకు బదులు ఒకే అక్షరం వాడుకోవచ్చు. ఎక్కువమంది 'ధ' అంటున్నారు కాబట్టి 'థ' ని అక్షర మాలనుండి తొలగించవచ్చు. కాని థ కారం కొందరి వాడుకలో వుంది. శ్రీకాకుళంలోని కథానిలయానికి రాయలశీమ తెలంగాణ నుండి వచ్చిన ఉపన్యాసకులు 'కథ' అనే పలుకుతున్నారు. ఇక్కడివారు గూడ మైకు ముందు ప్రయత్నపూర్వకంగా కథ అంటున్నారు. దీనిని ప్రయత్నపూర్వకంగా నిలబెట్టుకొంటున్నాం. రాతలో ఇంకా నిలిచే వుంది.

ఇక బండి ఱ. ఈ ఱ కారానికి రేఫధ్వని (ర ధ్వని) ఎప్పుడు వచ్చిందో తెలియదు. చరిత్రకాలంలో దీనిధ్వని 'త, ట' ల మధ్యస్తంగా వుండేది. తెలుగులోని 'తాత' అన్న మాటలోని రెండవ త కార ధ్వని. ఇప్పటికీ తమిళంలో ఈ అక్షరం వాడుకలో వుంది. నేటి తమిళ ఉచ్చారణలో దీనికి రెండు ధ్వనులున్నాయి. "తి(ది)రావిడ మున్నేట్ర కళగం" అని రాసి"తి (ది) రావిడ మున్నేట్ర కళగం" అని చదువుతారు. పామరులు "మున్నేత్ర" అనే అంటున్నారు. తెలుగు పాఠ్యపుస్తకాలు రాసే రచయితలు విద్యార్థులకు 'బండి ఱ' నేర్పాలా వద్దా అనే సంశయంలో ఉన్నారు. ఱ అన్న అక్షరం ప్రాచీన గ్రంథాలలో వుంది, దాని ధ్వని ర తో సమానం అని పరిచయం చేస్తే చాలు. గుఱ్ఱము అని రాసినా 'గుర్రము' అని రాసినా ఉచ్చారణలో భేదం లేదు. నేటి రాతలో దీనిని పూర్తిగా తొలగించవచ్చు.

యరలవలలోని 'క్ష' ని తొలగించవచ్చా? 'అక్షరం' లోని 'క్ష' ధ్వని వేరు, 'రిక్షా' లోని 'క్ష' ధ్వని వేరు. అయినా ఈ రెండు ధ్వనులనీ సవర్ణాలుగా గ్రహించవచ్చు. చేతి రాతలో ఒక్కలాగే రాసినా ప్రింటులో వేరే అక్షరాలు వాడుతున్నారు. కీ బోర్డులో 'క్ష' కి ఒక మీట వుంది.

'ఖ ఘ ఝ ఠ థ' ల విషయంలో రంగనాయకమ్మగారి సూచనలు ఆమోదయోగ్యమయినవి. ఆచరణ సాధ్యమయినవి.

గుణింతాల గురించి ఆలోచిద్దాం. రాత విధానంలో కొన్ని మార్పులు వచ్చాయి. నా చిన్నతనంలో 'వలపలగిలక' అనే చిహ్నం నేర్పారు. 'కర్త (కర్‌త) అన్న మాటని 'కత(న్)' గా రాసేవారు. (న్) నకారపు పొల్లు కాదు. కీ బోర్డులో ఈ గుర్తు లేదు. క తరవాత 'వలపలగిలక' ఇచ్చి దానిని రకారపు పొల్లుగా (ర్) క ముందుకు (దాపలకు) తెచ్చి చదివేవారు. ఇప్పటి రాత మెరుగయినది. కర్‌త అని రాస్తున్నాం. చిన్నప్పుడు మాకోత్వం ఇచ్చి గుణింతం నేర్చుకొన్నాం. మకోత్వమిస్తే మో అని చదివేవాళ్ళం. ఇప్పుడు మ కు ఎత్వం, మ కు దీర్ఘం ఇచ్చి 'మో' అంటున్నాం. మ కు ఎత్వం, దానికి కొమ్ము ఇచ్చి 'మొ' అంటున్నాం. ఈ పద్ధతి అప్పుడు మాకు కొత్త. ఇప్పుడు అలవాటుపడిపోయాం. మా న్నా 1900 సంవత్సరంలో పుట్టారు. 1970 లో చనిపోయారు. కవి, పండితుడు. అతను రాసిన పుస్తకాలలో 'కొ' ను 'క' కు ఎత్వం కొమ్ము ఇచ్చి రాసేవారు. 'కో' ను 'క' కు ఎత్వం కొమ్ముదీర్ఘం ఇచ్చి రాసేవారు. తమిళంలో ఇంచుమించు ఇదే పద్ధతి వుంది.

లిపిని సంస్కరించడం అంటే అక్షరాలను తగ్గించడం కాదు. ఉచ్చారణ విధేయంగా లిపిని రూపొందించాలి. తెలుగులిపి ఉచ్చారణ విధేయంగా వుంటుంది అని చూశా'ం. అక్షరాభ్యాసం చేయించేటప్పుడు లిపి విధేయంగా ఉచ్చారణ ఉండేటట్లు చూడాలి. విద్యార్థులకు మౌఖిక శిక్షణ ఇవ్వాలి. అభ్యాసం చేయించాలి. అంతకంటే ముందు ఉపాధ్యాయుని వాచకం బాగుండాలి. వాచకం అంటే పాఠ్య పుస్తకం కాదు, నోరు అని గ్రహించాలి. దీర్ఘాలు రాసి దీర్ఘంగా పలకకపోవడం, ఒత్తక్షరాలు రాసి ఒత్తులు పలకకపోవడం చదవడంలో లోపాలుగా గుర్తించాలి. ఉచ్చారణను సరిదిద్దుకోవాలి. ఒత్తులు లేని చోట్ల ఒత్తులు పెట్టడం గూడ తప్పే. అలాగే ద్విత్వాక్షరాలను చదవక పోవడం తప్పయితే ద్విత్వాలను పలుకుతూ రాతలో వాటిని చూపక పోవడం మరీపెద్ద తప్పు. రాత అన్నది పరోక్షంలో రచయిత మాటలను వినడానికి కదా ఏర్పరచుకొన్నది !

కొందరు భాష, యాస అంటూ ఉపన్యాసాలు ఇస్తుంటారు. యాసలో ఉపన్యసించరు. కొందరు విద్యావేత్తలు భాష మాండలికాలతోపాటు యాసలో రచనలు చేయాలంటుంటారు. మంచి ఆలోచన. పనిగట్టుకోకుండా రచయిత నేటి తెలుగు లిపిలో తన యాసలో రచనచేస్తే స్వాగతిద్దాం. రచయిత సహాయం లేకుండా ఇతరులు ఎలా చదువుతారో పరిశీలిద్దాం. నేడు వాడుకలోవున్న తెలుగులిపిలో యాసను రాయగలరేమో! వేచి చూద్దాం.

రచయిత సవర తెలుగు భాషల్లో నిపుణతగల ఆచార్యులు.

అ

ఐతా చంద్రయ్య
9391205299

అభయతారకం

"పెళ్ళీడు దాటుతున్న చెట్టంత కొడుకు ఇంట్లో గోళ్లు గిల్లుకుంటూ కూచుంటే ఒంటిమీద చలిచీమ పారినట్టు గూడా లేదా?" వీరమణి పారాయణం ప్రారంభమైంది. ఇదే వైఖరితో పదేపదే వీరమణి నిలదియ్యడం, భర్త రంగారావు కుడితిలో పడ్డ చుంచు ఎలుకలా మెలికలు తిరిగిపోవడం పరిపాటి అయింది.

"వాని ఖర్మకు నేనేం చెయ్యాలి మణీ? వానికి పెళ్లి చేస్తే సంవత్సరంలోగా నువు నానమ్మవు, నేను తాతయ్యనవుతాం గదా!" ధర్మ సందేహానికి ధీటుగా సమాధానమిచ్చిట్టు రంగారావు దర్జాగా సోఫాలో కూచున్నాడు.

"ఆ...ఆ...తాను దూరసందు లేదు గాని, మెడకో డోలు అన్నట్టు వానికే అతీ, గతీ లేదు, ఇంకా పెళ్ళా? తెలుగు మాటలు సరిగా రాని నీ కొడుక్కో ఉద్యోగం దొరకాలి గదా!" గరిటను గాల్లో తిప్పుతూ వచ్చి ఎదురుగా నుంచుంది.

"వాన్ని ఇంగ్లీషు మీడియంలో చదివించడం తప్పయింది. తెలుగు భాష మరిచి పోయిండు మణీ!

"మరిచి పోయిండని ఎవరన్నారు?".

"ఎవరనేదేమున్నదటా! నీ పేరేమిటని అడిగితే వేగోల్ అంటాడు. వేణుగోపాల్ అనొచ్చుగదా! ఎర్రగా బుర్రగా ఉన్నంత మాత్రాన ఏం లాభం? మీదేవూరు అని అడిగితే మెడక్ అంటాడు. మెదకు అనొచ్చుగదా! ఏం చదివావంటే మూడేళ్ళ బేకామ్ డిగ్రీ ఐదేళ్ళు చదివి, యం.కాం.ను మూడేళ్ళు చదివానంటాడు. బి.కాం. అనరాదా? బేకాం అంటాడెందుకూ?"

"మరి వాన్ని కె.జి.నుండి పి.జి. దాకా ఇంటర్నేషనల్ ఇంగ్లీషు మీడియంలో చదివించినాం గదా!" పక్కన కూచుంది.

"ప్చ్...తెలుగు మాధ్యమంలో చదివిస్తే బాగుండేది".

అరెరే...ఇంగ్లీషులో చదివిస్తే ఉన్న

"వెరీగుడ్...గుగు...గుమ్మీ...క్కా...కాదు మమ్మీ...ఆహా! అది కాదు అమ్మా!" వేణుగోపాల్ విశ్వ ప్రయత్నం! "వీడు తెలుగు భాషకు తెగులు పట్టిస్తున్నాడు". రంగారావు బుర్రలో ఆలోచనల ప్రవాహవేగం పుంజుకుంది. శూన్యంలోకి చూస్తూ "సరే...నాకు తెలిసినవాళ్ల కిరాణా దుకాణంలోనో, మిల్లులోనూ ప్రయత్నిద్దాం". వినూత్న సంభాషణకు విరామ చిహ్నం పెట్టేశాడు.



మతి పోయినట్టైంది".

"నా కొడుక్కు మతి పోలేదు. గతి లేక..." కనుగుడ్లు గచ్చకాయల్లాగయినాయి.

తాను ఆఫీసులో అటెండర్‌ను మందలించిన దృశ్యం గుర్తుకొచ్చింది రంగారావుకు.

"గతి లేదంటే మాతృభాషను మరిచి పోవడం. ఇంటర్, డిగ్రీలో రెండో భాష సంస్కృతమేనాయె. తెలుగెట్లా వస్తుందటా?"

"అయినా చిల్లిగవ్వ సంపాదన లేనోనికి పిల్లనెవడిస్తాడు?" సవాలు విసురుతుంది.

ప్రైవేటు కంపెనీలో గుమాస్తా ఉద్యోగంలో దినదినగండం నూరేళ్లాయుష్షులా కాలాన్నీడ్చుతున్న రంగారావు ఇంట్లో రోజువారీ ఆనవాయితి యిది. ఇంటిలోని పోరు ఇంతింతగాదయా! పద్యం నెమరేసుకున్నాడు.

ఆ రోజు మాత్రం అంతటితో శుభం కార్డు పడలేదు.

"నైనా! నైనా!" మధ్య మావది మంద్ర స్వరముతో వేణుగోపాల్ పరుగులా వచ్చాడు. కోతికి కొబ్బరి చిప్ప కనబడినంతగా ఆరాట పడుతున్నాడు.

"నైనా ఏమిట్రా నా బొంద!" తిక్కరేగిన రంగారావు నక్క మొహం పెట్టాడు. "సరిగ్గా పిలవాలని ఎన్నిసార్లో చెప్పాను గదరా!"

మరెట్లా కాల్ చెయ్యాలి నైనా? డాడీ అనవద్దన్నారు గదా! చూడు గుమ్మీ.!" గారాల సంబరాన్నంతా ఒలకబోస్తూ తల్లి వైపు చూశాడు.

"అయ్యయ్యో! గుమ్మీ ఏమిట్రా? నేను గుమ్మిలాగ కన్పిస్తున్నానా?" వీరమణి నెత్తి కొట్టుకుంది.

"మరి...మమ్మీ అంటే దయ్యమని, అట్లా కాల్ చెయ్యద్దన్నరు గదా!"

"కాల్ చెయ్యడమా, నా పిండాకూడా? కాల్‌చెయ్యడం బదులుగా పిలవడం అనురా!" రంగారావు ధుమధుమ. "నన్ను నాన్నా అని పిలువు. డాడీ అంటే పాడెకట్టెరా బాబూ!"

"మ్మ...మ్మరీ...గుమ్మినేమనాలి?"

"గుమ్మి కాదురా, అమ్మ, అ...మ్మ... అమ్మ అనాలి నాన్నా!" తల్లి కొడుకును దగ్గరకు తీసుకుంది.

"ఇదే నాకు నచ్చదు" రంగారావు నిరసన. "పైలా పచ్చీస్ దాటి, పాతికేళ్లు మించిన కొడుకును అట్లా గారాబం చేస్తే వాడు మొద్దావతారం కాక ఇంకేమవుతాడటా!"

"యమర్జెంటుగా వానికో ఉద్యోగమిప్పించాలి. ఉద్యోగం పురుష లక్షణమన్నారు గదా!"

"అన్నారన్నారు. నీ లాంటివారు విన్నారు. ఉద్యోగాలేమన్నా ఆరబోసుక్కూచున్నారా ఎవరన్నా?"

"ఆరబోయడం, తూర్పారబట్టడం కాదు మహాశయా! అక్కడక్కడ తిరిగి పట్టుకోవాలి. ఎంచక్కా ఎం.కాం. చదివిన కొడుక్కు ఏదన్నా ఉద్యోగం వెతికి పెట్టడం తండ్రి బాధ్యత. అటు ఉద్యోగం దొరక్క ఇటు పెళ్లి కాక నా కొడుకు ఎన్నిపాట్లు పడ్తున్నాడో!" వీరమణి గుండె గూటిలో కరుణా దీపం వెలిగింది.

"మాతృభాషకు మట్టికొట్టిన మన వంశోద్ధారకుడికి పాట్లు తప్ప పనులు దొరుకుతాయా?"

"రియల్లీ నై...నైనా...కాదు...నాన్నా! నాకు జాబ్ దొరికితే వైఫ్ దొరుకుతుంది. అదే నాకు లైఫ్".

"నువ్వట్లానే అనుకుంటే వైఫ్ నైఫ్‌గా మారి చిత్రహింసలు పెడ్తుందేమోరా! పదో తరగతి దాకా చదివిన తెలుగు భాష ఏమైందిరా" ఉబికొస్తున్న బాధను మింగలేక, కక్కలేక తండ్రి ఆవేదన.

"ఆ ప్రశ్నా జవాబు లిప్పుడెందుగ్గానీ! ముందు వానికుద్యోగం...అది దొరక్కపోతే ఏదన్నా వ్యాపారం పెట్టించాలి తండ్రిగారూ!"

రంగారావుకు అరికాలు మంట అమాంతం నెత్తికెక్కింది. "వ్యాపారానికి పెట్టుబడి కావాలి. జమా ఖర్చుల పద్దులు తెలుగులో రాయగలగాలి. నీ సుపుత్రుడికా రెండూ లేవు గదా!, నిగ్రహించుకున్నాడు.

"అదా...మరేమంటారు?" కొంగు నడుముకు బిగించుకుంది.

"వెరీగుడ్...గుగు...గుమ్మీ...క్కా...కాదు మమ్మీ...ఆహా! అది కాదు అమ్మా!" వేణుగోపాల్ విశ్వ ప్రయత్నం "వీడు తెలుగు భాషకు తెగులు పట్టిస్తున్నాడు". రంగారావు బుర్రలో ఆలోచనల ప్రవాహవేగం పుంజుకుంది. శూన్యంలోకి చూస్తూ "సరే...నాకు తెలిసినవాళ్ల కిరాణా దుకాణములోనో, మిల్లులోనో ప్రయత్నిద్దాం". వినూత్న సంభాషణకు విరామ చిహ్నం పెట్టేశాడు.

.....

ఆధునికతకద్దం పడుతున్న రైసు మిల్లు ఓనరు కోటయ్య సొంతమిల్లులో అటూ, ఇటూ తిరుగుతూ పనులు పర్యవేక్షిస్తున్నాడు.

"మిత్రమా, కోటయ్యా" చల్లని పిలుపు మెల్లగా వినబడింది.

చటుక్కున వెనక్కు తిరిగాడు. లటుక్కున బాల్య స్నేహితుడు రంగారావు, అతని వెంట ఓ యువకుడు కన్పించారు.

"ఏరా రంగా ! బాగున్నావా? చాలా రోజుల తర్వాత కనబడ్డావురా! చిన్నప్పుడు క్లాసులో నువు చేసిన అల్లరి గుర్తిందిరా!" కార్యాలయంలోకి తీసుకెళ్లాడు. అంతా కుర్చీల్లో కూచున్నారు. గరం చాయిలొచ్చినై. రంగారావు నోరు తెరవక తప్పలేదు.

"కోటా! నాకు నీ సాయం అవసరమైందిరా?"

"ముందు చాయ కానివ్వరా. అన్నట్టూ ఆ పిల్లగాడూ...?!"

"వాడు నా కొడుకురా".

అంతా చాయ చప్పరిస్తున్నారు. గరం చాయ నరాలను శృతి చేస్తోంది.

"అట్లనా? నీ పేరేమిటి బాబూ?"

"మై నేమ్ ఈజ్ వేగోల్".

కోటయ్య నోరు కోటద్వారములా తెరుచుకుంది. "వేగోల్...ఇదేం గోల?"

"అదేరా! వాని చదువు ఇంగ్లీషు మీడియంల సాగింది".

రంగయ్య సముదాయింపుకు దిగాడు "హైస్కూలు, కాలేజి రోజులు హాస్టల్లకే అంకితమైనయి...వానిపేరు వేణుగోపాల్‌రా... యం.కాం. చదివిండు. టీచర్ ట్రయినింగ్ చేయిద్దామంటే ఎంట్రెన్స్ టెస్టు పేపరు ఎవడు దిద్దాడోగాని పాసుమార్కులివ్వలేదు. వేరే ప్రభుత్వోద్యోగాలేవీ దొరకడం లేదుగదా! ఒరేయ్ కోటా! నా అంత కొడుకు ఉద్యోగం, పెళ్ళి లేకుండా ఇంట్లో ఉంటే నిప్పులతో తల స్నానం చేస్తున్నట్టుందిరా!" ఎదలోని అలజడి గొంతులోకొచ్చింది.

"నిజమేరా రంగా! ఈ రోజుల్లో ఆడ పిల్లలు గూడా బాగా చదువుకుంటున్నరు.

అన్ని రకాలుగా తనకు నచ్చిన అబ్బాయినే పెళ్ళి చేసుకుంటున్నరు".

"ఆ మాట అక్షరాలా నిజమురా!"

"అంతెందుకూ, మా అమ్మాయి డిగ్రీ పాసై పెళ్లీడుకొచ్చింది. పెళ్ళి చూపుల పర్వం ప్రారంభమైందిగాని మా అమ్మాయికే అబ్బాయ్ నచ్చడం లేదు" తనగోడు వెళ్ళ బోసుకున్నాడు" అన్నట్టు నా సాయం కావాల న్నావు గదా! ఏం సహాయంరా?"

"సాయమంటే..." ఆత్మాభిమానం అడ్డొచ్చింది రంగారావుకు. దాన్ని నిర్దాక్షిణ్యంగా అణచక తప్పలేదు. అయినా చల్ల కొచ్చి ముంత దాచడమెందుకూ?" మా వేణుగోపాల్‌కు మీ మిల్లులో గుమస్తా ఉద్యోగ మిప్పించురా!"

రంగయ్య మస్తిష్కంలో కాస్సేపు తర్జన బర్జన. మిల్లు పద్దులు, లెఖ్ఖలు రాసేందుకు ఒకే గుమస్తా వున్నడు. అతనికి కంప్యూటర్ రాదు. దానికో గుమాస్తా కావాలి.

"బాబూ! నీకు కంప్యూటర్ మీద పంజెయ్యడమొచ్చా?" వేణుగోపాల్ నడిగాడు.

"ఓ యస్. మా బాగా వచ్చు అంకుల్. డాటా ఎంట్రీ వగైరాలు నేర్చుకున్నాగాని సర్టిఫికెట్ లేదు".

"లేకున్నా ఫరవాలేదుగాని పద్దులు, ఉత్తరాలు, లెక్కలు తెలుగులో రాయడం వచ్చా?"

"వాని కసలు తెలుగే సరిగా రాదు, పద్దులెట్లా రాస్తాడురా?" రంగయ్య నెత్తికొట్టుకున్నాడు.

"అయితే గుమాస్తా ఉద్యోగానికి పనికి రాడన్నమాట". నిర్మొహమాటంగా చెప్పేశాడు.

"మరెట్లారా?"

"ఒరేయ్ రంగా! ప్రతి మనిషి పుట్టినప్పటి నుండే మాతృభాష నేర్చుకుంటడు. అది తల్లిభాష కదరా! మాతృభాషలో చదవడం, రాయడం రాదంటే నేల విడిచి సాము చేసినట్టే".

"వాడు పదో తరగతి దాకా తెలుగు నేర్చుకున్నడురా. ఇంటర్, డిగ్రీలో రెండో భాషగా సంస్కృతం చదివిండు. తెలుగు మరిచిపోయిండు".

"నేను మరిచిపోయిన తెలుగును మళ్లీ పూర్తిగా నేర్చుకున్నాను". వేణుగోపాల్ ఉల్లాసం. "నేను ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు మాకు తెలుగు బోధించిన ఉపాధ్యాయుడినాశ్రయించాను. మరిచి పోయిన తెలుగునంతా గురువుగారు నెమరు వేయించారు. పద్యాలు గూడా వల్లె వేయించారు అంకుల్".

కోటయ్యకదేమీ నచ్చలేదు... "అందుకే కాళోజీ నారాయణరావు అనే కవి 'అన్య భాషలు నేర్చి, ఆంధ్రంబు రాదంచు / సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా!' అన్నాడురా. తెలుగు రాదన్న తెలుగువాడు నేతి బీరకాయలో నెయ్యిలాంటి వాడేరా". కొద్దిపాటి ఆవేశం ముద్దముద్దగా బయటపడింది.

"నిజమే రంగారావుగారూ!" అంతకు ముందే అక్కడ కూచున్న కోటయ్య స్నేహితుడు నాగరాజు అందుకున్నాడు. "మనకు ఏ భాష మీద గూడా ద్వేషం లేదుగానీ ఎవరి మాతృభాష వారికి తల్లిభాష. ఎవరన్నా తల్లిని మరిచి పోతారా? మిల్లులోగానీ, దుకాణాల్లో గాని పద్దులు తెలుగులోనే రాస్తారు. ఇంగ్లీషు మీడియంలోగాని, మీరే మీడియంలోగాని చదివిన మెరుగైన వారు ప్రథమశ్రేణికొచ్చి పెద్ద ఉద్యోగాలు సంపాదిస్తారు. తెలుగు వచ్చిన మామూలు వారైతే ఇలా గుమాస్తాగానో, చిరు వ్యాపారిగానో పంజేస్తారు. నూటికి డెబ్బై మంది మామూలు వాళ్ళే ఉంటారు. వాళ్ళకు తెలుగు వచ్చి తీరాలి. లేకపోతే రెంటికి చెడిన రేవడైపోతారు".

"అయితే...ఇప్పుడు వాట్ టు డూ అంకుల్?" వేణుగోపాల్ ఆందోళన. తన పరిస్థితి ఇంతవరకొస్తుందని ఊహించలేదు.

మిల్లు యంత్రాల ధ్వని సన్నగా వినబడుతోంది.

...

నాలుగు నెలలు గడిచి పోయినై.

ఆ రోజు ఆదివారం. ఆనందాన్ని పంచుకొమ్మనే పసందైన రోజు. వారమంతా పనులతో విసిగి వేసారిన వేతన జీవులకు ప్రాణవాయువందించే వారాంతము రోజు.

కోటయ్య చేతుల్లో రెక్కలు విప్పిన దినపత్రిక వుంది. అతని చూపులు అక్షరాల వెంట పరుగెదుతున్నై. ఆయన ముందు ఓ నవజవ్వని ఏదో వార పత్రిక తిరగేస్తోంది.

"ఏమయ్యా! తండ్రి, కూతుళ్ళు తీరిగ్గా పత్రికల్లో తల దూర్చడమేనా? మరే పనులూ లేవా?" విశాలాక్షి వచ్చి కూతురు పక్కన కూచుంది.

"ఇవ్వాళ్ల మిల్లు బంద్ గదా! నాన్న నేం జెయ్యమంటావమ్మా?" నవ జవ్వని దేవయాని జడను గుండెలమీదికి లాక్కుంది. ఒంటిరాయి ముక్కు పుడక సూర్యకిరణంలా మెరిసింది.

"ఏం చెయ్యమంటావేందే! పెళ్లీడు కొచ్చిన కూతురు ఇంట్లో వుంటే తల్లిదండ్రుల గుండెల్లో గ్యాసుపొయ్యి మంటలుంటై... తెల్సా?"

"నా పెళ్ళికేం తొందరలేమ్మా?"నాకు నచ్చిన మొనగాడు దొరికేదాకా స్వేచ్ఛా విహంగము లాగుంటాను".

"ఉంటావు. నీకట్లానే అనిపిస్తుంది. డిగ్రీ చదివి దర్జాగా ఇంట్లో కూచున్నావు. పెళ్ళి చేసుకుని హాయిగా సంసారంలో స్థిర పడాలన్న ధ్యాసనే లేదాయె. మీ నాన్నకేమో మీన మేషాలు లెక్కబెట్టడంతోనే సరిపోయె".

పేపర్ పక్కన పడేశాడు కోటయ్య "నీ ఆవేదన నా కర్థమైంది విశాలా! పది దాకా పెళ్ళి చూపులైనా నా బంగారు తల్లికి నచ్చిన వాడు దొరక్క పాయె".

"నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అంటే అట్లానే ఉంటుంది. మన కొడుకేమో విదేశాల్లో స్థిరపడి పాయె. అక్కడమ్మాయినే ప్రేమించి పెళ్లి చేసుకునె. వాడొచ్చి చెల్లికి పెళ్ళి సంబంధాలు చూస్తాడనుకున్నారా?" ఇద్దర్నీ కొరకొర చూసింది. "ఇదో! ఇప్పుడే చెబుతున్నా! ఈసారి పెళ్లి చూపులకు ఏ అబ్బాయి వచ్చినా అతన్ని చేసుకోవాల్సిందే!" రుసరుసలాడుతూ లేచి వంటింట్లోకెళ్ళింది విశాలాక్షి.

కోటయ్య బుర్రలో ఆలోచనల బొంగరాలు తిరుగుతున్నై.

"కోటయ్యా...! ఉన్నాడా?" గుమ్మం వద్ద ఎవరో నిల్చున్నారు.

"ఆ...ఉన్నాను రండి" కోటయ్య తేరుకుని వెళ్లి కూతురు పక్కన కూచున్నాడు.

"నమస్కారమండీ!" వేణుగోపాల్ చేతులు జోడించాడు.

"నేనేరా కోటా. మా దాడినిప్పుడు చూడు. ఇప్పుడన్నావాడు గుమాస్తా ఉద్యోగానికి పనికొస్తాడో, లేదో చూడు" రంగయ్య హుషా రుగా ముందుకొచ్చాడు.

"ఓహో! నువ్వారా రంగా" కోటయ్య ఆహ్వానించి సోఫా చూపిం చాడు. కూతురుతో "అమ్మా! ఈయన రంగయ్య, నా బాల్య స్నేహితుడు. ఆ యువకుడు అతని కొడుకు వేణుగోపాల్" అంటూ పరిచయం చేశాడు.

"నమస్కారం. నా పేరు దేవయాని" తియ్యని గొంతు.

వేణు గోపాల్ గురించి దేవయానికంతా చెప్పాడు తండ్రి. ఆ తర్వాత "ఏమయ్యా వేగోల్!" ఇంకేదో అనబోయాడు.

"క్షమించాలి. నా పేరు వేణుగోపాల్" అంటూ దేవయానిపై ఓరకంట చూపులు విసిరాడు. దేవకన్యలా కనబడింది.

"అయితే భాషా సమస్య..."

"తీరిపోయింది అంకుల్"

"ఎట్లా తీరిపోయింది?"

దేవయాని చూపులు వేణుగోపాల్‌ను ఆపాదమస్తకం తడుము తున్నై. అబ్బో...అందగాడే." ఎం.కాం. చదివినా ఏ పనీ దొరకలేదన్న మాట". గలగలా నవ్వింది. ఆ నవ్వులో గోదావరి ప్రవాహ సవ్వడి వుంది.

"భాషా సమస్యేనా? నేనేదో సమస్య అనుకున్నా!" కళ్లల్లో కొత్త వెలుగులు.

"నేను మరిచిపోయిన తెలుగును మళ్లీ పూర్తిగా నేర్చుకున్నాను". వేణుగోపాల్ ఉల్లాసం. "నేను ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు మాకు తెలుగు బోధించిన ఉపాధ్యాయుడినాశ్రయించాను. మరిచి పోయిన తెలుగునంతా గురువుగారు నెమరు వేయించారు. పద్యాలు గూడా వల్లె వేయించారు అంకుల్".

"అయితే సమస్య తీరిపోయిందన్న మాట". కోటయ్య కూతురు వాలకాన్ని పరీక్షగా గమనిస్తున్నాడు.

విశాలాక్షి అందరికీ గరం చాయ లందించి కూతురు కటు పక్కన కూచుంది. కోటయ్య అందరికీ పరిచయం చేశాడు.

"అయితే మా వాడికి మీ మిల్లుల గుమస్తా ఉద్యోగం ఇస్తున్న ట్టేనా?" రంగారావు మెదడు పొరల్లో అనుమానం పురుగు.

"నాన్నా! అమ్మా! మీరో నిమిషం ఇటురండి" దేవయాని గది లోకెళ్ళింది. తల్లిదండ్రులు అనుసరించారు.

తండ్రి, కొడుకులు మొహాలు చూసుకున్నారు. ఐదు నిమిషాల తర్వాత ముగ్గురూ గదిలోంచి వచ్చి కూచున్నారు.

"ఏమైంది? నా కొడుక్కు ఉద్యోగం..." రంగయ్య ఆత్రం.

"లేదురా రంగా. వేణుగోపాల్‌కు గుమాస్తా ఉద్యోగమివ్వడం కుదరదురా".

వచ్చేసంచిక నుండి మొదలు...

'మహనీయుల మరణ వాగ్మూలం'

ఈ పదాన్ని సాధారణంగా వ్యతిరేకార్థంలో వాడుతుంటాం. అంటే, ఓ వ్యక్తి మరణానికి కారణం తెలుసుకోవాలనుకుంటున్న ప్పుడు అతడు చనిపోతూ చెప్పిన మాటలకు ప్రాధాన్యముంటుంది. అదే మరణవాగ్మూలం.

అయితే, చనిపోయే ముందు భాషా సాహితీవేత్తల వాగ్మూ లాన్ని తీసుకుంటే అది భాషా సాహిత్యాల పట్ల వారికున్న నిబద్ధతని చెబు తుంది. ఆ ఆరాటాన్ని సరిగ్గా గుర్తిస్తే మన భాషా సాహిత్యాలని కాపాడుకోవాలనే పోరాటధోరణి పెరుగుతుంది.

అందుకే కొందరు ఆధునిక భాషా సాహిత్యవేత్తలు మరణ సమయమాసన్నమైనప్పుడు కూడా దానికి వెరవక, భాషా సాహిత్యాల కోసం ఎంతగానో తపన చెందారు. అటువంటి మహనీయుల 'మరణ వాగ్మూలాల్ని' కథానికల రూపంలో మీ ముందుంచడానికి చేస్తున్న సాహసమిది. మీ అభిమానాన్ని ఈ శీర్షిక చూరగొంటుందని ఆశిస్తున్నాం. **– సంపాదకుడు**

బాల్య స్నేహితునినోట ఆ మాట వస్తుందని రంగయ్య ఊహించలేదు. ఆశ్చర్యంలో మునిగాడు. "ప్లీజ్ కోటయ్యా! వాడు ఏ ఉద్యోగం లేక కూచున్నాడు. నీ సూచన ప్రకారమే తెలుగు మళ్లీ నేర్చుకున్నాడు".

"అంతా బాగానే వుందిగాని గుమాస్తా ఉద్యోగమివ్వలేను రంగయ్యా?"

"అంటే...ఇంకెవరికన్నా ఇచ్చారా అంకుల్?"

"అవును...ఆ ఉద్యోగం ఇంకెవరికన్నా ఇవ్వాలి".

తండ్రి కొడుకులు నిరాశగా లేచి నుంచున్నారు.

"కూచోండి. తొందరెందుకూ?" విశాలాక్షి మాటల్లో ఆత్మీ యత.

అయోమయంగా కూచున్నారు. వేణుగోపాల్ దోర వయసు చూపులు దేవయాని కోర చూపుల్ని ఢీ కొడుతున్నాయి. అనువుగాని చోట అధికులమనరాదు...పద్యం గుర్తుకొచ్చి చేతులు కట్టుక్కూచు న్నాడు. "ఇంకెందుకు నాన్నా ఇక్కడ కూచోవడం?" తండ్రినడిగాడు.

"కూచోవాలి బాబూ!" కోటయ్య ముసిముసిగా నవ్వాడు.

"మా అమ్మాయి దేవయాని గురించి నీ అభిప్రాయమేమిటీ?" అర్థవంతంగా అడిగాడు.

దేవయాని బుగ్గలు సిగ్గులు సింగారించుకుని ఎర్రమందారాలై నాయి. గోపాల్‌ను కొంటెగా చూసి వెళ్లి అతని పక్కన కూచుంది.

వేణుగోపాల్ ఎదలో ఆనంద తరంగాలెగసి పడుతున్నై.

రంగయ్య మొహంలో రంగులు మారాయి.

అందరి అంతరాళాల్లో మలయ మారుతం వీచింది.

రచయిత సిద్ధిపేట (తెలంగాణ) నివాసి

సామల మురళి
9486135396

తెన్నాటి తెలుగుపాటలు - 2

ఇది దూరిపాట. అంటే లాలిపాట. ఉడుమలపేట తావున తెలుగమ్మలు బిడ్డలను గుడ్డ ఊయలలో వేసి పాడుతుండే పాట ఇది. మనం పోగొట్టుకొన్న ఎన్నో తెలుగు మాటలను ఈ తావున పాటలలో ఏరుకోవచ్చు. పాటను పాడిన తల్లిపేరు మిడిగ వళ్ళియమ్మ, వయసు 55, ఊరుపేరు బేలూరు, కులం మాదిగవారు.


మిడిగ వళ్ళియమ్మ

లాలిపాట

దూరి కన్నా దూరి దూరి దూరి దూరన్న దూరి
రారి కన్నా రారి రారి రారి రారన్న రారి రారి

ఇంత పెద్ద ఊరిలోన దూరి వేయంగ తావు లేదు
అబ్బగారు కాణి బూమి తావు చూసి దూరి వేసె ॥దూరి॥

ఆవులుమేసింది అరసాని కొండ పెయ్యలుమేసింది పెరుమాళు కొండ
నీళ్లు తాగింది నిప్పులరేవు నిలిచి మేసింది బోదోని కనుమ ॥దూరి॥

కాకులాడేది కల్లిమాను గువ్వలాడేది గుబురుమాను
కూతుపొన్ను ఆడేమాను కొండమామిడి పొన్నమాను ॥దూరి॥

వేగులేచి సద్దితాగి వెండి కొడవలి చేతబట్టి
వెళ్ళండమ్మ కన్నెలాలా చెల్లాండమ్మకు మళ్ళుకోయ ॥దూరి॥

మేకపోయే పోక చూడు మేకలాండి రవళి చూడు
గజ్జెలేటి వంపులోన గడియారాలు మోగె చూడు ॥దూరి॥

ఊరు చుట్టు ఉమ్మెత్తలు బాద చుట్టు బండగలు
నీకు చుట్టు నిమ్మగలు నీరునిమ్మల తోరణాలు ॥దూరి॥

వీదిలోన విల్లమాను విదవిదము పూవులేసె
పూవులేర నేనుపోతే పుట్టమెల్ల పుల్లలిరిగె ॥దూరి॥

ముత్తెమొచ్చె ముత్తెమొచ్చె ముద్దులకు రావేపొన్ను
ముత్తెమంటి సామిపొన్ను ముందటుండి దాయాలాడు ॥దూరి॥

దువ్విదువ్వి కొప్పుముడిచె దిన్నకోర నీడచూసి
అరటితోట ఇరుములోన అమరెనేమో కొమరికొప్పు ॥దూరి॥

మట్టమట్ట మద్దేనాన మండకాలె ఎండలోన
కాళ్లు మునిగె తువ్వలోన కమిలెనేమో కొమరికొప్పు ॥దూరి॥

దారపోలము దాటదాట దవడపల్లు రాలిపోయె
ఉప్పువంక దాటదాట ఉండిన పల్లు రాలిపోయె ॥దూరి॥

చిన్నగట్టు మడుకులోన చిటికసద్దు లెక్కడివి
సిగ్గుచెడ్డ మామగారు చిటికలేసి చిడుపు గిల్లె ॥దూరి॥

గాజులు గలగల్లాడి గందంపొళ్లు చిందిపోయె
అత్తకూతుర అమ్మాడి అరుపులేకుండ ఆడొద్దు ॥దూరి॥

గాజులు గల్లాడ లేదు గందరపొళ్లు చిందలేదు
ఈరసమేల నీకిపుడు ఈరతారలొద్దు చాలు ॥దూరి॥

అత్త కూతురందము కాదు అందినమేను గందము కాదు
తలిచినదంతా తంగము కాదుతనికి పూల పూజ చేయి ॥దూరి॥

బావతోడ చేరుకొని బళ్లలడివి చూడబోతె
బావ నన్ను ఒలుసుకొనే బళ్లలడివి ఏమి చేసు ॥దూరి॥

తుమ్మమాను తుంటలాలా వేపమాను వేరులాల
ఏడిచి మొత్తిన గాడిదపిల్లకు ఇంకా చెప్పమ్మ జోడుపాట ॥దూరి॥

పల్లేరుకాయల చేనువారు పానుపుదిన్నె పన్నగారు
అప్పులడగ వచ్చినారు మన అక్కచెల్లెలనంపండ ॥దూరి॥

ఊరులోకి పోతినమ్మ ఊకుచేయ మూరుగత్తెని
దాన్ని కొద్దిగ చూస్తమన్నా దాని పంగమ నిండానమ్మ ॥దూరి॥

కానమకానమ కందరాలు కానగబర్రలు మోపుడమ్మ
బూమి నుండి లేయలేదు మొగమునుండె మీసముకు ॥దూరి॥

మనిసిలేని ఇల్లుడిది మేడలోన తిన్నుడిది
తనుకులింటి పడుచుపక్క తరకువేల సామి నువ్వు ॥దూరి॥

నువ్వునేను ఒక్కజోడి ఊరులోన ఉమ్మలమ్మ
మందలోన బావి నరికి మాడిన పోదుమిద్దురము ॥దూరి॥

ఏటిగడ్డన ఎర్రజొన్న కాలవగడ్డన కాకిజొన్న
ఏరుకాలవ దాటదాట ఎర్రబిడ్డకు కలంకాయె ॥దూరి॥

ఎర్రబిడ్డ కలంకొస్తే ఎన్నాలేమి యేచనలేమి
సాకలాండిని మార్చుండాది సన్నసన్నంగ ఆటలాడు ॥దూరి॥

గజ్జెల కడవల గంజిపోసి గట్టు చుట్టి వచ్చేబిడ్డా
ఏతుకప్పుల ఎర్రబిడ్డా ఏడకద్దమ్మ ఎద్దుమేత ॥దూరి॥

చీర కట్టితె కిందపడు చెప్పుకొంటే మొగము జోలు
ఏళ మనసు వదినె కూడ ఏమి సరసమాడితివన్నా ॥దూరి॥

సద్దిసామల కూడు వండె పుల్లనిమ్మల పులుసు కాసె
నీటుగాడె సామిపొన్ను దాటుచుక్క వాటువాలె ॥దూరి॥

మేకమేయని ఆకులేదు మేము కోయని కూరాకు లేదు
కొత్త చెరువున కోడి వెళ్లె కొంగు వేయంగ తావులేదు ॥దూరి॥

కొత్త చీర వదిలి కట్టి మల్లెలెత్తుకు ఒళ్లోపోసి
వద్దుపొన్ను బుద్ధిశాలీ మల్లగల్లము మందితోడ ॥దూరి॥

ఆవులాడంగ అల్లిన దండ మేకలన్న మెచ్చిన దండ
కుంచెలిడిచి కుట్టిన దండ కూతు చూడంగ వేళలేదు ॥దూరి॥

మాటల వివరణ

1) దూరి : ఊయల
2) కాణి : 1.3 ఎకరా
3) అరసాని : లక్ష్మి
4) పెరుమాళు : విష్ణువు

5) కళ్లి : జెముడు
6) కూతుపొన్ను : కూతురు
7) వేగు : వేకువ
8) గడియారాలు : మెడలోని గంటలు
9) బాడ : బాట
10) బండగ : చెట్టుపేరు (commiphora caudoto)
11) నిమ్మగ : చెట్టుపేరు (ceropegia bulbosa)
12) విల్లమాను : మారేడు చెట్టు
13) పుట్టము : చీర
14) ఇరుము : గుట్టయిన చోటు
15) దిన్నకోర : దిన్నకు ఓర : అరుగుపక్కన
16) మండ : తలబుర్ర
17) తువ్వ : దుమ్ము
18) దారపోలము : వల్లకాడు
19) మదుకు : మూల
20) అరువు : బుద్ధి
21) ఈరసం : అసూయ
22) తంగము : బంగారం
23) ఈరతారలు : గందరగోళం
24) తనికి : తాజా
25) ఒలుసుకొను : కలియు
26) పానుపుదిన్నె : మంచం
27) పన్నగారు : యజమాని
28) పానుపుదిన్నె పన్నగారు : మొగుడు
29) ఊకు చేయు : పటాయించు
30) మూరుగత్తె : అందగత్తె
31) పంగమ : వెల
32) కానమకానమ : బాగా కనిపించే
33) ఉడిది : ఉంది
34) తిన్నుడిది : తిన్నె ఉడిది : అరుగు వుంది
35) తనుకులిల్లు : పడక గది
36) తరకు : జరగడం
37) ఉమ్మలు : నీటి కరువు
38) మాడి : తేరు
39) కలంక : కోరిక
40) ఎన్నము :ఆలోచన
41) యేచన : యోచన
42) కద్దు : కలదు
43) జోలు : వ్రేలాడు
44) ఏళ : లేత
45) వాటువాలు : తలకిందులకు
46) దాటుచుక్క : సప్తర్షిమండలం
47) కూతు : కూతురు
48) సాకలాండిని మార్చడం : బట్టలు మార్చుకోవడం
49) ఏతుకప్పు : ఒంటినిండా కట్టిన చీరా రవిక
50) కోడి : చెరువు అలుగు
51) కోడి వెళ్లడం : అలుగు పారడం
52) వదిరి : విదిలించి
53) మల్లగల్లము : వాదులాట

అ

కవిత

అంతరంగ కాలుష్యం

యుద్ధంలో వున్నప్పుడు
ఒక్క సెకను ఆదమరచినా,
తల తెగి అవతల బడుతోంది
కొండ అంచునుంచి క్రిందకు నెట్టబడతాం
ఉదయించే సూర్యుడు ఒక సృజన శక్తి
తదేక దృష్టితో చూడగలిగినవాడే విజేత
మనోభానుడు ఎందరినో వెలిగిస్తాడు
మనస్సును ఏకాగ్రకతలో ఉంచినప్పడే
జ్ఞానం సంద్రంలా పొంగుతుంది
ఆ శిల్పానికి శిల్పి అంతరంగాన్ని కూడా పూన్చాడు
కానీ! ఆ శిల్పం బాహ్య సౌందర్యానికే
జనం మురిసి పోతున్నారు
మనుషులు నశించినా శిల్పం ఎందుకు నిలిచివుంది?
కోట్లమంది దర్శించినా!
దాని కాంతి తగ్గడం లేదు
మానవలోకం నిద్రించినా! కవి ఎందుకు మేల్కొనివున్నాడు?
కవికి రాత్రి కూడా పూలు వికసిస్తాయని తెలుసు
కవి ఎప్పుడూ పూలను వికసించమని ఆదేశించడు
కవి కావ్యంలో వున్న రూపాలు సజీవమైనవి
సమున్నతమైనవి కూడా!
చలిలో వణుకుతున్న ముదుసలికి దుప్పటిచ్చేవాడులేడు
ప్రభుత్వం ఉత్సవాలతో కళ్ళుగప్పాలని చూస్తోంది
నోరున్నోళ్ళందరిని నాలుగు రాళ్ళిచ్చికొన్నారు
అందరూ రాజభోగాల గురించే మాట్లాడుతున్నారు
పేదవాడి గోడు అక్షరంగా మారడం లేదు
హృదయ వేదనలకు భూమి కంపిస్తుంది
కాలిన శరీరంలా నేలపై బొబ్బలు వస్తున్నాయి
గుడిసెల్లో వణుకుతున్న
ఆ పసికందు నాలుక పిడసగట్టుకుపోతుంది
పుట్టే శిశువుకు ఊపిరి ఇవ్వలేక పోతున్నారు
విదేశీ అతిధులకు పంచభక్ష్య
పరమాన్నాలు వడ్డిస్తున్నారు
నగరాలు మురికి కూపాలయ్యాయి
తెల్లని మబ్బులు ఎప్పుడూ వర్షించలేదు
హృదయం లేని మనుష్యులకు కన్నీళ్ళు రావు
అయినా, మానవ పరిణామం ఆగలేదు
మనిషి పునరుత్తేజం పొందాలంటే
ప్రకృతి పరిమళించాలి మనస్సులు వికసించాలి
మనిషికి ప్రకృతికి వున్న అంతస్సంబంధం తెలియాలి
మనిషి జ్ఞానవంతుడు అయితేనే తనను తాను రక్షించుకోగలడు.

– డాక్టర్ కత్తి పద్మారావు,
9849741695

తెలుగు భాషా సాహిత్యాలకు 'ప్రబుద్ధాంధ్ర' మద్దతు



శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి తండ్రి, అన్నలు పూర్తిగా ప్రాచీన ధోరణిని అనుసరించేవారు. వైదిక కులవృత్తుల నభ్యసించమంటే శ్రీపాద ఒప్పుకోరు. సంస్కృత కావ్యాల్ని అభ్యసించకున్నా తెలుగు కావ్యాలనే చదువుతానని పట్టుపట్టారు చిన్నప్పుడు. పెద్దయిన తర్వాత చక్కటి, చిక్కటి తెలుగు సాహిత్యాన్నందించడమే కాకుండా మరెందరో సాహితీవేత్తలని ప్రోత్సహించడానికీ, తెలుగుభాషకి అండగా నిలవడానికీ 'ప్రబుద్ధాంధ్ర' పత్రికను నడిపారు. ఆ పత్రికలో భాషా సంబంధమైన వ్యాసాలెన్నో రాశారు. ఆధునిక తెలుగు భాషాశాస్త్రవేత్త గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారికి రాజమండ్రిలో భాషాభిమానులు జరిపిన 'సప్తతి' విశేషాల్ని 'ప్రబుద్ధాంధ్ర'లో ప్రచురించారు. ఆయన ఆ విశేషాల్ని ఎలా వివరించారో చదవండి – సంపాదకుడు

గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారికి విజయపట్ట ప్రదానం

1933డో సంవత్సరం డిసెంబరు 27డో తేదీ రాజమహేంద్రవరం నగరచరిత్రలోనూ, ఆంధ్రభాషా చరిత్రలోనూ, ఆంధ్రవాఙ్మయ చరిత్రలోనూ, ఆంధ్రదేశ చరిత్రలోనూ, ఆంధ్రజాతి చరిత్రలోనూ ధ్రువ తారలాగ మిలమిల మెరుస్తూ వుంటుంది. ఆ వేళ నవయుగ పురుషులైన శ్రీరామమూర్తి పంతులుగారికి ఆంధ్రదేశీయులు విజయపట్టం కట్టారు.

చిత్రాంగిమేడ ఆవరణ అంతా సభ్యులతో కిటకిటలాడి పోయింది. నవీన వాఙ్మయ నిర్మాతలైన కవి కుమారులంతా సింగపు కొదమల్లాగ బారులు తీరి కూర్చున్నారు. చిలుకూరి వీరభద్రరావు గారు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు, పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, నిడమర్తి దుర్గయ్యగారు మొదలైన వృద్ధులు కూడా చాలా మంది దయచేశారు. తమ పూర్వపు చమత్కారాన్ని దిద్దుకోడానికా అన్నట్టు వడ్డాది సుబ్బారాయుడుగారు కూడా విజయం చేశారు. యువకులై వుండీన్నీ యింకా పూర్వాంధ్రాన్ని పట్టుకునే పాకులాడుతూ వున్న కవిరాజు వత్సవాయి నీలాద్రిరాజు గారున్నూ దయచేశారు. కొంతసేపటికి సర్. వేంకటరత్నం నాయుడుగారు వచ్చారు.

జయంతి గంగన్నగారు సభకి ఆధిపత్యం వహించి కార్యక్రమం నడిపారు. కుమారులూ, మనమలూ పరివేష్టించి యుండగా రావు సాహేబు, మహోపాధ్యాయ గిడుగు వేంకటరామమూర్తి పంతులు గారు ధర్మపత్నితో నిండు కొలువు తీర్చారు.

కళ్లున్నవారు ఆ సౌభాగ్యం, ఆ వైభవం, తేజస్వంతమైన ఆ సన్నివేశం చూసి సంతోషించారు. హృదయం వున్నవారు ఆ అపర వాగనుశాసనుని మహత్వం బోధపరుచుకొని పరవశులైనారు.

అధ్యక్షులు రామమూర్తి పంతులుగారిని గురించి చాలా సంగతులు చెప్పి "వ్యావహారిక భాషకు ప్రాముఖ్యం యివ్వాలని పంతులు గారు 1907డో సంవత్సరం నుంచీ కృషి చేస్తున్నారు. వీరి కృషివల్లా, పట్టుదలవల్లా వ్యావహారిక భాషలోనే నేడు అనేక కవులు గ్రంథరచన చేస్తున్నారు. వీరికి కన్నడమూ, ఫ్రెంచీ,ఇంగ్లీషూ, అరవమూ, తెనుగూ, సంస్కృతమూ, లాటినూ – ఈ భాషల్లో అపారమైన పాండిత్యమున్నది. వీరు మాట్లాడుతూ వుంటే వొక్క పొల్లుమాట అయినా రాదు. వీరితో మాట్లాడడం విద్యాభ్యాసం చెయ్యడమే. వీరిని నడుస్తూ వున్న – మాట్లాడుతూ వున్న విశ్వవిద్యాలయం అంటే అతిశయోక్తి యేమీ వుండదు. గంజాం జిల్లా వాసులైన పంతులుగారికి ఆంధ్రవాఙ్మయానికి మూల పీఠమైన రాజమహేంద్రవరంలో యిలాంటి సన్మానం చెయ్యడం చాలా గొప్ప విషయం. పంతులుగారిని తెనుగులో ఫయిలాలాజికల్ గ్రామరు (PHILOLOGICAL GRAMMAR) రాయవలసిందని మనం కోరవలసి వుంది" అంటూ సభా ప్రారంభం చేశారు. తరవాత ఆంధ్రదేశేతిహాస పరిశోధక మండలివారూ, కల్చర్డు వుమెన్సు సొసైటీవారూ, కళా సమితివారూ, సాహితీ సమితివారూ, సాహిత్య మండలివారూ, రామారాయ చిత్రకళా సంఘం వారూ పంతులు గారికి సన్మాన పత్రాలూ పూల దండలూ సమర్పించారు.

తరవాత కావ్య వ్యాకరణ తీర్థులు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రులుగారు యిలా సెలవిస్తూ శ్రీపంతులుగారికి వెండిపెట్టెలో వుంచి కమెమొరేషన్ వాల్యుములు సమర్పించి, దుశ్శాలువులు కప్పినారు. కరతాళ ధ్వనులతో దిక్కులు పిక్కటిల్లినవి.

"ముక్కోటి ఏకాదశి మహాపుణ్యదినం. పవిత్రమైన వృద్ధ జాహ్నవీ తీరం. పండితులుగా, కవులుగా చిత్రకారులుగా, భాషాసేవకులుగా, సంఘసేవకులుగా ఎన్నో తరాల నుండీ నేటి దాకా ఎన్నెన్ని మార్లో ఆ విశ్వమూర్తి అవతరించిన స్థలం. వెనకటి జన్మల్లో చేసిన పుణ్యం కొద్దీ ఈ జన్మలో ఇన్నినాళ్లకు ఆంధ్రపండితుణ్ణి అనేపేరు పెట్టుకొన్నందుకు కలలోగూడా ఇట్టి భాగ్యం లభిస్తుందని అనుకోని నాకు శ్రీ రామమూర్తి పంతులుగారికి కమెమొరేషన్ వాల్యుం సమర్పించే మహా భాగ్యం కల్గింది".

"రాజకులైక భూషణుడు రాజనరేంద్రుడి కాలంలో గాని, తెలుగు వల్లభుండ, తెలుగొకండ అని చెప్పుకోగల్గిన రాయల కాలంలో గానీ ప్రభుపీఠాలు, పండిత పూజలు మహావైభవంతో జరిపివున్నాయనుకొన్నా జన సామాన్యానికి అందుబాటులో వుండేటట్టు విజ్ఞానాన్ని వ్యాపింపజేస్తానని కంకణం కట్టుకొని దాన్ని సార్థకం చెయ్యగలిగిన మహాసత్తునీ ప్రజ్ఞానిధినీ పండితునీ కృతజ్ఞత్తో సత్కరించేందుకై ముక్కోటి మతభేదాలు గల మన ముక్కోటి ఆంధ్రులూ ఏకగ్రీవంగా

సిద్ధపడడమనేది నాడు వుందా అని ఆశంకిస్తున్నాను".

"ఆంధ్రదేశంలో ప్రజ్ఞాప్రభావనిధులగు పండితులకుగాని, ప్రభువులకుగానీ నేటికీ కొరతలేదు; అనంత సత్వ సంపన్నులయిన అన్నలూ, తమ్ములూ అనేకులున్నారు. వారు పూనుకొంటే ఇట్టి మహోత్సవాలు అనేకం నిర్వహిస్తారు నిస్సందేహంగా. అయినాఅవి వారి ప్రజ్ఞా విభవాలను వెల్లడిస్తాయే కాని ఆంధ్రజన సామాన్యపు హృదయానందాన్నీ, కృతజ్ఞతా పారమ్యాన్నీ వెల్లడింపలేవేమో అని నా ఊహ".

"రామమూర్తి పంతులుగారి అమూల్యమైన జీవితకాలంలో ఇది డెబ్బయివకటో యేడు. అయినా సింహగర్జనంతో సారస్వత క్షేత్రానికి వురికే వారి మూర్తిని చూస్తే "వృద్ధా శ్శిష్యా గురుర్యువా" అనిపిస్తుంది. పంతులుగారు వ్యవహారికాంధ్రానికి యుగపురుషులు. అంటే వారి సృష్టి అనుకోరాదు. ఇది తెనుగుతల్లి అనాదైన లీలా విభవం. పంతులుగారున్నూ ఆ తల్లియొక్క రూపాల్లో చేరినవారే, అయినా ఆయన ఆ తల్లికి వక అర్చావిభవం కల్గింప కలిగినారు. కాబట్టే ఆయన్ను యుగపురుషుడన్నాను".

"వ్యావహారికాంధ్రం ఆయన చేతుల్లో వప్పగింపబడింది మొదలుకొని నేటిదాకా ఈ రెండు పుష్కరాల్లోనూ దాన్ని రూపు మాపుటకై మనలో కొందరు చూపిన ప్రతీపభక్తికి ఏమీ లోపం లేదు. కావలసినంత, ప్రతికూల్య ప్రవాహం ఉరవడించే కొద్దీ అతి జాగ్రత్తతో నావ నడిపి ఒడ్డుకు చేర్చిన కర్ణధారుడు రామమూర్తి పంతులు కాబట్టే జన సామాన్య కోటిలోని మనం అందరం ఆయనకు కృతజ్ఞత వెల్లడించుకొనేందుకు ఈ ఉత్సవం ఏర్పాటు చేశారు. ఉద్యాన ప్రతిష్ఠ సప్త సంతానాల్లో వకటి. పంతులుగారికి నిరంతర కృషివల్ల ఏర్పడ్డ వ్యావహారికాంధ్రోద్యానం శాశ్వతమైంది. కాపు పట్టింది. బీదా సాదా భేదం లేకుండా పండితుల దగ్గర్నుంచి పామరుల వరకూ ఆకర్షించి హాయినీ, స్థాయినీ, ఆనందాన్నీ యిస్తున్నది. అజరామరం అయింది కాబట్టే వారి యీ డెబ్బయ్యో జన్మదినోత్సవంలో వారితోటలో పూచినట్టీ పండినట్టీ పుష్పాలనూ, ఫలాలనూ వారికే యీ కమెమొరేషన్ వాల్యూములు రూపంగా కృతజ్ఞతతో సమర్పిస్తున్నాము. ఈ కాన్కలో పండితులుగారి భాషా వ్యవసాయాన్నీ పాండిత్య ప్రకర్షనూ మెచ్చుకుంటూ స్వదేశస్థులూ విదేశస్థులూ అయిన విబుధులు వ్రాసిన ఆంగ్లాంధ్ర వ్యాసావళి వకటి, రెండోది భాషాతత్వ ప్రదర్శన పూర్వకంగా ఆంధ్ర భాషా పరిణామాన్ని నిరూపించే స్వకీయ వ్యాసావళి. మూడోది వారి వాదాన్ని నిరూపించే శబ్దాలను నిర్దుష్టములని ఋజువుపరిచే లక్షణ గ్రంథం. పేరు బాలకవి శరణ్యం. నాలుగోది ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజం. అయిదోది ప్రాచీన కాలపు వచన రచన తెలిపే గద్య చింతామణి అనేది.

"ఆంధ్రాంగ్ల వ్యాసావళిలో ముఖ్యాలు - స్టెన్‌కోనోగారు వ్రాసిన ముండా భాషలు అనే వ్యాసం, సీతాపతి పంతుల పరేన్‌భాషకు గురించిన వ్యాసం. ఎల్.వి.రామస్వామి అయ్యంగారి ద్రావిడిక్ గైడ్సు మున్న గునవి. ఇవి అచ్చం ఆంధ్ర పండితులుగా వున్నవారికి ఎంతో విజ్ఞా నాన్ని కలిగిస్తవి. డాక్టరు నేలటూరి వేంకటరమణయ్య గారి చారిత్రక వ్యాసం అమోఘ పరిశోధన వెల్లడిస్తున్నది. పాశ్చాత్య పండితులు నేటి అభినవాంధ్రపండితుల పరిశ్రమనూ, ఉత్సాహమునూ ప్రశంసిం చిన వ్యాసాలున్నవి. ఆంధ్రవ్యాసాలలో పండితులూ పామరులూ కూడా గమనింపదగ్గవి అనేకం వున్నవి. అందులో శ్రీ కోరాడ రామకష్ణయ్య గారి "ఆంధ్రభాషా పదములు - వాటి నిష్పత్తి క్రమము" అనే వ్యాస మూ, డాక్టరు చిలుకూరి నారాయణరావు పంతులుగారి "మాత్రా ఛందస్సులు" అనే అమోఘమైన వ్యాసమూ, శ్రీ శివశంకర శాస్త్రిగారి 'పదకర్తలు' అనే వ్యాసమూ, దేతు సత్యనారాయణశాస్త్రులు గారి హాస్యం వ్యాసమూ, 'మాతృభాష-పరభాష' అనే వెంకటరత్నం గారి వ్యాసమూ వివిధ విషయ పరిశోధనలను వెల్లడిస్తూన్నవి. చింతా దీక్షితులుగారి 'లీలాసుందరి' అనే బాలానందం నిజంగా బాలానందమే. భమిడిపాటివారి 'అన్నీ తగాదాలే' అనే వ్యాసం, తెలికిచర్ల కృష్ణమూర్తిగారి 'అణువులు - వాటి పరిమాణము' అనే వ్యాసం, విస్సా అప్పారావు పంతులుగారి 'చెవి చేయు పని' అనేవీ చాలా ఉత్తమ వ్యాసాలు. రాళ్లభండి వారూ, చిలుకూరి వారూ జాయింటుగా వ్రాసిన 'తూర్పుగంగరాజు లను గురించిన ఆరు క్రొత్త శాసనములు" అనేదీ, సోమశేఖర శర్మగారు వ్రాసిన "పొట్లదుర్తి మాలెపాడు శాసనవ్యాసం' అనేది అమృతములగు అనేక చారిత్రకాంశములనూ, ఉత్కర్షల విజ్ఞానమునూ చాటుతున్నవి. రెండోదీ, మూడోదీ, నాల్గోదీ శ్రీరామమూర్తి పంతులుగారి గ్రంథాలే".

"మొత్తం యీ అయిదు గ్రంథాలనూ ఆంధ్రదేశీయులందరూ కలిసి అచ్చువేయించినారు. వాటిని ఈ సభలో శ్రీరామమూర్తి పంతులుగారికి అర్పించే పనిని సభవారు నాకు ఏర్పరచినందున విశ్వేశ్వరునికి విశ్వగతమైన వస్తువులనే అర్పించిన రీతిగా సభవారి అనుమతితో వారు ప్రోది చేసిన వ్యావహారికాంధ్రం అనే ఉద్యానంలోని ఈ దివ్యములయిన గ్రంథరూపమైన పుష్పాలనూ, పండ్లనూ వారికే సమర్పిస్తున్నాను. శ్రీరామమూర్తి పంతులుగారు వీనిని స్వీకరించి ఆశీర్వదింతురుగాక".

తరవాత డాక్టరు చిలుకూరి నారాయణరావు పంతులుగారు తాము క్రొత్తగా రచియించి ఈ సందర్భంలో ప్రకటించడానికే అచ్చువేయించిన అంబ - లేక - మొండి శిఖండి అను నాటకాన్ని వొక రంగం చదివి సభ్యులకు వినిపించి శ్రీరామమూర్తి పంతులుగారికి అంకితం చేశారు.

పిమ్మట రామమూర్తి పంతులుగారు వయస్సునుబట్టి వృద్ధులయినా సింగపుకొదమలాగ లేచి మేఘ గంభీర గర్జనలతో యిలా సెలవిచ్చారు.

"ఏ విషయమైనా మంచిదో చెడ్డదో నిర్ణయించుకొనే భారము మనిషి మీద ఉంటుంది. ఒకరికి మంచిదని తోచింది వేరొకరికి మంచిది కాకపోవచ్చు. కాని మనస్సాక్షిగా తనకు మంచిదని తోచింది తానాచరించడము తన విధి. నేను నాకు మంచిదని తోచిన విషయమును గురించి పరిశ్రమ చేసి అందలి సత్యము గ్రహించి వెల్లడిస్తాను. బాల్యము నుంచీ ఇట్టి నియమమునే నేను పెట్టుకున్నాను. ఆ నియమము ప్రకారమే నడుచుకొంటున్నాను. ఇక నావాదన సంగతి. లోకమంతా వకటి, తక్కిన భాగాలతో సంబంధం లేనిదే అది ఉండదు. ఒక వేలు యింకో వేలుతో కూడితేనేగాని ఏ పనీ చెయ్యలేదు. విశ్వము అంగి తక్కినవి అంగములు. శరీరము అంగి. అవయవములు అంగములు.

◇ ◇ ◇



వివాహము ఒక Institution దానిలో system ఉంటుంది. దేవతార్చన కూడా అట్టిదే. వివాహములో మాటలూ దేవతార్చనలో మాటలూ వాటితో సంబంధం ఉన్నవారికి తెలుస్తవి.

యజ్ఞము కూడా ఒక system కాని దాని నెవరూ చెయ్యడం లేదు. ఆ మాటలకిప్పుడు అర్థము తెలియదు. యజ్ అనే ధాతువు నుండి 500మాటలు పుట్టినవి. ఇప్పుడు వాటి అర్థమేమి తెలుస్తుంది. సత్య నారాయణ వ్రతమునకు సంబంధించిన మాటలిప్పుడు తెలుస్తవి. సిస్టమ్‌కీ తదంగములకూ పరస్పర సంబంధం ఉంటుంది.

భాష కూడా అట్టిదే. "భగవంతుడు మనుష్యునకు వాక్కు ప్రసాదించాడు" అని షెల్లీ కవి అన్నాడు.

ఆరేండ్ల బాలుడికి ఆతని లోకజ్ఞానముతో సమానమైన భాష అతనికుంటుంది. అదే మాతృభాష, జీవద్భాష.

◇ ◇ ◇

పూర్వము కాలమును తెలియజేయడానికి గడియలు వాడుక చేసేవారు.

ఇప్పుడు గంటలు వాడుక చేస్తున్నారు. కాలము ఒక సిస్టమ్. దీనికీ అంగములకూ పరస్పర సంబంధంలేనిదే అర్థం కాదు.

నన్నయ్య ఈ గోదావరిలోనే స్నానం చేసి సంధ్య వార్చేవాడు. నన్నయ "నేడు, ఎల్లి" అనే సందర్భములో మనము "ఈవాళ, రేపు" అంటున్నాము. నన్నయ కాలములో 'రేపు' అనగా 'మాపు' కాని దన్నమాట.

ఈ సిస్టమ్ లో వ్యత్యాసం కలిగింది.

నన్నయ్య కాలాన 'సాని' అనగా 'తల్లి' అని అర్థము. ఈ కాలములో 'తల్లి'ని 'సాని' అనరు. ఇప్పుడు 'సానెలు' ఏ అర్థములో వాడుతున్నామో అప్పుడు 'లంజియలు' ఆ అర్థములో వాడేవారు.

నన్నయ కాలమునాటి ఉద్యోగాలు నేడులేవు. నేడున్నవి అప్పుడు లేవు. ఇన్‌స్పెక్టరు, కలక్టరు, ఓవర్సీయర్; హెడ్మాష్టర్ మొదలైన పదములు ఇప్పుడర్థము కావు. ఎక్కువ శ్రమ చేస్తే కొన్ని అర్థమౌతవేమో.

◇ ◇ ◇

భారతంలో శబ్దములన్నీ దేశభాషతో సంబంధం కలవి గనక సార్థకములు.

◇ ◇ ◇

డ్రాయింగు వేసినప్పుడు బ్యాగ్రౌండ్ వెయ్యాలి. అది లేనిదే చిత్రానికర్థం లేదు.

ఒక చిత్రములో గోపురము ఎత్తు తెలియజేయ వలసి వచ్చినప్పుడు ఒక చెట్టుతో సంబంధం ఏర్పరచాలి. ఒక బెలూన్ (బెలూన్) ఎంత ఎత్తువెళ్ళిందో తెలపడానికి ఒక విధమైన మేఘములతో సంబంధం ఏర్పాటు చేసి చిత్రించిన చిత్రమొకటి ఒక ఫ్రెంచి పత్రికలో నేను చూచాను.

◇ ◇ ◇

నన్నయ కాలము నాటి దేశభాషలో ఒక నూరోవంతైనా మిగలలేదు. అంతా కొట్టుకుపోయింది. నన్నయ కాలంలో అప్పటి వారి కర్థమయ్యే పదాలు మనకిప్పుడుకావు. వేద కాలమునాటి పదముల కర్థముగాక వేద పండితులు వాటిని గురించి యద్వా యద్వా అంటూ ఉంటారు.

భారతభాషలో మాటలకు శబ్దరత్నాకరంలో అర్థము వ్రాయ వలసి వచ్చినప్పుడు చింత్యము, అస్పష్టము ఇత్యాదిగా వ్రాసినాడు తద్గ్రంథకర్త.

నన్నయ కాలంలో ఏ పదము ఎట్లా ఉండేదో తెలుసుకోవడం కష్టము.

నన్నయగారి తాటాకుల ప్రతి ఇప్పుడు దొరకదు. దాని నుండి వ్రాసిన ప్రతులో ఆ ప్రతుల ప్రతులో మన కాలమున దొరుకుతవి. అవి ఎవరో లేఖకులు వ్రాసుకొన్నవి. వారు మాతృక నుండి సరిగా వ్రాశారా అంటే అది దైవాయత్తం. 'నడుచు, నడుచు' – ఇం దేది సరియైన రూపమో నిర్ణయించడమెట్లా? యతిస్థానంలో చూపగలిగితే తెలుస్తుంది. లేకుంటే తెలియదు.

'సొలయు, సొలచు' – ఇందేది సరియైనదో తెలుసుకోడానికి ప్రాస స్థానంలో చూడాలి. లేకుంటే తెలియదు. అది దైవాయత్తం. శకటరేఫల విషయమూ అంతే.

నన్నయ కాలమునాటి భాష శిలాక్షరములలో సందంపూడి శాసనరూపమున ఉన్నది. దానిని బట్టి నాటి దేశభాష స్వరూపం కొంత తెలుస్తుంది. జయంతి రామయ్యపంతులుగారు దాని కర్థము చెప్పలేక పోయారు ఆనాటి భాషా స్వరూపం తెలియక పోవడం వల్ల. చరిత్ర తెలుసుకోడంకోసమే భాష. నన్నయ కాలమునాటి భాష మళ్లీ ప్రయోగించడానికి కాదు. నన్నయ భారతమును అచ్చు వేసినపుడు పరిష్కర్తలు రూపాలు మార్చారు. రెండున్నర పర్వాలలో భాషా ఇద మిత్థమని చెప్పడానికి వీలులేదు.

◇ ◇ ◇

కవిత్వము ఒక కళ. కళకు దేశభాషలో ఉన్న అన్ని శబ్దాలూ అవసరము లేదు.

భాష వనమువంటిది. భాషలో ఎవరికి కావలసిన మాటలు వారు తీసుకొంటారు. నన్నయ కాలమునాటి దేశభాషంతా నన్నయ భారతములో ఉన్నదని చెప్పడానికి వీలులేదు. తెలుక్కు మారుగా సంస్కృతం వేసిన చోట్ల తెలుగే వస్తే నన్నయ భాష ఇంకా తెలిసి ఉండేది. ఒకమాట. 'అట్టిదు' అనే పదము ప్రథమావిభక్తి. దానికి

ద్వితీయావిభక్తి ఏమిటి? నన్నయ వాడలేదు కాబట్టి మనకు తెలియదు. 'కురియు' నేడు 'కురియించు' అనే పదమునకు మారుగా గ్రాంథికులు 'కురిపించు' అని వ్రాస్తున్నారు. ప్రాచీన భాష తెలియక వ్యవహారిక పదములను వాడి దానిని గ్రాంథికమని లోకులను భ్రమింపజేస్తున్నారు. తిక్కనాదుల విషయములో కూడా ఇట్లే చూచుకోండి.

గ్రాంథికభాష అతుకుల బొంత. స్పెన్సరు అనే ఆంగ్లకవి ఫెయిరీ క్వీన్ అనే కావ్యము యిట్టి భాషలో వ్రాస్తే సండితులు అది ఏ భాషా కాదన్నారు. అట్లాగే గ్రాంథిక భాష ఏ భాషా కాదు, దేశభాషా కాదు. అందరు కవుల భాషల కలయిక. తెలుగు లక్షణం వట్టి దెబ్బలాట వ్యవహారం. సంస్కృతం ఇట్లా ఉండదు. పతంజలి ఎంత చెప్పితే అంత.

◇ ◇ ◇

గ్రాంథిక భాషకు లక్షణం లేదు. 'చేతురు కోతురు' ఇత్యాదులు చిన్నయసూరి తప్పన్నాడు. గ్రాంథికులంతా ఈ పదాలు వాడుతున్నారు. 'ఉన్నాను' అనే మాట చిన్నయసూరి వప్పుకొన్నాడు. నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, జక్కన వరకూ ఎవరూ ఈ రూపము వాడనే లేదు. జయంతి రామయ్యగారు 'ఉన్నాను ఉన్నారు' అవే ప్రయోగములు చేశారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి గ్రంథాలలో ఈ ప్రయోగాలు కావలసినన్ని ఉన్నవి. వ్యవహారభాషనే వ్రాసి ఉన్నట్లయితే వారి రామచంద్రవిజయం ప్రమాణగ్రంథమయ్యేది.

◇ ◇ ◇

గురజాడ అప్పారావూ, పి.టి.శ్రీనివాస అయ్యంగారూ నేనూ ఈ వాదన లేవదీస్తే అప్పుడు మమ్మల్నందరూ దూషించేవారు.

The three tailors of the tanving street అన్నారు మమ్ముల్నప్పుడు.

◇ ◇ ◇

వీరేశలింగంగారు బ్రతికున్న కాలంలో వారు నాతో భాష విషయమై స్వేచ్ఛగా వాదించారు. నా వాదనలో సత్యం ఆయన అంగీకరించారు.

నన్నయ మొదలు వీరేశలింగంగారి వరకూ భాష మారలేదని చిలకమర్తి లక్ష్మీనరసింహంగారన్నారు. వీరు వ్రాసిన భాష నన్నయ భాష కావలసివస్తే రెండు వేల తప్పులు సవరించవలసి ఉంటుంది.

వడ్డాది సుబ్బారావుగారు మహాజాగ్రత్తగా వ్రాసే కవి. వారు 'అగుపడు' అనే పదం వాడారు. 'అగుపడు' అనే పదం తప్పనిన్నీ, 'అగ్గపడు' 'అగపడు' అనే రూపములు సరియైనవనిన్నీ, 'అగపడు' అనే పదమునకు అర్థము 'స్వాధీనమగు', 'చిక్కు' అనిన్నీ నేను వారికి చెప్పాను. వేదం వేంకటరాయశాస్త్రిగారు 'ఔపరుచ' 'ఔపించు' అనే వింత కృతకరూపాలు వాడారు. నేను చెప్పినమీదట వసురాయ కవిగారు దిద్దుకొన్నారు. ఇందును గురించి వ్యాకరణములో సూత్రము లేదు కాబట్టి కవులు తమకు తోచిన రూపములు వాడారు. వావిలాల శివావధానులుగారు 'అందరికి' అనే పదము మొదట వాడి తరువాత ఎవరో పండితులు తప్పన్నారు కాబోలు దానిని 'అందరకు' అనే కృతక రూపముగా దిద్దారు.

గ్రాంథిక భాష యిలా ఉన్నది.

అరవై సంవత్సరముల వయస్సు వచ్చినవారికి కూడా ఈ భాష రాకుండా ఉంది. అకారమధ్యమో, ఇకార మధ్యమో, ఉకారమధ్యమో తెలియదు కొన్ని పదముల విషయమున ఈ పండితులకు. ఇంకెందుకు ఈ భాష!

గ్రాంథిక భాషను పండితులుంచుకోనీండి. మీరు దేశభాష వాడండి.

◇ ◇ ◇

నా చిన్నతనంలో తీర్పులు తెలుగున వ్రాసేవారు. పండితుల అభిప్రాయములు తీసుకొనేవారు. వాటికి ఫత్వాలు అని పేరు. ఈ ఫత్వాలూ తీర్పులూ వ్యావహారిక భాషలోనే ఉన్నవి. వచన గ్రంథములలో వ్యవహార భాషనే సంప్రదాయ సిద్ధముగా వాడేవారని నా గద్య చింతామణి అనే గ్రంథములలో నిర్ధారణ చేశాను.

నన్నయ తిక్కనలు తమ గ్రంథాలలో శుద్ధదేశ భాషనే వాడారు.

నాకు ఎన్నో సన్మాన పత్రాలు సమర్పించి నాకులేని యోగ్యత మీరు ఆరోపించారు. నాకింత గౌరవమిక్కడ జరుగుతుందని నేనను కోలేదు. మీకు నాయందు గల దయవల్ల నాయందు లేని గుణములు నాకు ఆరోపించారు.

◇ ◇ ◇

ఈ వాదము నాకు నచ్చింది. దేశభాషపై ఉన్న నిరోధం తొలగించడం మన కర్తవ్యము. స్వభాషలో మాట్లాడ్డానికి ధైర్యం లేకపోవడం ఏల?...చేశారు కాబట్టి ఈ నిరోధం తొలగిస్తే స్వేచ్ఛ కలుగుతుంది. గవర్నమెంటుకంటె ఎక్కువగా పండితులు వాక్స్వాతంత్ర్యము తీసివేశారు. మనకు వాక్స్వాతంత్ర్యము లేదు. గ్రామ్యత్వం తొలగించమంటున్నాను నేను. పండితులూ కవులూ శిష్టులూ వాడేభాష తప్పనడం అవివేకం. ఎలమంచిలి సభలో మహామహోపాధ్యాయ తాతా సుబ్బారాయశాస్త్రిగారు శిష్టవ్యవహారమందున్న భాష గ్రామ్య మనరాదని తీర్మానించారు. అపభ్రంశమనే మాట ఉన్నది. గ్రామ్యం అనే మాట లేనేలేదు. గ్రామ్యమనేది పారిభాషిక పదము. వ్యుత్పత్తి నిరూపిస్తుంది గాని ప్రయోగము తప్పని సూచించదు. దేశభాష అపరిమిత ప్రయోజనము కలది. వ్యవహారములో లేని భాషలు పరిమిత ప్రయోజనము కలవి. పాణిని, పతంజలి కాత్యాయని వ్యవహార భ్రష్ట పదములు వాడరాదని అనుశాసించారు.

గురజాడ అప్పారావూ నేనూ బాల్యము నుండే విద్యాభ్యాసము చేశాము. చిన్నతనంలో మేమంతా కలిసి నలనాటకం ఆడాము. అప్పారావు కన్యాశుల్కం వ్రాయడానికిదో కారణం.

ఇంగ్లీషు ప్రైమరీ పరీక్ష ప్యాసయి మన దేశము ఏ పోలీసు సూపరెంటు ఉద్యోగము చెయ్యడానికో ఇంగ్లీషువాడు వస్తాడు. అతడు మాట్లాడే ఇంగ్లీషు చక్కని ఇంగ్లీషు అంటారు. యమ్మే ప్యాసు చేసిన విద్యార్థికుడు మాట్లాడే తెలుగు తెలుగు కాదంటారు మన పండితులు. పండితులు వ్యవహారభాషలోనే బోధిస్తారు. మేము వ్రాస్తే తప్పంటారు. సత్యం తెలిసేవరకూ తిడతారు.

ఈ ఊళ్లో వెనక సభ చేసినప్పుడు నామాట ఎవరూ వినలేదు.

అప్పుడు కొవ్వూరిలో సభ జరిగింది. ఆ సభలో పోలవరం జమీందారు గారూ, దివాకర్ల తిరుపతిశాస్త్రిగారూ నా వాదమంగీకరించారు. వీరే శలింగంగారూ నా వాద మంగీకరించారు.

ఇరవై సంవత్సరాలకు క్రితము వ్యవహార భాష బోధించవచ్చుని తీర్మానిస్తే పనికిరాదని 20,000 మంది వ్రాళ్లతో రెండు వందల టిల్లిగ్రాములతో గవర్నమెంటువారికి మహజరు పంపించినారు. అప్పటికది ఆగిపోయింది.

ఇప్పుడు ఏమి చేయవలెనో మీకు తెలుసును. రెండు కోట్లమంది సొమ్ము దేశభాష. హక్కు కాపాడగలవారు మీరు.

శివశంకర శాస్త్రిగారు నా చెయ్యి చూచి ఇంకా పదకొండు సంవత్సరాలు బ్రతికి ఉంటావని సాముద్రికం చెప్పారు. నేను జీవించి ఉంటే నేను పూనుకొన్న నిఘంటు కార్యము పూర్తి చేస్తాను. శబ్దరత్నాకరములో 2000 తప్పులున్నవి. నేనన్నమాటే కాదిది. మానపల్లి రామకృష్ణకవిగారూ సూర్యరాయ నిఘంటుకారులూ కూడా ఈ మాటే అన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అనేక వందల మాటలు శబ్దరత్నాకరములోకి ఎక్కలేదని చెప్పినారు.

వ్యాకరణమూ నిఘంటువూ – ఇవి రికార్డ్ వంటివి. ఇవి ప్రమాణము కావు. శిష్ట వ్యవహారమే ప్రమాణము.

వైయాకరణులూ, నైఘంటికులూ శిష్ట పదములు వేసుకోకుంటే వారిదే తప్పు.

వాక్కు ఆత్మను ప్రకాశింపచేసేది. లోకానికి సూర్యునివల్ల ప్రకాశము కలుగుతోంది. సూర్యుడు లేనప్పుడు చంద్రుని ప్రకాశముంటుంది. చంద్రుడు లేనప్పుడు నక్షత్రములు ప్రకాశిస్తవి. నక్షత్రములూ లేనప్పుడు, అగ్ని. అగ్ని లేనప్పుడు వాక్కు.

ఆత్మను ప్రకాశింపచేస్తుంది వాక్కు

"శబ్దబ్రహ్మాత్మనే శివాయనమః"

◈ ◈ ◈

పంతులుగారు ఉపన్యాసం చేసినంతసేపూ స్త్రీ పురుషులందరూ – సభ అంతా నిస్తరంగ సముద్రంలాగ గాంభీర్యం వహించింది.

మనవాళ్ళు పదిమంది యెక్కడ కూడినా గుసగుసల్లో పడిపోతారని వొక నింద వుంది; కాని నేను దాని కంగీకరించను. సభ్యుల ప్రవర్తన ఉపన్యాసకుని వాఙ్మాధుర్యాన్నిబట్టీ, ఉపన్యాస విషయాన్ని పట్టీ మారుతూ వుంటుంది. రామమూర్తి పంతులుగారి వంటి వక్తలు మనలో అరుదుగా ఉన్నారు. వారెక్కడ యెప్పుడు ఉపన్యాసం చేసినా సభ్యులు గాంభీర్య ముద్రనే వహిస్తారు. ఆనాటి సభలో కుమార కవి సింహులు కూడా చాలా మంది ఉండడం చేత సభ అంతా గాంభీర్యాన్నే కాక ఔదార్యాన్ని కూడా ప్రకటించింది.

గోదావరితల్లి యిదంతా చూసింది. ఇదంతా వింది. ఆదికవీ, ఆదివాగనుశాసనుడూ అయిన నన్నయ్య భట్టారకుని లీలా విలాసాలన్నీ చూసి ఉప్పొంగిన మహానుభావురాలామె. ఆదివ్య పురుషుని, పరమ పవిత్రదైనిక జీవితాన్ని మనకిప్పటికీ అస్పష్ట కలకల నినాదంతో విని పిస్తూ వున్న వాత్సల్యపతి ఆమె. రాజరాజనరేంద్రుని నిండు కొలువై కవితా వినోదాలతో మూర్ఛిల్లిపోయిన రాజమహేంద్రవరంలో యిప్పటికీ, ఎప్పటికీ గూడా కవితా విలాసాలూ, వాఙ్మయప్రీతీ ప్రోదిచేసే అమృత పయస్విని ఆమె. ఆమె రామమూర్తి పంతులుగారి మహత్తు గ్రహించింది. వారు నన్నయ భట్టారకుని పదవిలో నిలిచి వుండడం గుర్తించింది. సమగ్రమైన ఆంధ్రజాతి ఈ ఆధునిక వాగనుశాసనుడికి పాదపూజ చేస్తూ మళ్లీ తన భవిష్యదున్నతికి పునాది వేసుకుంటూ వుండడం గ్రహించింది. ఆమెకి పులకలు పేటెత్తాయి. హృదయం ఉప్పొంగిపోయింది. ఆనందమూ పారవశ్యమూ తలమునకలై పోయాయి.

నా మాటమీద మీకు నమ్మకం లేకపోతే ఆమె జీవనంలో కొత్త పొంగూ, ఆమె నడకలో కొత్త భంగిమా, ఆమె కలకల నవ్వులో కొత్త మాధుర్యమూ కలిగాయో లేదో వెళ్లి చూడండి.

– ఫిబ్రవరి, 1934, ప్రబుద్ధాంధ్ర మాసపత్రిక.

డా॥ వేదగిరి రాంబాబుగారికి

అజో – విభో – కందాళం ఫౌండేషన్ వారి

'విశిష్ట సాహిత్యమూర్తి జీవితకాలసాధన పురస్కారం'.



2018 సంపత్సరపు 'విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారం''ను ప్రముఖ రచయిత డా॥ వేదగిరి రాంబాబుగారికి 2018 జనవరి 6న సాయంత్రం 6 గం॥లకు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఇవ్వనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచారి ముఖ్య అతిధిగా విచ్చేస్తారు. విహారి అధ్యక్షత వహించే ఈ సభలో రిటైర్డ్ ఐ.పి.ఎస్.రావు విశిష్ట అతధి, డా॥ కె.బి.లక్ష్మి, డా.టి.కె.శివకుమార్ శర్మ అతిధులు. అదే రోజు ఉదయం గం.10లకు జరుగనున్న సదస్సులో తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు, సాహితీవేత్తలు సింగమనేని నారాయణ, శారదాఅశోకవర్ధన్, వేదం సూర్య ప్రకాశం, సింహప్రసాద్, కలగా శ్రీరామ్, జి.నరసింహమూర్తి, కాటూరి రవీంద్రత్రివిక్రమ్, ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ పాల్గొంటారు.

అందరికీ ఆహ్వానం.

మౌనంలోని మాట 3

సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ



తెలుగు అనువాదం :
రంగనాథ రామచంద్రరావు

కన్నడ మూలం:
డా. ఆర్. వి. బి. కుమార్

నక్కమాంసపు రుచి :

మాకు డబ్బు పెట్టి మాంసం కొని తెచ్చుకుని తినే తాహతు లేదు. మంగళవారం, శుక్రవారం తప్ప మిగిలిన రోజుల్లో ఊర్లో బిచ్చం అంతకంతే దొరికేది. అలాంటి రోజున నాన్న, అన్నలు కుక్క లను తీసుకుని వేటకు పోయేవాళ్ళు. మాకు నక్క దొరికిన రోజు చాలా సంతోషం కలిగేది. ఒక్కొక్కసారి వలవేసి రెండు మూడు నక్కలను ఒక్కసారికే పట్టుకుని వచ్చేవాళ్ళు. ఆ రోజుకు మాకు ఎంత అవసరమో అంత మాంసం తీసి పెట్టుకుని, మిగిలిన దాంట్లో కొంత మా వాళ్ళకు ఇచ్చి, మిగిలినదంతా అమ్మ 'మురిగి' చేసి పెట్టేది. 'మురిగి' అంటే మాంసాన్ని చిన్నగా చీకుల్లా కోసి గుడారం ముందు ఎండబెట్టేది. మాంసం ఎండిన తరువాత ఏదైనా కుండలో నింపి పెట్టేది. అవసరమైనపుడు వాటిని వండుకుని తినేవాళ్ళం. నక్క మాంసాన్ని ఎండకు పెట్టినపుడు కుక్కలు, కాకులు రాకుండా కాపలా కాసే పని అమ్మ మాకే చెప్పేది. ఒక పొడుగాటి కర్రను పట్టుకుని కాకులు, కుక్కలు వాటి దగ్గరికి రాకుండా చూసేవాళ్ళం. అయితే ఒక్కక్షణంలో అదే మాయలోనో కాకులు వచ్చి ముక్కలు ఎత్తుకుని పోయేవి. కాకులు, కుక్కలను కాపలా కాస్తూనే మేము జొల్లు కార్చుకునే వాళ్ళం. ఒక్కొక్కసారి ఎవరూ చూడటం లేదనుకున్నప్పుడు ఒకటో రెండో ముక్కలను తీసుకుని పచ్చిమాంసాన్నే నమిలేవాళ్ళం. ఎవరైనా చూస్తే తిట్టేవాళ్ళు. నక్క దొరకని రోజున ఉడుతనో మరొకదాన్నో పట్టుకుని వచ్చేవాళ్ళు. ఏ వేట దొరకనపుడు ఎండ్రకాయలకు చెడ్డ కాలం వచ్చిందని అర్థం. ఎందుకంటే వేటలో ఏదీ దొరకనపుడు సులభంగా దొరికే ఎండ్రకాయలను పట్టుకొచ్చి వండుకుని తినేవాళ్ళం.

వేరుశెనక్కాయల కథ :

మా గుడారం కాకుండా నాకు ఆసరా ఇచ్చిన మరొక స్థలం బస్టాండు. బిచ్చానికి బస్టాండుకూ వెళ్ళేవాడిని. బస్టాండులో నాలాంటి ఎంతోమంది బిచ్చగాళ్ళు ఉండేవాళ్ళు. వాళ్ళందరూ నాకు పరిచయస్థులే. కొందరు నన్ను గుర్రుగా చూసేవారు. మరికొందరు ఏమీ పట్టనట్టు ఉండేవారు. వీళ్ళల్లో వేరుశెనగ కాయలు, బఠాణీలు అమ్మే వారు కలిశారు. బస్సు వచ్చినపుడు నేను బిచ్చం అడుక్కోవటానికి వెళితే, వాళ్ళు వేరుశెనక్కాయలు, బఠాణీలు అమ్మడానికి నిలబడేవాళ్ళు. బస్సు పోయిన తరువాత అందరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చునేవాళ్ళం.

ఒక రోజు వేరుశెనగకాయలు అమ్మేవాడికి భోణి కాలేదు. అది నాకు తెలియదు. హాస్యంచేస్తూ వేరుశెనగకాయల బుట్టలో చేయి పెట్టి ఒక్క కాయ తీసుకున్నాను. అతడికి కోపం వచ్చింది. నా చేయి పురితిప్పాడు. చెయ్యి గట్టిగా తిప్పటం వల్ల చేతిగూడు సడిలింది. చెయ్యి వెంటనే బురబురమని వాచింది. 'ఏం చేయాల్రా దేవుడా' అని ఏడుస్తూ గుడారం వైపు వెళ్ళాను. నా చెయ్యి చూసి అమ్మ గుండెలు బాదుకుని ఏడ్వటం మొదలు పెట్టింది. నాన్న గుడారంలో లేడు. బిచ్చానికి వెళ్ళాడు. అక్క ఇంట్లోనే ఉంది. అమ్మ, అక్క వేరు శెనగక్కాయలు అమ్మేవాడి దగ్గరికి పోట్లాటకు వెళ్ళారు. వాడు 'నేను వేరుశెనగకాయలు దొంగతనం చేయడానికి ప్రయత్నించినందు వల్ల అలా చేశానని చెప్పాడు. మా వాళ్ళు ఏమీ చేయలేక తిరిగి వచ్చేశాం. కంప్లి ఫ్యాక్టరీలో ఒక సాయిబణ్ణ ఉండేవాడు. కాలు, చేయి విరిగితే కట్టు కట్టడంలో అతడికి మంచి పేరు ఉంది. అక్క నన్ను సాయిబణ్ణ దగ్గరికి పిల్చుకునిపోయింది. అతడు నా చెయ్యి చూసి చెయ్యికి కట్టు వేశాడు. అక్క కూలీనాలీ చేసి ఆ డబ్బుతో నా చెయ్యి బాగు చేయించింది.

ఆ రోజు నుంచి బస్టాండుకు వెళ్ళటం మానేశాను.

ఆ నాటి నుంచి అక్క వెంబడి కూలీ పనులకు వెళ్ళటం మొదలుపెట్టాను.

డాక్టర్‌తో పరిచయం :

ఇంతకు ముందు పశువుల డాక్టర్ గురించి చెప్పాను కదా !

ఆ డాక్టర్‌గారి ఇంటికి తరుచుగా వెళ్ళడం మొదలుపెట్టాను. వాళ్ళింట్లోనే పని చేసేవాడిని. వాళ్ళు పెట్టింది తినేవాడిని. ఇలా కాలం గడుస్తుండగా డాక్టర్‌గారు కష్టపడి సంపాదించుకుని తినటం ఎంత ముఖ్యమో, బిచ్చం అడుక్కుని తినటం అంత తప్పు అనే అవగాహనను నాలో కలిగించసాగారు. అందువల్ల ఊళ్ళోనూ, సంతలోనూ బిచ్చం అడగటం మానేస్తూ వచ్చాను. బిచ్చం అడగటం అవ మానంగా అనిపించసాగింది. నాలోని ఈ మార్పు నాన్నకు నచ్చలేదు. నాన్న నా పట్ల కోపంగా ఉండసాగాడు. నా పట్ల డాక్టర్ కుటుంబీకు లకు నమ్మకం పెరుగుతు



న్నట్టే, ఇంటి తాళాలు నా చేతికి ఇచ్చి ఇంటికి కాపలాగా ఉండమని చెప్పి డాక్టర్‌గారి కుటుంబ సభ్యులు ఊర్లకు వెళ్ళేవాళ్ళు.

దొంగతనం ఆరోపణ :

డాక్టర్‌గారు ఊరికి వెళ్ళేటప్పుడు తమ ఇంటి తాళాలు నాకు ఇచ్చేవాళ్ళు. అలాంటి రోజుల్లో నేను డాక్టర్‌గారి ఇంట్లో పడుకునే వాడిని. డాక్టర్‌గారు ఇంటి తాళాలు మాత్రమే కాదు. తమఇంటి అల్మారా తాళాలూ కూడా ఇచ్చి వెళ్ళేవాళ్ళు. కట్టల కట్టల నోట్లను నేను మొదటిసారి డాక్టర్‌గారి ఇంట్లోనే చూశాను. అయితే వాటిని దొంగతనం చేయాలని నాకు ఎన్నడూ అనిపించనే లేదు. అల్మారా తెరిచి నోట్లను కళ్ళారా చూసి అలాగే తాళం వేసేవాడిని. వాళ్ళింట్లో నేను ఆశ పడుతున్నది కేవలం పప్పులు, ఎండు కొబ్బరి, బెల్లం – వీటికి మాత్రమే! వాటిని డాక్టర్‌గారు ఊరికి తిరిగివచ్చే లోపునే ముగించే వాడిని. అయితే డాక్టర్‌గారి భార్య ఒక్క రోజు కూడా వాటిని ఎందుకు తిన్నావని అడగలేదు.

ఇలా ఉండగా ఒక సంఘటన జరిగింది.

ఒకసారి డాక్టర్‌గారు అర్జెంట్‌గా ఊరికి వెళ్ళాల్సి వచ్చింది. ఆ సమయంలో నేను కూడా డాక్టర్‌గారి ఇంటి వైపు మూడు నాలుగు రోజుల నుంచి వెళ్ళలేదు. అప్పట్లో ఫోన్లు లేవు. ఆ కారణంగా డాక్టర్ గారు తమకు పరిచయస్థులైన సుశీలమ్మ అనే ఆమెకు తమ ఇంటి తాళాలు ఇచ్చి ఊరికి వెళ్ళారు.

సుశీలమ్మ పొరుగింట్లో నివాసం ఉన్న వ్యక్తికి ఆ విషయం తెలిసింది. ఆ కాలంలో కంప్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్ళను దోచుకోవటంలో అతను ప్రసిద్ధుడు. అతని పేరు బాబు (పేరు మార్చాము). బాబుకు డాక్టర్ ఊరికి పోయిన విషయం తెలిసింది. అతను సమయం చూసి డాక్టర్ ఇంట్లో దొంగతనం చేశాడు. ఇంట్లో ఉన్న బట్టలు, బంగారం, డబ్బు అంతా దోచుకున్నాడు. ఈ విషయం మాకెవరికీ తెలియదు. డాక్టర్ ఇంట్లో దొంగతనం జరిగిన సంగతి ఇరుగుపొరుగు ద్వారా డాక్టర్‌కు తెలిసింది. డాక్టర్‌గారు వెంటనే వచ్చి పోలీస్ కంప్లయింట్ ఇచ్చారు. విచారణ ప్రారంభమైంది. డాక్టర్‌గారింటికి ఎవరెవరు వచ్చిపోతుంటారని విచారించినపుడు సహజంగానే నేనూ వాళ్ళింటికి అప్పుడప్పుడు వెళుతున్న విషయం తెలిసింది. నా విషయం తెలియగానే పోలీసులు నన్ను దొంగ అని నిర్ణయానికి వచ్చారు. అయితే ఈ విషయమేదీ నాకు తెలియదు.

మధ్యాహ్న సమయంలో ఇద్దరు పోలీసులు మాగుడారం దగ్గరికి వచ్చారు. పోలీసులను చూసి మొదటే భయపడి చచ్చే జనం మా వాళ్ళు. పోలీసులు నేరుగా వచ్చి, “నాగ అనేవాడు ఎవరు?” అని అడిగారు.

మా నాన్న బెదిరిపోతూ నా వైపు చూపించాడు.

నన్ను వెదుక్కుంటూ వాళ్ళు ఎందుకు వచ్చారో నాకు అర్థం కాలేదు.

“ఎందుకు సార్?” అని అడిగాను.

“ఊరకే, రారా” అని గద్దించారు.

అయింది కానీ అని ఈరనాగమ్మ మీద భారం వేసి వాళ్ళ వెంబడి నడిచాను.

వాళ్ళు నేరుగా డాక్టర్ ఇంటి దగ్గరికి పిల్చుకునిపోయారు. అప్పటికే డాక్టర్ ఇంటి ముందు జనం గుమిగూడివున్నారు. మధ్యన సబ్ ఇన్‌స్పెక్టర్ కూర్చునివున్నాడు. ఓ పక్కన డాక్టర్ కూర్చునివున్నాడు. పోలీసులు ఇన్‌స్పెక్టర్ ముందుకు పోయి, “సర్, నాగ అంటే ఈ పిల్లవాడు సార్” అని చెప్పారు. కూర్చున్న సబ్ ఇన్‌స్పెక్టర్ పైకి లేచి గుడ్లు ఉరిమి చూస్తూ “వెధవా, వీళ్ళ ఇంట్లో దొంగతనం చేస్తావా? జానెడు లేవు” అని కొట్టడానికి ముందుకు వచ్చాడు. అయితే డాక్టర్‌గారు గబుక్కున లేచి నన్ను కొట్టకుండా ఆపారు. సబ్ ఇన్‌స్పెక్టర్ పోలీసుల వైపు తిరిగి “స్టేషన్‌కు పిల్చుకుని పొండి. వీణ్ణి అక్కడే విచారిద్దాం. వీడిమీద ఎఫ్.ఐ.ఆర్.బుక్ చేయండి” అని అన్నాడు. అప్పుడు డాక్టర్, “ఈ కుర్రవాడిని వదిలి వేయండి. ఈ కుర్రవాడు ఎలాంటివాడో నాకు తెలుసు. మీరు దొంగల్ని పట్టుకోకపోయినా ఫరవాలేదు. ఈ పిల్లవాడిని మాత్రం ఇబ్బంది పెట్టకండి. వీడు నాకు కొడుకులాంటివాడు. మీకు దండం పెడతాను. ఈ కుర్రవాడిని వేధించకండి” అని డాక్టర్‌గారు పోలీసుల్ని వేడుకున్నాడు.

పోలీసులు నన్ను వదిలివేశారు.

డాక్టర్‌గారు ఆ రోజు నాకు అండగా నిలబడకపోయివుంటే నేను నేరస్థుడిగా ప్రజల కంటికి కనిపించేవాడిని. అటు తరువాత నేను జైలు పాలయ్యేవాడిని. జైలు నుంచి బయటికి వచ్చిన తరువాత నేను దొంగగా మారేవాడినో ఏమో? నేను దొంగగా మారటం తప్పించిన దేవుడు ఆ డాక్టర్. నేను నా బతుకు తెరువును మార్చుకోవటానికి ఆ డాక్టరే కారణం. అందుకే నా శరీరం ఈ భూమి మీద ఉన్నంత కాలం డాక్టర్ పేరు నాతోపాటు ఉండాలనీ ఆయన పేరును నా చేతిమీద పచ్చబొట్టుగా వేయించుకున్నాను.

అయితే డాక్టర్ ఇంటి దొంగతనం అన్యాయంగా నా మీద పడింది కదా అని నాకు చాలా విచారం కలిగింది.

ఇది జరిగిన మూడు నెలల తరువాత డాక్టర్ ఇంట్లో ఎవరు దొంగతనం చేశారో బయటపడింది. డాక్టర్‌గారు ఆ వ్యక్తి మీద కూడా నేరారోపణ చేయలేదు. దొంగతనం చేసింది ఎవరో తెలిసిన నాలుగు రోజులకు డాక్టర్‌గారు నాకు కబురు పంపారు.



వాళ్ళింటికి వెళ్ళాను.

"నువ్వు దొంగతనం చేయనపుడు ఎందుకు సిగ్గుపడాలి? ఎందుకు ఇంటివైపు రావటం లేదు? ఇక మీదట ఇటు వైపు వస్తుండు" అని అన్నారు.

డాక్టర్‌గారి పట్ల నాకు విశ్వాసం అలాగే ఉండింది. డాక్టర్‌గారు పని మీద చిత్రదుర్గ జిల్లాలోని ఒక ఊరికి వెళ్ళారు. అటు తరువాత వారి దర్శనం కలగలేదు. ఆయన ఫోన్ నెంబర్ నా దగ్గర లేదు. అయితే ఆయన పేరు మాత్రం నా చేతిమీద పచ్చబొట్టు రూపంలో శాశ్వతంగా ఉండిపోయింది.

ఆ డాక్టర్ ఇప్పుడు సిరుగుప్ప తాలూకా పంచాయితీ ఇ.ఓ.గా పనిచేస్తున్నారు.

డాక్టర్ ఇంటి పని :

డాక్టర్ రాధాకృష్ణారెడ్డిగారికి కవల పిల్లలు. ఇంటి పనులు చేయడానికి వాళ్ళకు ఒక మనిషి అవసరం ఉండేది. నమ్మకస్థుడైన మనిషి వాళ్ళకు కావాలి. దాంతో ఇంటి పనులకు వాళ్ళు నన్ను నియమించుకున్నారు. అయితే చేసిన పనికి జీతం ఏమీ లేదు. చేసిన పనికి తిండి మాత్రం పెట్టేవారు. ఇంటిపని అంటే వాళ్ళింటి నేల తుడవడం, నీళ్ళు తీసుకుని రావడం, పిల్లలు చేసిన దొడ్డి ఎత్తడం, ముడ్డి కడగటం, పిల్లలకు స్నానాలు చేయించడం మొదలైన పనులన్నీ నావే. డాక్టర్ భార్య వంట మొదలైన పనులు చూసుకునేది. తరువాత డాక్టర్‌గారు తమ ఊరివైపు అంటే చిత్రదుర్గకు బదిలీ చేయించు కున్నారు. వారి లగేజుతోపాటు నేనూ చిత్రదుర్గకు రవాణా అయ్యాను. చిత్రదుర్గలో డాక్టర్‌గారు నాకు మరొక బాధ్యత అప్పగించారు.

పశువుల కాపరి కావటం:

డాక్టర్‌గారి ఊరు సిద్ధవ్వనహళ్ళి అని చెప్పాను కదా! ఆ ఊళ్ళో డాక్టర్‌గారి తల్లి తండ్రులు, అన్నదమ్ములు ఉన్నారు. ఇల్లు, పొలం పుట్రా కూడా ఉన్నాయి. సిద్ధవ్వనహళ్ళి చిత్రదుర్గకు దగ్గరగానే ఉంది. ఆ ఊళ్ళో డాక్టర్‌గారు ఫారం ఆవులను సాకడం ప్రారంభించారు. అయితే డాక్టర్ కుటుంబం మాత్రం చిత్రదుర్గలో నివాసం ఉండేది. ఆ పశువులను చూసుకునే బాధ్యత డాక్టర్ నాకు అప్పగించారు. పశువుల పేడ ఎత్తడం, వాటికి మేత వేయడం, ఒళ్ళు కడగటం, పాలు పితకడం, పిండిన పాలను చిత్రదుర్గలోని హోటళ్ళకు పోసి రావటం మొదలైన పనులన్నీ నావే. ఈ పనులు చేసినందుకు నాకు ఎలాంటి కూలీకానీ, జీతం కాని నిర్ణయించలేదు. ఈ పనులతోపాటు వారి కుటుంబ సభ్యులు చెప్పిన పనులన్నీ చేయాలి. రోజూ నాకు రాగి ముద్ద పెట్టేవారు. నేను కాస్త భారీ మనిషిని. భోజనం దిట్టంగా చేసేవాడిని. భోజనం చేసిన తరువాత నాకు నిద్ర ముంచుకుని వచ్చేది. 'పశువులు కాసే కుర్రవాడు పశువులాగే తింటాడు' అని డాక్టర్‌గారి అత్తగారు ఎప్పుడూ గొణుగుతూ వుండేది. ఆ మాట నాకు గుచ్చుకున్నట్టు ఉండేది.

ఇలా మూడునాలుగు నెలలు గడిచాయి. ఆఇంటివాళ్ళు నాకు వంటపాత్రలు, పిండి ఇస్తామని, నన్నే పశువుల కొట్టంలో వంట చేసుకోమని చెప్పడం మొదలుపెట్టారు. ఇది నాకు ఇబ్బందిగా మారింది. ఎందుకంటే అప్పట్లో నాకు వంట చేసుకోవడం రాదు. ఒకసారి నేను చిత్రదుర్గకు వెళ్ళినపుడు డాక్టర్ భార్య ముందు ఈ విషయం చెప్పాను.

"అక్కా, నన్ని వంట సేస్కోమంటారు. ఎట్లా చేతు? భర్తీ తింతాడు అని తిడ్తారు" అని చెప్పాను.

డాక్టర్‌గారి భార్య తను డాక్టర్‌గారితో మాట్లాడి అంతా సరి చేస్తానని చెప్పింది. తరువాత కడుపు నిండా భోజనం పెట్టి పంపింది.

భార్య ద్వారా డాక్టర్‌కు ఈ విషయాలన్నీ తెలిసినట్టున్నాయి. దాంతో ఆయన కొత్త దారి వెదకసాగారు. అదేమిటంటే వారి తండ్రి ఇంట్లో ఇంటి పనులు చేయడానికి ఒక అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయి పేరు ఇప్పుడు నాకు గుర్తులేదు. ఆ అమ్మాయి కురువల అమ్మాయి. చూడటానికి లక్షణంగా ఉండేది. ఆమెకూ ఎవరూ దిక్కులేనట్టు ఉంది. ఆమెను నాకు ఇచ్చి పెళ్ళి చేస్తే నా వంట సమస్య తీరుతుంది. పైగా ఇద్దరు మనుషులు తమ ఇంట్లోనే పడివుంటారనే ప్లాను వేశారు.

వాళ్ళ ఆలోచన నాలో ఎక్కువ దిగులును కలిగించింది. ఎందుకంటే మా కులం కాని వేరే కులం అమ్మాయిని చేసుకోవడం మా కులంలో లేదు. అలా చేస్తే కులానికీ, దైవానికీ, ఈరనాగమ్మకూ ద్రోహం చేసినట్టు అవుతుంది. అయితే ఆ విషయాన్ని డాక్టర్ ముందు సూటిగా చెప్పే ధైర్యం నాకు లేదు. అందువల్ల ఓ రెండు రోజులు ఊరికి పోయి తల్లితండ్రులను కలిసి వస్తానని చెప్పాను. డాక్టర్‌గారు 'తొందరగా వచ్చెయ్' అని చెప్పి ఊరికి వెళ్ళి రావడానికి డబ్బులు ఇచ్చారు. డబ్బులు ఇప్పించుకుని ఊరికి వచ్చాను.

అంతే !

మళ్ళీ డాక్టర్‌గారి ఊరికి వెళ్ళలేదు.

ఊరికి వచ్చిన తరువాత ఒక జైలు నుంచి బయటపడ్డట్టు ఆనందం కలిగింది.

నేను మా ఊరికి వచ్చిన తరువాత డాక్టర్‌గారి పశువులను చూసుకోవటానికి ఎవరూ లేకపోయారు.

దాంతో వాళ్ళు తమ పశువులనంతా ఇతరులకు అమ్మేశారు.

అటు తరువాత నాకు మళ్ళీ చిత్రదుర్గకు వెళ్ళే అవసరం రానే లేదు !

కోతులు పట్టే కాయకం :

మా వాళ్ళంతా బిచ్చాటన, వేట, కూలీ మొదలైనవాటిల్లో మునిగివుండేవారు. నేనైతే ఊరికి వచ్చిన తరువాత నా కూలీపనులు, వేటపనుల్లో కాలం గడిపేవాడిని. కంప్లి, కురుగోడు, ఎమ్మిగనూరు, కల్లుకుంభ, ఇటగి, బెళగోడు, ముద్దాపుర –ఇలా ఎక్కడ కూలీపనులు దొరుకుతాయో అక్కడ కూలీపనులకు పోయే వాళ్ళం. ఖాళీ సమయాల్లో వేటకు వెళ్ళేవాళ్ళం. ఇలా వేటాడుతూ కురుగోడుకు వెళ్ళినపుడు సిరిగేరి పక్కనున్న 'క్యాదిగాళ' అనే ఊరివాళ్ళు మాతో కోతులను పట్టుకుంటే కోతికి – 'ఇంత' డబ్బులిస్తామని చెప్పారు.

మా దగ్గర జంతువులను పట్టే వలలున్నాయి. వాటిని ఉపయోగించి కోతులను పట్టుకుంటే ఇతర కూలీపనులకు వెళితే దొరికే కూలీ డబ్బులకన్నా ఎక్కువ డబ్బులు దొరుకుతాయనే ఆశతో కోతులను పట్టుకోవడానికి ఒప్పుకున్నాం.

క్యాదిగాళ రైతులకు కోతుల పీడ విపరీతంగా ఉండేది. ఆ ఊళ్ళో కొబ్బరి చెట్లు అధికంగా ఉన్నాయి. కోతులు వచ్చి ఒక్క కాయను మిగిల్చేవి కావు. మేము కోతులు కొబ్బరి చెట్టు ఎక్కడం కోసం కాచుకునేవాళ్ళం. అవి చెట్టు ఎక్కగానే చెట్టుకింద చుట్టూ వలలు వేసేవాళ్ళం. తరువాత కోతులు చెట్టు మీది నుంచి కిందకు దిగి వలలో చిక్కుకునే వరకు ఓపిగ్గా ఎక్కడైనా దాక్కుని కూర్చునేవాళ్ళం. అవి వలలో చిక్కుకునేవి. వెంటనే వాటిని పట్టుకుని గోనెసంచిలో వేసుకుని ట్రాక్టర్‌లోకి ఎక్కించేవాళ్ళం. తరువాత కోళూరు, కురుగోడు వైపు తీసుకుని వెళ్ళి అక్కడ వాటిని వదిలి వచ్చేవాళ్ళం. ఎన్ని కోతులను పట్టుకున్నామనే లెక్కపైనే రైతుల నుంచి డబ్బులు వసూలు చేసేవాళ్ళం.

ఇలా ఉండగా ఒక సంఘటన జరిగింది...

ఒక రోజు ఒక కోతి వలనుంచి గోనెసంచిలో వేసే సమయంలో తప్పించుకుని మా గుంపులోని ఒక వ్యక్తిని ఎక్కడ పడితే అక్కడ కొరికి గాయపరిచింది. కోతిని పట్టుకున్నందుకు వచ్చిన డబ్బంతా అతడిని డాక్టర్‌కు చూపించడానికే ఖర్చయింది. ఇదే కాకుండా మరొక ప్రమాదకరమైన సంఘటన జరిగింది. మాలో ఒక పెద్దాయన పంచెను గోచి పోసుకుని కట్టుకుని కోతులను పట్టుకోవడానికి వచ్చేవాడు. ఒక కోతి అతని పట్టు నుంచి తప్పించుకుని అతని బీజాలను కొరకబోయింది. అతని అదృష్టం బాగుంది. బీజాలు కోతి నోటికి దొరక్క గోచి మాత్రమే దాని నోటికి దొరికింది. అతని ప్రాణాలు దక్కాయి.

ఆ ఘటన జరిగిన తరువాత కోతులను పట్టుకోవడంలో మరింత జాగ్రత్తలు వహించసాగాం. కోతులను పట్టుకున్నప్పుడు, వాటిని సంచిలో వేసేటప్పుడు ఒక పొడవైన 'వై' ఆకారపు కర్రను వాడసాగాం. అయితే ఇదే నాకు ప్రమాదంగా మారింది. ఒక రోజు కోతి వలలో పడింది. ఆ కోతి వెనుక నేను నిలబడివున్నాను. ముందు భాగంలో మా వ్యక్తి ఒకడు కోతిని పట్టుకుని సంచిలో వేయడానికి ముందే 'వై' ఆకారపు కర్రతో కోతిని అదుపులో తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. అంతలో కోతి హఠాత్తుగా కర్రను వెనక్కు లాగింది. అది లాగిన వేగానికి కర్ర చివరి భాగం కోతి వెనక నిలబడ్డ నా పొట్టలో గట్టిగా గుచ్చుకుంది.

నా కళ్ళకు చీకటి కమ్మినట్టయ్యింది.

ఏమి చేయాలో నాకు తోచలేదు.

కడుపు గట్టిగా పట్టుకుని నేల మీద కూర్చున్నాను.

ఒక గంటపాటు ఏమైందో నాకు అర్థంకాలేదు.

గంట తరువాత కాస్త నెమ్మదించింది.

ఆ రోజు మళ్ళీ నొప్పి కనిపించలేదు.

అయితే మరుసటి రోజు నొప్పి భరించడానికి సాధ్యం కానంతగా కనిపించసాగింది. అదే ఊర్లో వున్న డాక్టర్‌కు చూపించుకున్నాను. ఆయన నొప్పి తగ్గడానికి ఏవో గోలీలు (మాత్రలు) ఇచ్చారు. అవి తీసుకున్నప్పుడు కాస్త తగ్గటం, మళ్ళీ నొప్పి రావటం కనిపించసాగింది. కడుపు నిండా భోజనం చేస్తే కాస్త నెమ్మదిగా ఉండేది. ఆకలి అవుతుండగా నొప్పి మొదలయ్యేది. కారం, పులుపు తింటే నొప్పి వచ్చేది. భరించలేకపోయేవాడిని. దాంతో కేవలం మజ్జిగ అన్నం తినటం మొదలుపెట్టాను. అయితే అదంతా అప్పటికి మాత్రమే కాస్త ఊరటగా ఉండేది. మళ్ళీ కొద్దిసేపటి తరువాత నొప్పి మొదలయ్యేది.

ఈ కడుపు నొప్పితో కోతిని పట్టుకునే కాయకానికి నమస్కారం పెట్టి కంప్లికి తిరిగొచ్చాను. అదే సమయంలో మరొక పశువుల డాక్టర్ ప్రసాదరెడ్డిగారు పరిచయమయ్యారు. రాధాకృష్ణరెడ్డిగారు బదిలీ అయిన తరువాత నేను అప్పుడప్పుడు పశువుల ఆస్పత్రికి వెళ్ళేవాడిని. రాధాకృష్ణరెడ్డి గురించి చెప్పేవాడిని. ఇలా కలిగిన పరిచయం వల్ల ఆయన నాకు కొత్త దారి చూపించారు. అ

బహుజని సాహితీ సదస్సు

అన్ని రంగాల్లో అణచివేతకు గురౌతున్న బహుజన మహిళలదే భవిష్యత్తు – అని బహుజన మహిళల జాతీయ సదస్సు పేర్కొంది. "మట్టిపూలు మహుజని సాహితీ వేదిక" ఆధ్వర్యంలో సోమవారం నాడు (27-11-12) హైదరాబాద్ చిందు ఎల్లమ్మ కొల్లారి (రవీంద్ర భారతి)లో బహుజని సాహితీ సదస్సు జరిగింది. ప్రముఖ కవయిత్రి, రచయిత్రి జూపాక సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ బహుజని సాహితీ సదస్సులో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, రచయిత, తత్వవేత్త, తెలంగాణ బిసి కమీషన్ ఛైర్మన్ బి.ఎస్.రాములు అనేకమంది ప్రముఖ బహుజని రచయితలు పాల్గొని వివిధ అంశాలపై పత్రాలను సమర్పించారు.

తీర్మానాలు : 1. మౌఖిక సాహిత్యం, జానపద కళలు అకాడెమీ ఏర్పాటు చెయ్యాలి. 2. బహుజని సాహిత్య, అకాడమీ రూపొందించాలి. 3. బహుజన జానపద కళాకారిణులకు రాజ్యసభ, శాసన మండలిలలో సభ్యత్వం కల్పించాలి. 4. జానపద కళాకారిణులకు గౌరవ భృతి కల్పించాలి. 5. తెలంగాణ రాష్ట్రోద్యమ కళాకారిణులకు రాష్ట్రప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలి. 6. బహుజని రచనలు పాఠ్యాంశాల్లో చేర్చాలి. 7. బహుజన బాలికలు, మహిళల, విద్య వికాస విస్తృతి కోసం నియోజక వర్గానికొక డిగ్రీ కళాశాల, జిల్లాకొక ప్రత్యేక విశ్వవిద్యాలయం స్థాపించాలి. 8. టి.ఎన్.సదాలక్ష్మి, చిందు ఎల్లమ్మ, ఈశ్వరీ బాయి, అయిలమ్మ వంటి బహుజని మహిళల గౌరవార్థం స్మారక నిర్మాణాలు చేపట్టాలి.

ద్విభాష్యం రాజేశ్వరరావు
94403 18415

తెలుగు తీవ్రవాదులు

నవంబరు 2017, 3వ తేదీ రాత్రి, ఎనిమిదిగంటలయింది. బిలాస్‌పూర్‌లో వుంటున్న మా రెండో అబ్బాయి ఇంట్లో ఫంక్షన్‌కి నేనూ, మా ఆవిడా విశాఖపట్నం నుండి బయలుదేరాం. ఇక్కడ నుండి 'కోర్బా' వెళ్ళే రైలులో మూడవ తరగతి శీతల పెట్టెలో 60వ నెంబరు పడక మా ఆవిడది. దానిపైన వున్న 61వ నెంబరు మధ్య పడక నాది. సామాన్లు జాగ్రత్తగా బెర్తుకింద సర్దిపెట్టి, సూట్‌కేసుకు గొలుసు బిగించి తాళం వేసి బేగులోంచి ఆవేళ్టి దినపత్రిక, 'అమ్మనుడి' అక్టోబరు సంచిక బయటకు తీశాను.

ఆ సంచికను మాఆవిడకి ఇస్తూ"నిన్ననే – తెలుగు భాషా పరిరక్షణకు ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలి' అంటూ – నిరసన దీక్షలు ఆరంభం అయ్యాయి కదా! నిజానికి పాఠశాల స్థాయిలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా బోధన చెయ్యాలి! ఆ మేరకు 86/2003 నెంబరుతో ఒక జి.వో. కూడా వుంది. కానీ పాలకులకు సంకల్పం, చిత్తశుద్ధి లేనపుడు అవి అమలు కావుగదా! ఆ జీవోను ఖచ్చితంగా అమలు చెయ్యాలనీ, తెలుగు భాషను మనం పరిరక్షించుకోవాలనీ ఈ 'అమ్మనుడి' సంచికలో వ్యాసాలు, కథలు వున్నాయి. చదువు..." అంటూ అందించాను. తరవాత దినపత్రిక చదవటంలో మునిగిపోయాను నేను.



"మేం ఛత్తీస్‌ఘడ్‌లో వుంటున్నాం. అక్కడంతా హిందీ! లేకపోతే ఛత్తీస్‌ఘడీ...! హిందీ బాగా అలవాటయిపోయింది! అయినా, మన జాతీయ భాష హిందీయే కదా! దాన్ని మనం గౌరవించాలి కదా!" అంది, తన నడవడిని సమర్థించుకునే ధోరణిలో!

అంతలోనే నాపక్క 62 వ నెంబరు సీటులో ఒక మధ్య వయస్కురాలు వచ్చి కూర్చున్నారు. నా వంక చూస్తూ హిందీలో ఏదో అడుగుతున్నారు. నాకు తెలుగు, ఆంగ్లం తప్ప వేరే భాషలు అర్థం కావు. అందువలన ఆమె వంక అయోమయంగా చూశాను. తర్వాత ఇంగ్లీషులో అన్నారావిడ "నాకు ఇక్కడ బెర్తు వచ్చింది. మా అమ్మాయికి అయిదో నెంబరు బెర్తు వచ్చింది. మీకు అభ్యంతరం లేకపోతే మీరు అయిదో నెంబరుకు వెళ్తే మా అమ్మాయి ఇక్కడకు వస్తుంది" అని ఆ మాటల సారాంశంగా నాకు అర్థమయింది! నేను ఏ మాత్రం మొహమాట పడకుండా "చూడండి! మేమిద్దరం డెబ్భయ్యో పడిలో పడినవాళ్ళం. ఆవిడ సుగరు పేషంటు! ఆవిడ ఆరోగ్యరీత్యా నేను అక్కడికి వెళ్ళలేను! క్షమించండి!" అంటూ ఆంగ్లంలోనే సమాధానం చెప్పేను.

మా ఎదురుగా 57,58 నెంబరు సీట్లలో ఇద్దరు మధ్య వయస్కులు కూర్చుని అమెరికన్ ఉచ్చారణతో ఆంగ్లంలో మాట్లాడుకుంటున్నారు. వారిద్దరి వేష భాషలు, చేతుల్లోని బుల్లి కంప్యూటర్లూ చూస్తే; పెద్ద హోదాల్లో వున్న వ్యక్తుల్లాగే కనిపించారు. వారి పక్క సీట్లో ఎవరో నల్లగా మోటుగా వున్నా వ్యక్తి బుగ్గన కారా కిళ్ళీ పెట్టుకుని, కూర్చునే సన్నగా కునుకుతున్నాడు అప్పుడే!

ఎనిమిది గంటల పది నిమిషాలకు, దాని నిర్ణీత సమయానికే రైలు కదిలింది. ఇంకో అరగంటలో కొత్త వలస స్టేషను వచ్చే

సరికి; టి.సి. టిక్కెట్లు తనిఖీ చేయటానికి మా వరుస వద్దకు వచ్చేడు. నా ప్రక్కనున్న ఆవిడ తన చేతిలోని టిక్కెట్టు అతనికి అంది స్తూ "మా అమ్మాయికి ఆ చివర, నాకు ఈ చివరా బెర్తులు వచ్చేయి. అయిదో నెంబరు దగ్గర్లో నాకు ఏదయినా బెర్తు సర్దగలరా?" అంటూ ప్రాధేయ పూర్వకంగా తెలుగులో అడిగింది.

"అక్కడ ఎవరితోనయినా మీరే సర్దు బాటు చేసుకోవాలి! నేనేం చెయ్యలేను!" అంటూ చెప్పి, టిక్కెట్టు మీద సంతకం చేసి ఆమెకు అందించాడు. తరవాత మా టిక్కెట్లు కూడా చూసి, 57వ నెంబరులో కూర్చున్న వ్యక్తికి చనువుగా 'హాయ్' చెప్పి వెళ్ళిపో యాడు టి.సి.

రెండు నిమిషాలు గడిచేక నా కుతూ హలం ఆపుకోలేక నా ప్రక్కనున్న ఆమెను అడిగేను. "మీరు తెలుగువారేనా?" అంటూ. "మేం శుద్ధ తెలుగువాళ్ళం...మాది విశాఖ పట్నమే!" అందావిడ.

"మరి నాతో ఇందాకా మాట్లాడిన పుడు హిందీలోనూ, ఆంగ్లంలోనూ అడిగేరు కానీ తెలుగులో ఒక్క ముక్కయినా మాట్లాడ లేదేం?...పైగా నా చేతిలో తెలుగు పేపరు వుంది కదా!..." చిరునవ్వు చిందించినా, కాస్త నిష్ఠూరం మేళవించిన స్వరంతో అడిగేను.

"మేం ఛత్తీస్ ఘడ్‌లో వుంటున్నాం. అక్కడంతా హిందీ! లేకపోతే ఛత్తీస్ ఘడీ...! హిందీ బాగా అలవాటయిపోయింది! అయి నా, మన జాతీయభాష హిందీయే కదా! దాన్ని మనం గౌరవించాలి కదా!" అంది, తన నడవడిని సమర్ధించుకునే ధోరణిలో!

నిన్ననే తెలుగుభాషా పరిరక్షణ గురిం చిన నిరశన వ్రత దీక్షా సమావేశానికి వెళ్ళ టం, నిన్న రాత్రే 'అమ్మనుడి' సంచికలోని సంపాదకీయం చదవటం; వీటితో మన తెలుగుభాషను సంరక్షించుకోవలసిన అవ సరం గురించి, మనసులోనే బద్ధ కంకణుడన య్యాను కాబోలు; ఆవిడగారి సమాధానంతో నాకు చెర్రెత్తి పోయింది! "హిందీ జాతీయ భాష కాదని నేను అనటం లేదు. అక్కడ ఛత్తీస్ ఘడ్‌లో మీకు హిందీయో, ఛత్తీస్‌ఘడీయో మాట్లాడటం ఎలాగూ తప్పదు, మన మను గడకోసం!! ఇక్కడ మన తెలుగు ప్రాంతానికి వచ్చినపుడు, మన ప్రాంతంలో వున్నపుడు అయినా, కనీసం మన అమ్మభాష తెలుగులో

"మీరీ విషయం గుర్తించినందుకు నాకు చాలా ఆనందంగా వుంది" అంటూ అతని వద్ద శెలవు తీసుకుని, వాష్ రూం పని ముగించుకుని, నా సీటు వద్దకు చేరుకున్నాను. రైలు విజయనగరం వదిలేక నేనూ నా శ్రీమతీ, ఫలహారాలు ముగించి బెర్తులు దింపుకుని నిద్రకుపక్రమించేం.

మాట్లాడవచ్చును కదా! ఇలా మన భాషను మనమే నిర్లక్ష్యం చేసుకుంటూ పోతే, కొద్ది సంవత్సరాలలోనే అమృతోపమానమయిన మన అందాల తెలుగుభాష అంతరించిపోయే ప్రమాదం వుంది! ఇది నా మాట కాదు! ఐక్య రాజ్య సమితిలోని భాషా విభాగంవారి అంచనాల ప్రకారం, 2050 నాటికి అంత రించిపోయే భాషల్లో మన తెలుగు కూడా ఉందని వారే శెలవిచ్చేరు, మరి! ఆ పీడకలను మనలాంటి వాళ్ళందరం కలసి, ఇప్పుడే, తొందరలోనే సాకారం చేసేలా వున్నాం" కాస్త ఆవేశంగా అన్నాను.

నా ఆవేశానికి విస్తుపోయిందావిడ!! నామాటలకు అహంకూడా దెబ్బ తిన్నట్లుంది.

మేం తెలుగు మరిచిపోలేదులెండి... మాకూ మన భాషమీద గౌరవం వుంది. అందుకే మా అమ్మాయిని విశాఖపట్నంలోనే వుంచి కార్పొరేట్ స్కూలులో చదివిస్తున్నాం" అంది కొంత వెటకారంగా ముఖంపెట్టి.

నేను నా ఆవేశం తగ్గించుకుని "మీరు తప్పుగా అర్థం చేసుకోకండి. ఇదిగో! ఈ పుస్త కంలో సంపాదకీయం చదవండి" అంటూ మా ఆవిడ చేతిలోని 'అమ్మనుడి' సంచిక ఆమెకు అందించాను. "కొత్తగా వస్తున్న ట్లుందే! ఇదే మొదటి సారిగా చూడటం..." అంటూ పుస్తకం అందుకుని పేజీలు ఇటూ అటూ తిరగేసి, తరవాత సంపాదకీయం పేజీ చదివేసి తిరిగి నాకు అందిస్తూ "ఇవన్నీ చెప్ప టానికీ వినటానికీ బాగానే వుంటాయి. కానీ మన పిల్లల చదువులు మొత్తం ఇంగ్లీషులో జరగకపోతే, వాళ్ళు భవిష్యత్తులో దేనికీ పనికి రారు, కనీసం అడుక్కోటానికి కూడా! ఇంగ్లీషు వస్తే మన దేశంలో కాకపోయినా అంతర్జాతీ యంగా ఎక్కడయినా అడుక్కోవచ్చు! అందా విడ, తానేదో పెద్ద హాస్యోక్తి పేల్చినట్లు, ముసి ముసిగా నవ్వుతూ.

"'అడుక్కుతినటమే పరమావధిగా మన చదువులు సాగితే, ఏ భాష అయినా ఇబ్బంది వుండదులెండి! మేధో వికాసానికి భాష ఒక్కటే ఆలంబనం కాదు. దానికి తోడ్పడే సాధనాలు ఇంకా చాలా వున్నాయి! ప్రపంచాన్ని ప్రగతిపథంలోకి నడిపించిన, నడిపిస్తున్న అద్భుత శాస్త్రీయ ఆవిష్కరణలు చాలా వరకూ ఆంగ్లభాషలో కాకుండా, ఇతర భాషలు నేర్చిన ఆయా శాస్త్రీయ ప్రముఖుల వలననే జరిగాయనే సంగతి మరిచిపోకండి! బిడ్డ కడుపులో వుండగానే మాతృభాష ప్రభావం ఆ బిడ్డ మీద వుంటుందని శాస్త్రీయ పరిశోధనలు ఋజువు చేశాయి కదా! అందు వలన మాతృభాషను మనం గౌరవించితీ రాలి!" అన్నాను కాస్త కఠిన స్వరంతో.

ఆవిడ మాట్లాడలేదు! ముఖం చిట్లించు కుని మిన్నకుండి పోయింది!!

నా మాటలు కొంతమేరకు అర్థమ య్యాయి కాబోలు, ఎదురుగా, 57 నెంబరు సీటులోని వ్యక్తి తన పక్కనున్న రెండో అతనితో సణుగుతున్నట్లుగా "లుక్స్ లైక్ ఎ తెలుగు టెర్రరిస్ట్ (LOOKS LIKE A TELUGU TERRORIST.) అని హేళనగా అనటం నా చెవిన పడింది కానీ, విననట్లుగానే మౌనంగా వుండి పోయాను!

తర్వాత వాష్ రూంకి వెళ్ళటానికి లేచి, అవతల చివరకు వెళ్తే, అక్కడ ఛార్టు చెక్ చేసుకుంటూ టి.సి. కనిపించేడు. "అక్కడ 57, 58 నెంబర్లలో ఇద్దరు ఆఫీసర్లు వున్నారు కదా! మీరు 'హాయ్' అంటూ ఒకరిని పలక రించేరు కూడాను..! ఎవరు వాళ్ళు?" అంటూ కుతూహలంగా అడిగేను, స్నేహ పూర్వకంగా ఆయన వంక చూస్తూ "ఈ వివరాలన్నీ ఎందు కుసార్? ఏమయింది?" అంటూ నా వంక చూశాడు.

"అబ్బే! మరేంలేదు! వాళ్ళిద్దరూ రైలు ఎక్కినప్పటి నుండీ ఇంగ్లీషు తప్ప వేరే భాష మాట్లాడుకోవటం లేదు..."

టి.సి. చిన్నగా నవ్వుతూ "మేస్టారూ! మీరు ఒక్కడే గుర్తుపెట్టుకోండి! మన భారత దేశంలోని ఏ ప్రాంతంలోనయినా సరే, ఇద్దరు మనుషులు అదేపనిగా ఆంగ్లంలో మాట్లాడేసు కుంటున్నారంటే, తప్పకుండా వాళ్ళిద్దరూ

తెలుగు వాళ్ళయి వుంటారు! నేను వారంలో రెండు రోజులు ఈ కోర్బా రైల్లో డ్యూటీ చేస్తాను. ప్రయాణీకులలో కనీసం యనభై శాతం మన తెలుగువాళ్ళే వుంటారు. కనీసం పదిశాతమయినా తెలుగులో మాట్లాడరు. అదే మన తెలుగువాళ్ల నైజం! అదే మన మాతృభాషకు పట్టిన దౌర్భాగ్యం! విశాఖ పట్నం ప్లాట్‌ఫాం మీద తమ వాళ్ళతో హాయిగా తెలుగు మాట్లాడిన వాళ్ళందరూ, రైలు ఎక్కగానే ఒక్కసారిగా హిందీలోకో, ఇంగ్లీషులోకో మారిపోతారు". అంటూ తన మనసులోని బాధను వెళ్లగక్కేడాయన.

"మీరీ విషయం గుర్తించినందుకు నాకు చాలా ఆనందంగా వుంది" అంటూ అతని వద్ద శెలవు తీసుకుని, వాష్ రూం పని ముగించుకుని, నా సీటు వద్దకు చేరుకున్నాను. రైలు విజయనగరం వదిలేక నేనూ నా శ్రీమతీ, ఫలహారాలు ముగించి బెర్తులు దింపుకుని నిద్రకుపక్రమించేం.


నాకు తెలివి వచ్చేసరికి పొద్దుట ఆరున్నర అయింది. రాయపూర్ స్టేషన్‌లో అప్పుడే ఆగినట్లుంది రైలు! ప్రయాణీకులు చాలా మంది హడావిడిగా దిగిపోతున్నారు.

5T వ నెంబరులోని ఆయన ఒక చేత్తో 'లేప్‌టేప్', మరోచేతితో బ్రీఫ్‌కేస్ పట్టుకుని లేచి నిలబడి, ముందుకు నడవబోయి, దిగువనున్న నా సూట్‌కేసును తన్నుకొని ముందుకు బోర్లా పడబోయాడు! కానీ నా మధ్య బెర్తు అతడు పడిపోకుండా అడ్డింది! అయితే, బెర్తు అంచుకు ముఖం కొట్టుకుని పెదవి చిట్లింది కాబోలు 'అమ్మా...' అంటూ అరుస్తూ చేతిలోని బ్రీఫ్ కేసును వదిలేసి, పెదవిని అణిచి పట్టుకున్నాడు. అతని వేళ్ళ మధ్య నుండి సన్నగా రక్తం చిమ్ముతోంది! అతడు తూలిపోకుండా పట్టుకున్నాను. మెల్లగా మధ్య బెర్తు నుండి దిగి, అతని బ్రీఫుకేసు పట్టుకుని అతనికి సాయం చేస్తూ ప్లాట్ ఫాం మీదకు దింపేను. మౌనంగా ముందుకు కదిలిపోయేడతను!

నాకు ఆ సమయంలో చాలా ఆనందం అనిపించింది! నా ఆనందం అతడి పెదవి చిట్లిపోయి, అతడికి బాధ కల్గినందులకు కాదు! కనీసం బాధలో నమూనా, 'మమ్మీ...' అనకుండా, 'అమ్మా...' అంటూ అమ్మ భాషలో అరిచినందుకు!!!

అ

కవిత



– డా॥ ఎన్.గోపి

మహా సంకల్పం

అమ్మా!
తెలంగాణ తల్లీ
పాదాభివందనం నీకు

మాకు తెలుగు నేర్పించిన
మట్టి సరస్వతివి నువ్వు.
మా పొలాల్లోని కూలిజనుల
పాటల్లోని నుడికారానివి నువ్వు.
వారి గుండెల్లోని
మమకారానివి నువ్వు.
నీ మధురమైన యాస
మా జీవితాల్లోని ఉచ్ఛ్వాస నిశ్వాస.

తంగెడుపూలను
ముద్దకొప్పులో ముడిచి
బంగారాన్ని వెక్కిరించావు నువ్వు.

బతుకమ్మలను పేర్చి
అన్ని రకాల పుష్పాలకు
కలిసి బ్రతకటం నేర్పించావు నువ్వు.

ఇవాళ తెలుగు
తెలంగాణ చెరువుల్లోంచి
దూకుతున్న అలుగు.

ఇవాళ తెలుగు
తెలంగాణా వాకిళ్లలో
ఎండబెట్టిన అస్తిత్వాల ఒరుగు.

ఇవాళ తెలుగు
తెలంగాణా సంస్కృతిని
తవ్విపోసే పారా పలుగు.

ఇవాళ తెలుగు
తెలంగాణా బిడ్డలకు కల్పించే
బ్రతుకు దెరువు.

అన్యభాషల జడివానలో
తెలుగే కదా మన గొడుగు.
తల్లిభాష ఒక దారం
అన్ని భాషలకు అది ఆధారం.
చనుబాలలోంచి వచ్చిందే
వ్యాకరణం.
అన్నింటినీ ఇముడ్చుకోవటమే
దాని మూలగుణం.


కన్నీటికీ భాషవుంది.
దానిపేరు తెలుగు.
కాలికి దెబ్బ తగిల్తే పసివాడు
'అమ్మా' అని అరుస్తాడు
అది అచ్చమైన తెలుగు.
అన్నం పెట్టండి తెలుగు భాషకు
అది పరబ్రహ్మంలా వెలుగుతుంది
అఖండ దీపంలా కాపాడుతుంది.

ఇవాళ తెలుగు పల్లెలన్నీ
భాగ్యనగరిలో కుప్పపడ్డాయి.
ఇది సకల జనుల కళారాధన
సబ్బండ వర్ణాల సంవేదన.

రండి! తెలుగును ఉజ్వలంగా వెలిగిద్దాం.
ఇదొక విరాట్ వివేచన
ఇది తెలుగు వెలుగుల తెలంగాణ
అవును! ఇది తెలుగు వెలుగుల తెలంగాణ.

(15-12-2017న ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభోత్సవ వేదికపై చదివిన వచన కవిత)

ధారా వాహిక



బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93903 00157

9 పునర్భవం అంటే ఏమిటి ?

సంస్కృతి - సాఫ్ట్‌వేర్

ఈనాడు మనం ఉపయోగించే మెదడు అనే పదాన్నే బౌద్ధులు మనస్సు, లేదా చిత్తం అన్నారు.

జ్ఞానేంద్రియాల ద్వారా మనం పొందేది కేవలం సమాచారం మాత్రమే. ఆ సమాచారం మెదడుకు చేరగానే విజ్ఞానంగా ముద్రపడుతుందని గతంలో చర్చించాం. ఇలా ముద్రపడిన విషయాల్లో మనకు నచ్చినవి ఉంటే ఆనందం కలుగుతుంది. నచ్చనివి ఉంటే బాధ మిగులుతుంది. నచ్చడం, నచ్చక పోవడం అనేది మన మనోస్థితిని బట్టి ఉంటుంది. పుట్టినప్పుడు "నచ్చడం నచ్చక" పోవడం ఉండదు. మన చుట్టూ ఉన్న సమాజం "ఇది మంచిది, ఇది చెయ్యాలి. ఇది చెడ్డది, ఇది చెయ్య కూడదు" అని పదేపదే నిర్దేశిస్తుంది. ఇది కంప్యూటర్‌లో సాఫ్ట్ వేర్ లాంటిది. కంప్యూటర్‌లో సినిమాలు చూడాలంటే దానికి సంబంధించిన ఒక సాఫ్ట్‌వేర్ కావాలి. ఆ సాఫ్ట్‌వేర్ ఉంటేనే సినిమాలు చూడగలం. అలాగే తెలుగు అక్షరాలు టైప్ చేయాలంటే మరో సాఫ్ట్‌వేర్ ఉండాలి, ఆ విధంగానే...మన జీవిత విధానాన్ని శాసించే సాఫ్ట్‌వేర్‌లని సమాజం, కుటుంబం పసితనంలోనే మన మెదళ్ళలో (హార్డ్ డిస్క్‌లో) నింపేస్తాయి. ఈ సాఫ్ట్‌వేరే సంస్కృతి. మనకు కలిగే భావజాలానికి ఇదే మూలం.

మన ఆనందాలకీ, దుఃఖాలకీ కారణం ఈ సంస్కృతే. మనం నమ్మిన సంస్కృతికి భిన్నమైనవి మనకి దుఃఖాన్ని, అనుకూలమైనవి ఆనందాన్ని కలిగిస్తాయి. ఎందుకంటే...మనం జ్ఞానేంద్రియాల ద్వారా సేకరించిన సమాచారం అంతా మెదడులో పదిలంగా ఉండి...అది మనం నేర్చుకున్న 'సంస్కృతి' ద్వారా విశ్లేషించబడుతుంది.

మెదడులో జ్ఞానం విద్యుత్ అయస్కాంత వలయాలుగా నిక్షిప్తం కాబడుతుంది. దానికి ఒక 'ప్రాసెస్' ఉంటుంది. మనం అలవాటు అయిన పనిని ఎంత సులభంగా చేస్తామో...ఆ విద్యుత్ అయస్కాంత కణాల వలయాలు కూడా అదే రీతిలో నడచుకుంటాయి. తన వలయానికి భిన్నమైన వలయాలు వచ్చి చేరితే ఆ నిర్మాణంలో మార్పులు వస్తాయి. ఆ మార్పుల వల్ల కొన్ని రసాయనాలు ఉత్పత్తి అవుతాయి. ఈ రసాయనాలు మన గ్రంథుల్ని ప్రేరేపిస్తాయి. ఈ ప్రేరణలే సుఖదుఃఖాలు. భౌతికంగా విశ్లేషిస్తే సుఖ దుఃఖాలు అనేవి విద్యుత్ అయస్కాంతం వలయాల వల్ల కలిగిన రసాయన చర్యలు అన్నమాట.

మన భావజాలం అంతా ఈ రసాయన చర్యల మీదే ఆధారపడి ఉంటుంది. భావజాలం కూడా ఒక రసాయన ప్రక్రియే. అంటే జ్ఞానేంద్రియాల ద్వారా మనం పొందే విషయజ్ఞానం అంతా మెదడులో ఈ రసాయన ప్రక్రియలో భాగమై పోవాలి. అలా అయితేనే అది ముద్రగా మనస్సులో మిగిలిపోతుంది.లేకుంటే..మరపుగా మాయమౌతుంది. నెమ్మదిగా మరగున పడిపోతుంది.

ఈ రసాయన చర్యలే మనకి ఆవేశాల్ని, అనుభూతుల్ని కలిగిస్తాయి. అనుభూతుల్ని కలిగించలేదంటే ఆ ప్రక్రియ సరిగా జరగలేదని అర్థం. లేదా మనలో ముందుగానే ఏర్పాటు చేసుకునే భావజాల వలయానికి చెందినది అని అర్థం కూడా.

మెదడులో కలిగే ఈ రసాయన చర్యల ఫలితాల వల్ల కలిగే అనుభూతుల వలయమే మనస్సు. మనస్సు, మెదడు, చిత్తం అనేవి ఒకటిగానే చెప్పుకుంటున్నా అవి ఒకటి కాదు.

మెదడు భౌతిక పదార్థం. మనస్సు లేదా చిత్తం రసాయన వలయం. అనుభూతులకు నిలయం. అనుభూతులంటే మనం ఇప్పుడు పొందుతున్న జ్ఞానం, గతంలో పొంది ముద్రలుగా మిగిలి పోయిన విజ్ఞానం ఈ రెండూ ఒక దానితో ఒకటి లయం (కలసిపోవడం) చెందే ప్రదేశం. ఇలా లయం కాబడే విజ్ఞాన వలయమే బౌద్ధ విజ్ఞాన వాదులు చెప్పిన 'ఆలయం'. ఆలయ విజ్ఞానం.

'ఆలయం'లో 'ఆ' అంటే సమంత అని. అంటే సంపూర్ణం. 'లయం' అంటే కలసిపోవడం - సంపూర్ణంగా కలసిపోవడమే ఆలయం.

"ఆలయం అన్ని రకాల జ్ఞానాల్ని, ఎరుకల్ని చుట్టుకొని ఉండేది" అని అసంగుడు తన 'యోగాచారభూమి'లో చెప్పాడు. దీన్ని మనం

సాధారణ భాషలో చెప్పుకోవాలంటే జ్ఞాపకశక్తి. జ్ఞానం జ్ఞానేంద్రియాల ద్వారా మెదడుకు చేరి, విజ్ఞానంగా ముద్రపడుతుంది గదా! ఆ ముద్రలన్నింటినీ ఒక రసాయన ప్రక్రియ ద్వారా నిలుపుకొని, వ్యక్తం చేస్తూ ఉండటమే జ్ఞాపకశక్తి.

మన మెదడులో ఈ రసాయన చర్యలు మందగిస్తే జ్ఞాపకశక్తి క్షీణించి పోతుంది. మనం జ్ఞానేంద్రియాల ద్వారా పొందిన జ్ఞానం ఈ రసాయన వలయంలోకి పూర్తిగా చేరకపోయినా మరపుకు గురవుతుంది. ఆ విషయం అది లీనమైన శాతాన్ని బట్టి అంత వరకే గుర్తుండి పోతుంది.

పరిపూర్ణంగా లీనమైనపుడు మాత్రమే అది జ్ఞాపకశక్తిగా మారి, కావలసినప్పుడు తిరిగి వ్యక్తం అవుతూ ఉంటుంది –

ఇలా పరిపూర్ణంగా లీనం కావడమే "ఆలయ విజ్ఞానం".

మెదడు ఒక భౌతిక పదార్థం అనీ, దానిలోని భాగాలు ఇవి, దానిలో జరిగే రసాయన ప్రక్రియలు ఇవి అనీ బౌద్ధులు ఎక్కడా చెప్పలేదు. అప్పటికి ఇప్పుడున్న వైజ్ఞానిక ఆవిష్కరణలు జరగలేదు.

కానీ – జ్ఞానం, విజ్ఞానం, ఆలోచనలు, ఊహలు, పరికల్పనలు, జ్ఞాపకశక్తి, సుఖదుఃఖాలు – కోపతాపాలూ...వీటన్నింటినీ శాస్త్రీయంగా సమన్వయం చేసుకొని ఈ చిత్త పరికల్పనలు చేశారు. అవి ఈనాటి మెదడు భౌతిక నిర్మాణాన్ని తెలియజేయలేవు, కానీ దాని పనితీరును దాదాపుగా విశదీకరించాయి.

బౌద్ధం శాస్త్రీయత ఏమంటే – కలల్ని ఆధారం చేసుకుని 'ఆత్మ'ని పరికల్పన చేయకుండా అంటే భావవాదంలో దిగిపోకుండా, 'మనస్సు'ని ఆవిష్కరించి, తద్వారా చిత్తాన్ని పరికల్పన చేసి మనిషికి కేంద్రమైన మెదడు పని తీరుని పట్టుకుంది. భౌతికవాదానికి పునాది వేసింది.

మనిషి – మృగం – సరీసృపం

ఇక్కడ మనం ఒక విషయాన్ని మర్చిపోకూడదు. మనిషి 'మనస్సు' ప్రవర్తించే తీరుని బట్టి తాత్త్వికులు అందరూ మనిషిని జంతువుగానే పోల్చారు. మనిషి ప్రవర్తన స్వతహాగా పశు ప్రవర్తనగానే భావించారు.

చిన్నపిల్లవానికి ఒక వస్తువు నివ్వండి. ఏం చేస్తాడు? దాన్ని పగులగొడతాడు. పగులకొట్టి ఆనందిస్తాడు. అందాన్ని విధ్వంసం చేసి ఆనంద పడడం అనే క్రూర స్వభావం మనిషిది అని ఈ విషయం ద్వారా బోధపడుతుంది. ఇలా లోక విషయాల్ని తీసుకుని మనిషి పుట్టుకతో 'పశువు' – పశు స్వభావి అని చాలామంది చెప్పారు.

కానీ బుద్ధుడు మాత్రమే మనిషిని మానవీయుడు, దయామయుడు, కరుణ స్వభావుడు అని చెప్పాడు. మనిషిలో ఇతర జంతు ప్రవృత్తులు ఉన్నా ఎక్కువ పాళ్ళు మానవీయతే ఉంటుంది. మంచి పనులు చేసినపుడు మాత్రమే మనస్సుకు ఆనందం, కలుగుతుంది. శాంతి చేకూరుతుంది. చెడ్డపని చేస్తే దానివల్ల ఆర్థిక లాభం కలిగినా, శారీరక సుఖం తీరినా అంతరాల్లో భయం, సిగ్గు, లజ్జలు పొడచూపుతూనే ఉంటాయి.

తప్పు పని చేస్తే సిగ్గుపడడం అనేది (పైకిగానీ, లోలోపలగాని) ప్రతి మనిషికి అనుభవానికి వచ్చిన విషయమే. అంటే మంచికి మాత్రమే మన మనస్సు సంతోషపడుతుంది. బాహ్యంలో, అంతరంగంలో కూడా 'మంచి' మాత్రమే మనకి తృప్తిని, ఆనందాన్ని కలిగిస్తుంది.

కాబట్టి, ఏదైతే ఎల్లప్పుడూ సుఖాన్నిస్తుందో అదే మనిషికి సహజగుణం. కాబట్టి మనిషి సహజగుణం 'మానవీయతే' అని బుద్ధుడు చెప్పాడు.

మనలో మొత్తం మానవీయ గుణాలే ఉండవు. పశు లక్షణాలూ ఉంటాయి. అందరిలో ఉంటాయి. పరిపూర్ణ మానవీయుడు ఎవ్వరూ ఉండరు. అశోకుడు బౌద్ధధర్మం గురించి చెప్తూ –

"ఎక్కువ మంచి, కొద్దిగా చెడు" అని చెప్పాడు. చెడు లక్షణాల్ని తగ్గించుకొని మంచి లక్షణాల్ని పెంపొందించుకుంటూ పోవడమే బౌద్ధ ధర్మాచరణ –

కాబట్టి పంచశీల, అష్టాంగ మార్గం అనే నియమాల్ని ఆచరిస్తూ ఉంటే...మనలో చెడ్డ గుణాలు తగ్గి, మంచి గుణాలు పెరుగుతూ ఉంటాయి. అప్పుడు చెడ్డపనులు (అకుశల కర్మలు) మాని, మంచి పనులు (కుశల కర్మలు) చేస్తూపోతాం. ఇలా కుశల కర్మల్ని పెంచుకోవడానికే బౌద్ధం కావాలి.

"మనిషి పుట్టుకతో మంచి వాడని, అతనిలో చెడ్డగుణాలు కూడా ఉంటాయనీ, వాటిని అదుపు చేసుకుంటూ మంచి గుణాల్ని పెంపొందించుకోవాలనేది బౌద్ధ ధర్మ సారం. దాని కోసమే అష్టాంగ మార్గం. బుద్ధునికి జ్ఞానోదయం అయ్యింది ఇదే! జ్ఞానోదయం పొందాక చెప్పింది ఇదే! దుఃఖ నివారణకి అష్టాంగ మార్గం ప్రధాన సాధనం అని బుద్ధుడు సారనాథ్‌లో తొలిసారి ప్రకటించాడు.

సరే, ఈ ప్రకటన శాస్త్రీయమా? కాదా? అనేది ఇక్కడి ప్రశ్న.

ఇటీవల మెదడు మీద అనేక పరిశోధనలు జరిగాయి. మనిషి మెదడులో 4% సరీసృప (రెప్టైల్స్) మెదడు, 36% (మమ్మేలియన్) పశువుల మెదడు, 60% మానవ మెదడులు ఉంటాయని తేల్చారు.

కోపం, పిరికితనం, కరకుతనం, అనాలోచిత నిర్ణయం – ఇవన్నీ సరీసృపాల మెదడు చేసే పనులు. అనైతికతకి చెందిన పనులన్నీ పశువుల తాలూకు మెదడు చేసే పనులు. మనలో ఉన్న ఈ మెదడు నిరంతరం వాటి పనులు అవి చేస్తూ మనల్ని అకుశల కర్మల వైపు లాక్కుపోతూ ఉంటాయి. కాని, మనలోని మానవ మెదడు మనల్ని కుశల కర్మల వైపుకు నడిపిస్తూనే ఉంటుంది. మనలో మానవ మెదడు పరిమాణం ఎక్కువ. 20% ఎక్కువ. అందుకే మనం మానవీయ కర్మలు చేసినప్పుడు అంటే మంచి పనులు చేసినప్పుడు ఆనందిస్తాం. శాంతిని పొందుతాం. కానీ, మనలో తక్కువ శాతంలో ఉన్న మానవేతర మెదళ్ళు చేసే పనులు చేశాక, బాధపడతాం. మానసిక సంఘర్షణకి లోనవుతాం. (ఇటీవల వచ్చిన స్పైడర్ సినిమాలో ఈ విషయం గురించిన చర్చఉంది. మనుషుల్లో సరీసృప ప్రవర్తన 4% నుండి 6%నికి పెరిగినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించినట్లు చెప్పారు)

ఇక్కడ గమ్మత్తైన విషయం ఒకటుంది. మనలో 40 పాళ్ళు అమానవీయ మెదడు, 60 పాళ్ళు మానవీయ మెదడు ఉంది. మనం మన మానవీయ మెదడులోంచి రెండు పాళ్లు పోగొట్టుకుంటే మంచికీ చెడుకూ మధ్య పెరిగే అంతరం రెండు పాళ్ళు కాదు. నాలుగు పాళ్లు. అంతరం రెట్టింపు అవుతుంది. రెండు ఇక్కడ పోతాయి. కాబట్టి 58 పాళ్ళు అవుతుంది. అక్కడ రెండు పాళ్ళు పెరుగుతాయి. కాబట్టి అది 42 పాళ్ళు అవుతుంది. 58 కి 42 కి అంతరం నాలుగు పాళ్ళు. అంటే మనలో ఒక్క మంచి లక్షణాన్ని పోగొట్టుకుంటే రెండు అమానవీయ లక్షణాలు పెరుగుతాయి. అలాగే...ఒక చెడ్డలక్షణాన్ని పోగొట్టుకుంటే రెండు మంచి లక్షణాలు పెరుగుతాయి.

బుద్ధుడు అష్టాంగమార్గ ఆచరణలో చెప్పింది ఇవే! మనం

'కుశల చిత్తం' తో ఉండాలంటే...

1.మనలోకి మంచి ఆలోచనల్ని రానీయాలి.

2.వచ్చిన మంచి ఆలోచనలు బైటకు పోకుండా భద్రపరచుకోవాలి.

3. మనలోకి చెడ్డ ఆలోచనల్ని రానీకుండా అడ్డుకోవాలి.

4. వచ్చిన చెడ్డ ఆలోచనల్ని నిలువనీయకుండా బైటకు నెట్టి వేయాలి.

ఇలా నిరంతరం చేస్తూనే ఉండాలి. అలా చేస్తూ ఉంటే మనలో మానవీయ గుణాలు వర్ధిల్లుతాయి. కుశల కర్మలతో చిత్తం నిండిపోతుంది. చిత్తశాంతి కలుగుతుంది.

చూడండి...ఆధునిక విజ్ఞానం చెప్పినట్లు మెదడు నిర్మాణాన్ని వివరించక పోయినా మంచి, చెడుల పట్ల మెదడు స్పందించే తీరును పరిశోధించి గొప్ప మనో విశ్లేషణ చేశాడు బుద్ధుడు – దాని ఫలితమే అష్టాంగ మార్గం. అష్టాంగ మార్గం మంచి నడవడికకు, కుశల కర్మలకూ, సమసమాజ స్థాపనకూ, మానవీయ ప్రపంచ నిర్మాణానికి ఒక శాస్త్రీయ ఆచరణాత్మక విధానం.

ఇలా మనస్సుని, అనేక కోణాల్లో బౌద్ధం విశ్లేషించింది. దాదాపుగా శాస్త్రీయ విధానాల్నే ప్రబోధించింది.

పునర్జన్మవాదం పచ్చి దురాశ

ఇదంతా బాగానే ఉంది...ఇదంతా మనిషి 'బ్రతికి ఉండగా', ఈ ప్రపంచంలో జీవించి ఉండగా పాటించే నైతిక విధానం. ఇది మనిషి భౌతిక ఉనికిలో ఉన్నప్పటి విషయం. కానీ, మనిషికి సమస్య బ్రతకడం ఒక్కటే కాదు –

నిజానికి మనిషి ఆశలు ఎంతటి దురాశలంటే...

తను ఉనికిలోకి రాకముందు – అంటే పుట్టుకకు ముందు నుండి, ఈ ప్రపంచ ఉనికి నుండి వైదొలిగాక – అంటే చనిపోయాక... కూడా తన ఉనికి ఏదో ఒక విధంగా ఉండి తీరాలి. తనకి ఒకే ఒక్క జన్మ అయితే ఎలా?......

మనకి ఈ జన్మ చాలదా?

ఈ జన్మలో ఏం సాధించాం?

ఎంత మానవీయంగా బ్రతకాం? అనేది ప్రక్కన పెట్టి తన పూర్వ జన్మ, పర జన్మల గురించి కూడా ఆలోచిస్తాడు మనిషి. జన్మ జన్మలకీ తాను ఏదో ఒక రూపంతో కొనసాగాలనే పచ్చి దురాశ ఇది. ఇది అత్యాశ కాదు. దురాశే. 100 ఏళ్లు బ్రతికేవాడు ఇంకో 20 ఏళ్లు బ్రతకాలి అని అనుకోవడం అత్యాశ అవు తుంది. ఈ జీవిత కాలాన్ని పొడిగించుకో వడం అత్యాశ అవుతుంది. కాని, దీనికి ముందూ, తర్వాత కూడా తానే మనుగడలో ఉండాలి అని అనుకోవడం పచ్చి దురాశ కాక ఏమవుతుంది?

మనిషిలోని ఈ దురాశలోంచి పుట్టిం దే పునర్జన్మ.ఆత్మవాదం. ఈ దురాశకి 'స్వప్నా లు' దారిచూపాయి. ఊతకర్రలా దారికాయి. దానితో 'ఆత్మ'ల్ని సృష్టించుకున్నాడు. వాటికి శాశ్వతత్వాన్ని ఆపాదించుకున్నాడు. –

"ఒకే ఆత్మ తిరిగి తిరిగి పుడుతుంది. అది శిథిలమైన శరీరాన్ని వదిలి, మరో నూతన శరీరానికి మారుతుంది. అలా పాత కొంపల్ని వదిలి ఎప్పటికప్పుడు 'నూతన గృహప్రవేశాలు' చేస్తుంది. అది నశించదు. కాలదు. తడవదు. నానదు. బూడిద కాదు..." అని.

"నయనం ఛిందంతి శస్త్రాని' అని ఉపనిషత్తులు ఘోషించాయి. ఆ ఘోషనే భగవద్గీత ఎలుగెత్తి చాటింది.

కానీ...మారనిది 'ఏదీ ఈ సృష్టిలో ఉండదు. ప్రతిదీ క్షణ క్షణం మారాల్సిందే' అని బుద్ధుడు చెప్పాడు. కాబట్టే బౌద్ధం అనాత్మ వాదం అయ్యిందని తెలుసుకున్నాం.

దీన్ని బట్టి చూస్తే బౌద్ధం ఈ 'జన్మను' మాత్రమే అంగీకరిస్తుంది. మరో జన్మను అంటే పునర్జన్మను అంగీకరించదు అని మనకు అవగతం అవుతుంది. కానీ...బౌద్ధం ఆ పని చేయలేదు. పునర్జన్మలా కాదుగానీ పునర్భవం చెందుతూ ఈ లోకం సాగిపోతూ ఉంటుంది అని చెప్పింది. పునర్భవం అంటే 'తిరిగి పుట్టడం' అనే అర్థం.

పునర్జన్మ అన్నా పునర్భవం అన్నా 'తిరిగి జన్మించడం' అనే. రెండూ పదాలే మార్పు. కానీ అర్థం ఒక్కటే...అయినా వాటి నిర్వచనాలు, అవి చెప్పిన అంశాలు వేరువేరు. కాబట్టి పునర్జన్మ, పునర్భవం ఒక్కటి కాదు.

ఒక్కటి కానప్పుడు పునర్భవం ప్రకారం 'తిరిగిపుట్టేది ఏది?' –

మనం ఇంతకు ముందు చెప్పుకున్నాం. 'మనం ఎనిమిది రకాలుగా జ్ఞానాల్ని పొందుతాం' అని బౌద్ధం చెప్పిందని. అందులో ఆఖరిది 'ఆలయ విజ్ఞానం' అని. 'ఆలయం' అంటే పరిపూర్ణంగా లీనం కావడం అని. పరిపూర్ణంగా లీనం అయ్యిందే స్మృతి. జ్ఞాపకశక్తి అని.

బుద్ధుడుగాని, ఆ తర్వాత బౌద్ధ విజ్ఞాన వాదులు గానీ – చెప్పింది ఏమంటే...

ఆ ఎనిమిది జ్ఞానాల్లో మొదటి ఏడూ మారుతూ ఉంటాయి. అవి మాత్రమే మార్పుకు గురవుతాయి. అవి మాత్రమే క్షణికాలు. అవి అలా మారుతూ నామ(మైండ్). రూపా(శరీరం)లుగా వ్యక్తం కాడానికి కారణం ఈ ఎనిమిదో దైన ఆలయ విజ్ఞానం. ఇది నామ, రూపాలకు అతీతమైన ఒక స్థితి – కాబట్టి ఇది మాత్రమే పునర్భవం పొందుతుంది – అంటారు.

అంటే దీనికి మార్పులేదు అని.

ఈ ఆలయ విజ్ఞాన కేంద్రమైన చిత్తాన్ని లేదా మనస్సుని 'సర్వసృష్టిబీజం'అన్నారు.

"సర్వబీజకం చిత్తం' అన్నాడు అసంగుడు యోగాచార భూమిలో. దీన్నే 'మూల విజ్ఞానం' అన్నారు మహా సాంఘికులు – పేరు ఏదైనా బౌద్ధుల ప్రకారం తిరగి పుట్టేది ఆలయ విజ్ఞానం. మనిషి చనిపోయాక అతని శరీరంలోని మిగిలిన గాలి, నీరు, నేలలాంటి భూతాలన్నీ ఆయా భూతాల్లో లీనమై పోతాయి. శరీరం మార్పు చెందుతుందే కాని, నశించదు. నామ రూపాలు మార్చుకుంటుందే కానీ, రూపుమాసిపోదు. కానీ, మనిషిలోని మూల విజ్ఞానం ఏమవుతుంది? అతను సాధించిన లేదా ఆర్జించిన విజ్ఞానశక్తి లేదా జ్ఞాపకశక్తి ఏమవుతుంది? అంతరించి పోతుందా? అసలు ఏ వస్తువుగాని, ఏ శక్తి గానీ నశించదు. ఈ సృష్టిలో నశించేది ఏదీ లేదు. లేనప్పుడు ఈ జ్ఞాపకశక్తి ఏమవ్వాలి? ఎటు పోవాలి? అది ఏ రూపంలోకి మారాలి?

ఈ విషయంలో బౌద్ధం ఏం చెప్పింది?

నశించని విజ్ఞానం పునర్భవం పొందడం సాధ్యమా? శాస్త్రీయమా? వచ్చే సంచికలో చూద్దాం!

చలసాని నరేంద్ర
9849569050

అత్యాచారాలు, హత్యల నుండి మహిళలకు విముక్తి ఎప్పుడు?



రాత్రిపూట కూడా మహిళలు స్వేచ్ఛగా, ఎటువంటి భయం లేకుండా తిరుగ గలిగితేనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చి నట్లని మహాత్మా గాంధీ చెప్పారు. స్వతంత్ర ఉద్యమకాలం నుండి మహిళా స్వాతంత్ర్యం, మహిళలకు రక్షణ, అత్యాచారాల వేధింపుల నుండి మహిళలను ఆదుకోవడం ప్రాధాన్య అంశాలుగా ఉంటూ వచ్చాయి. సరిగా ఐదేళ్లక్రితం దేశ రాజధాని ఢిల్లీలో ఒక బస్సులో ప్రయాణిస్తున్న యువతిపై దారుణంగా అత్యాచారానికి పాల్పడి, ఆమెను చంపివేసిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలకు, ఆగ్రహానికి దారితీసింది.

ఆ సంఘటనపై తీవ్రంగా స్పందించిన కేంద్రప్రభుత్వం నిర్భయ చట్టం అంటూ తీసుకు వచ్చి, మహిళల రక్షణకు కఠినమైన చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించింది. ఈ సందర్భంగా నిర్భయ నిధి అంటూ కూడా ఏర్పాటు చేసింది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు ఏవీ మహిళలకు తగు రక్షణ కల్పించలేక పోతున్నట్లు ప్రతి రోజు దినపత్రికలలో, టివి ఛానల్స్ లో ప్రసారం అవుతున్న కథనాలే వెల్లడి చేస్తున్నాయి. నిర్భయనిధిని ఏవిధంగా ఖర్చు చేస్తున్నారో అంతు బట్టడం లేదు.

మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడానికి ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, కోర్టులు ఎన్ని తీర్పులు ఇస్తున్నా, కఠినమైన చట్టాలు చేసినా ఫలితం వుండడం లేదు. జరిగే నేరాలు జరుగుతూనే వున్నాయి. గతేడాది భారత్‌లో రికార్డు స్థాయిలో రోజుకు 106 అత్యాచారాలు జరిగినట్లు జాతీయ నేర నమోదు బ్యూరో నివేదిక తెలపడం ఆందోళన కలిగిస్తున్నది. అత్యాచారానికి గురైనవారిలో 12 ఏళ్ళ వయస్సు లోపు బాలికలు ఎక్కువగా ఉండటం దిగ్భ్రాంతి కలిగిస్తున్నది.

అదీకాకుండా 94.6 శాతం కేసుల్లో నేరస్తులు బాధితులకు తెలిసినవారే కావడం మరింతగా విస్మయం కలిగించే అంశం కావడం గమనార్హం. ఇరుగు పొరుగున వుండేవారో, కుటుంబసభ్యులో, బంధువులో, తోటి ఉద్యోగస్తులో ఇలా తెలిసినవారి చేతిలోనే వారు బలవుతున్నారు. ఇటువంటి నేరాలలో దేశ రాజధాని ఢిల్లీ అగ్రభాగంగా ఉండటం మొత్తం జాతి సిగ్గుతో తలవంచుకోవలసిన అంశం.

ఢిల్లీలో అత్యంత ఎక్కువగా 1996 అత్యాచార కేసులు నమోదవగా, ఆ తర్వాతి స్థానాలలో ముంబయి (712), పూనే(354), జైపూర్(330) నగరాలు ఉన్నాయి. 2016లో దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలు 2.9శాతం పెరగగా, 4,737 అత్యాచారాలు నమోదయ్యాయి. 2015లో 34,210 అత్యాచార కేసులతో పోల్చుకుంటే 2016లో 38,947 కేసులు నమోదయ్యాయి.

పైగా, గతేడాది సామూహిక అత్యాచారాల సంఖ్య కూడా పెరిగింది. 2015లో ఇవి 2113 వుండగా 2016లో 2167 నమోద య్యాయి. అన్ని రాష్ట్రాల్లోకి ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై 14 శాతం నేరాలు నమోదవగా తర్వాత స్థానంలో బెంగాల్ (9.6శాతం) వుంది. 2016లో మహిళలపై 3,38,954 నేరాలు నమోదయ్యాయి. వీటిలో ఎక్కువ మంది భర్తలు లేదా బంధువుల చేతుల్లో క్రూరత్వానికి బలైన వారే. ఇలాంటి కేసులు 32.6శాతం నమోదయ్యాయి. మహిళలపై దాడులకు దిగిన కేసులు 25శాతం వుండగా, కిడ్నాప్‌లు 19శాతం, అత్యాచారాలు 11.5శాతం వున్నాయి.

అంతకుముందు ఏడాదితో పోలిస్తే గతేడాది బాలలపై సహితం అత్యాచార కేసులు దిగ్భ్రాంతి కలిగించే విధంగా 82 శాతం పెరగడం మరింతగా ఆందోళన కలిగిస్తున్నది. ఇటువంటి నేరాలు యుపిలో నాలుగురెట్లు పెరిగాయి. 2015లో ఈ తరహా కేసులు 596 వుండగా 2016లో ఏకంగా 2115కి పెరిగాయని జాతీయ నేర గణాంకాల బ్యూరో తెలిపింది. 2015లో 10,934మంది చిన్నారులపై అత్యాచారాలు జరగ్గా 2016లో ఈ సంఖ్య 19,920కి పెరిగింది. మొత్తంగా బాలలపై నేరాలు కూడా 13.6 శాతం పెరిగాయి. గత మూడేళ్ళలో ఇటువంటి నేరాలు పెరుగుతునే వచ్చాయని ఎన్‌సిఆర్‌బి నివేదిక పేర్కొంది.

2015లో పిల్లలపై నేరాలు 94,172 నమోదు కాగా 2016లో ఆ సంఖ్య 1,06,958కి పెరిగింది. ఇందులో పిల్లల కిడ్నాపుల కేసులు 52 శాతం వున్నాయి. గతేడాది మహారాష్ట్రలో అత్యధికంగా బాలలపై అత్యాచారాలు 2467 నమోదవగా, మధ్యప్రదేశ్‌లో 2292 కేసులు నమోదయ్యాయి. గతేడాది దోషులుగా తేలిన 9932 మంది బాల నేరస్తులను ప్రొబేషన్‌పై విడుదలచేసి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ఆధ్వర్యంలో వుంచినట్లు నివేదిక పేర్కొంది. గతేడాది ఆచూకీ తెలియకుండా పోయిన పిల్లల్లో 60శాతం మందికి పైగా బాలికలే. వీరిలో ఎక్కువ మంది బెంగాల్‌కు చెందినవారే.

హైదరాబాద్ నగర పోలీస్ షీ బృందాలను ఏర్పర్చడం ద్వారా యువతులను ర్యాగింగ్ చేయడాన్ని ఘనంగా తగ్గించ గలిగినట్లు చెబుతున్నారు. అయితే ర్యాగింగ్ కన్నా అత్యాచారాలకు గురిచేయడం మరింత విషాదకరమైన అంశం. ప్రస్తుతం మనకు అందుబాటులోకి

వస్తున్న గణాంక వివరాలు అన్నీ అత్యాచారానికి గురయిన తర్వాత మహిళలు ధైర్యంతో ఫిర్యాదు చేస్తున్న సంఘటనలు మాత్రమే కావడం గమనార్హం. అసలు ఫిర్యాదుకు నోచుకోని సంఘటనలు పలురెట్లు ఉండే అవకాశం ఉంది. ఉన్నత పదవులలో ఉంటున్న పలువురు మహిళలు సహితం పలు సందర్భాలలో నిస్సహాయతకు గురవుతున్నారు.

ఒక విధంగా మహిళలపట్ల పెరుగుతున్న పాశవిక మానసిక స్థితిని ఈ పరిస్థితులు వెల్లడి చేస్తున్నాయి. నూతన సంవత్సరం సందర్భంగా బెంగుళూరులో మహిళలు సామూహిక అత్యాచారాలకు గురికావడం మనందరిని ఇంకా కలచి వేస్తూనే ఉన్నది. దిగజారుతున్న మన సామాజిక, సాంస్కృతిక విలువలతోపాటు ప్రభుత్వ విధానాలు సహితం అందుకు దారితీస్తున్నట్లు చెప్పవచ్చు. మరోవంక మీడియాలో, సినిమాలలో మహిళలను చిత్రీకరిస్తున్న తీరుతెన్నులు సహితం కారణం అవుతున్నాయి. అనేక సందర్భాలలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. లేదా నిందితులకు అండగా నిలుస్తున్నారు.

విషమ సమయంలో సహాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళలపట్ల పోలీసులు ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు పలు సందర్భాలలో ఆందోళన కలిగిస్తూనే ఉన్నది. పోలీసులలో మహిళల సంఖ్య అనుకున్న విధంగా పెరగడం లేదు. కొన్ని సందర్భాలలో మహిళా అధికారుల ప్రవర్తన సహితం సమంజసంగా ఉండటం లేదు. మహిళలు ఎక్కువగా తమకు పరిచయమైనవారి నుండి, తాము తరచు సంచరించే ప్రదేశాలలోనే – ఇళ్లల్లో, పనిచేసే చోట, చదివేచోట – ఎక్కువగా ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. అంటే వారు సంచరిస్తున్న పరిసరాలు వారికి రక్షణ కల్పించలేక పోతున్నాయి.

మహిళలు ఉద్యోగాలు చేయడం పెరుగుతూ ఉండడంతో వారు ధైర్యంగా తమపై జరుగుతున్న పాశవిక దాడులను కొంత మేరకు నిర్భయంగా ఫిర్యాదు చేయగలుగుతున్నారు. అయితే కఠిన చట్టాలను ఆసరాగా చేసుకొని కొందరు మహిళలు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ కొందరిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ఉండటం సహితం తరచూ జరుగుతూనే ఉన్నది. మహిళలకు అవకాశాలు పెరుగుతున్నా, అనేక రంగాలలో రాణిస్తున్నా వారు తీవ్రమైన మానసిక వత్తిడులకు సహితం గురవుతున్నారని గమనించాలి. అందుకనే ఇంటర్మీడియట్ చదువుతున్న అనేకమంది విద్యార్థినులు ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉండటం చూస్తూనే ఉన్నాము.

వత్తిడులకు, అన్యాయాలకు గురవుతున్న మహిళలకు ఆసరాగా ఉండే విధంగా సలహా, సంప్రదింపుల వేదికలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం ఇటువంటి సమస్యల పరిష్కారానికి ఎంతో దోహదపడగలవు. కేవలం మహిళలకు మాత్రమే కాకుండా యువకులకు సహితం మహిళలపట్ల వ్యవహరించే విధానాలపై తగు అవగాహన కల్పించే ప్రయత్నం ఎక్కువగా జరుగుతూ ఉండాలి. మహిళలపై అత్యాచారాలకు విచ్చలవిడిగా లభ్యం అవుతున్న మద్యం, తెల్లవార్లూ నడుస్తున్న పబ్ సంస్కృతులు ఎక్కువగా కారణం అవుతూ ఉండడాన్ని ఈ సందర్భంగా గమనించాలి.

మద్యాన్ని ప్రధాన ఆదాయ మార్గంగా భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు తామే మద్యం అమ్మకాలను చేబడుతున్నాయి. మద్యం షాపులు నడపడం నేడొక్క అసాంఘిక కార్యక్రమంగా మారుతున్నది. రాత్రి 9 గంటలు దాటితే పలుచోట్ల భోజనం చేయడానికి హోటళ్లు ఉండవు గాని, అర్ధరాత్రి దాటేవరకు మద్యం అమ్మకాలు మాత్రం యధేచ్ఛగా సాగుతున్నాయి. జాతీయ రహదారుల పరిసరాలలో మద్యం అమ్మకాలను కట్టడి చేయమని పార్లమెంట్ చట్టం చేస్తే, నగరాల పరిసరాలలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్న రహదారులకు మినహాయింపు పొందటం గమనార్హం.

ప్రజల ఆరోగ్యం, మహిళల రక్షణ కన్నా ఆదాయమే ప్రభుత్వాలకు ప్రధానమైనప్పుడు, అత్యాచారాలను అరికట్టడం సాధ్యం కాగలదా? అదే విధంగా హైదరాబాద్ వంటి నగరానికే పరిమితమైన పబ్ సంస్కృతి ఇప్పుడు విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలకు సహితం వ్యాప్తి చెందుతున్నది. తెల్లవారు జాము వరకు ఇవి నడుస్తూ ఉండటం, పలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా ఉండటం, వీటి నుండి మద్యం మత్తులో యువత వాహనాలు డ్రైవ్ చేసుకొంటూ ప్రమాదాలకు గురికావడం నిత్యకృత్యంగా మారుతున్నది.

ఇక నగరాలలో ఇప్పుడు పెరుగుతున్న ఫార్మ్‌హౌస్‌లు, అతిథి గృహాలు సహితం మద్యం, మగువలతో వారాంతరపు ఆటవిడుపు కేంద్రాలుగా మారుతున్నాయి. ఇటువంటిచోట మాదక ద్రవ్యాలను సహితం పెద్దఎత్తున వినియోగిస్తున్నట్లు ఈ మధ్య వెల్లడైనది. పేరున్న నక్షత్రాల హోటళ్లలో ఇటువంటి అకృత్యాలు జరుగుతున్నాయి. బాలికల అక్రమ రవాణాలో తెలుగురాష్ట్రాలు దేశంలో ముందంజలో ఉంటున్నాయి. ఇటువంటి దుశ్చర్యలను అడ్డుకో వడం కోసం ప్రభుత్వాలు పలు పథకాలు, కార్యక్రమాలు చెబుతున్నా పలుకుబడిగల వ్యక్తుల అండదండలు ఉంటూ ఉండడంతో చెప్పుకో దగిన ఫలితాలు ఉండటం లేదు.

అత్యాచారాలతో పాటు అపహరణాలు, వరకట్నం హత్యలు కూడా పెరుగుతూ ఉన్నాయి. అందుకు దారితీస్తున్న కారణాలు, పరిస్థితులు గురించి అనేక వేదికలపై, అనేకమంది సమాలోచనలు జరుపుతూనే ఉన్నా పరిష్కారాలు మాత్రం కనుచూపుమేర కనిపించడం లేదు. ముఖ్యంగా కుటుంబంలో అందవలసిన భరోసా దూరం కావడం, అవసరమైనప్పుడు తగు సలహా, సంప్రదింపులకు అవకాశాలు అందుబాటులో లేకపోవడం, మానసికమైన వత్తిడుల నుండి ఉపశమనం కల్పించే వ్యవస్థలు తగురీతిలో లేకపోవడం ఇటువంటి పరిస్థితులకు కారణం అవుతున్నాయి.

ఇటువంటి సంఘటనల విషయంలో వ్యవహరించ వలసిన విషయమై సుప్రీం కోర్టు నిర్దుష్టమైన సిఫార్సులు చేసినా అమలులో అవసరమైన వ్యవస్థలను రూపొందించుకోలేక పోతున్నాము. ముఖ్యంగా మహిళల పట్ల వివక్షతకు ఆస్కారం లేని విధంగా మన వ్యవస్థలు, వ్యవహారాలు కొనసాగే ప్రయత్నాలు తగువిధంగా జరగడం లేదు. కేవలం చట్టాలు, కేసుల నమోదు, శిక్షలు వేయడం వల్లనే పరిస్థితులలో చెప్పుకోదగిన మార్పు తీసుకు రాలేమని స్పష్టమైనది. చట్ట ప్రకారం తగు చర్య తీసుకొంటూనే సామాజికంగా స్త్రీ, పురుషులు అవగాహనతో, పరస్పరం గౌరవంతో మెలిగే సంస్కృతిని పెంపొందించే ప్రయత్నాలు పెద్ద ఎత్తున జరగవలసి ఉంది.



కృత్రిమమేధ సృష్టికర్త తెలుగుబిడ్డ రాజ్‌రెడ్డి

వుప్పల నరసింహం
99857 81799

రోబో...బడిపిల్లల్ని, పెద్దవాళ్ళని ఆకర్షి స్తున్న పదం, రూపం. ఈ ఆధునిక రోబోకు ఆక్సిజన్‌లా శక్తి సామర్థ్యాలను సమకూర్చిన వ్యక్తి తెలుగువారు రాజ్‌రెడ్డి కావడం గర్వకారణం. 'ఇందుగలడందు లేడన్న' పద్ధతిలో నేడు రోబో అంతటా దర్శనమిస్తు న్నది. మనిషి తనకు మారుగా పనిచేసేందుకు సృష్టించుకున్నమనిషే ఈ మర మనిషి.

యుద్ధరంగంలో, సేవారంగంలో, నైపుణ్యాల రంగంలో, ఉత్పత్తి రంగంలో ఇలా అంతటా రోబోలు కనిపిస్తున్నాయి. భూమిని దున్ని పంటపండిచడమే గాక ఇతర గ్రహాలపై పరిశోధనలు జరుపుతు న్నాయి. ఇటీవల దుబాయిలో పోలీసు విధులను నిర్వహించేందుకు అక్కడ రోబోను నియమించారు. పెట్రోలింగ్ అది సమర్థవంతంగా నిర్వహిస్తోంది. చైనాలో బౌద్ధ దమ్మాన్ని బోధిస్తోంది. దక్షిణ కొరి యాలో ఆంగ్ల పాఠాలు చెబుతోంది. జపాన్ రెస్టారెంట్లలో అతిథు లకు మర్యాద పూర్వకంగా సేవలు అందిస్తోంది. ఆసుపత్రులలో వృద్ధులకు చేదోడు వాదోడుగా నిలిచి వారి ఒంటరితనాన్ని పోగొడు తున్నది. అందమైన ఆడపిల్ల అవతారమెత్తి అలరిస్తోంది. ఇది ఈనాటి ప్రపంచం. ఇది మరింత ఉన్నతీకరణ వైపు పయనిస్తోంది.

ఈ మరమనిషి కదలికలకు కృత్రిమ మేధ కీలకం. ఈ మేధను సైతం మరింత మెరుగైన రీతిలో రూపొందిస్తున్నారు. యాంత్రికంగా స్పందించడమే గాక సహజసిద్ధంగా, స్వయం నిర్ణయాలు తీసుకునే పద్ధతిలో రోబోల తయారీకై కృషి జరుగుతోంది. సైకాలజీ, తత్వ శాస్త్రం, గణితం, జువాలజీ, న్యూరోసైన్స్, సోషియాలజీని కంప్యూటర్ సైన్స్‌తో అనుసంధానం చేస్తూ మేధను...కృత్రిమ మేధను తయారు చేస్తున్నారు.

1937 జూన్ 13న చిత్తూరు జిల్లాలో జన్మించిన రాజ్‌రెడ్డి ఈ కీలకమైన ప్రాజెక్టులో కీలకపాత్ర పోషించారు. ఇంకా ఆ కృషిని కొనసాగిస్తున్నారు.

1958 సంవత్సరంలో మద్రాసులోని గిండీ విశ్వవిద్యాలయం (ప్రస్తుతం అన్నా యూనివర్శిటి) నుంచి రాజ్‌రెడ్డి సివిల్ ఇంజనీర్ పట్టా అందుకున్నారు. ఉన్నత విద్యకోసం ఆస్ట్రేలియాలోని సౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయంలో చేరి 1960 సంవత్సరంలో టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నారు. 1966 సంవత్సరంలో స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పట్టా పొందారు.

కంపూటర్ సైన్స్‌లో డాక్టరేట్ డిగ్రీ ఆయన జీవితాన్ని మార్చింది. పూర్తిగా ఆ రంగానికే అంకితమై పనిచేయడం ప్రారంభించారు. తొలుత అదే విశ్వవిద్యాలయంలో సహాయ ప్రొఫెసర్‌గా చేరారు. అనంతరం 1969వ సంవత్సరంలో కార్నెగీ మెలాన్ విశ్వవిద్యాలయం లో చేరి అక్కడి రోబోటిక్స్ ఇన్‌స్టిట్యూట్ స్థాపక డైరెక్టర్‌గా పని ప్రారంభించారు. తన బృందంతో చేసిన పరిశోధనలు రోబోటిక్ టెక్నాలజీని నూతన శిఖరాలకు చేర్చాయి. అక్కడి ఫలితాలు, ఆ రంగానికి ఆయన, ఆయన బృందం అందించిన సేవ ప్రపంచ వ్యాప్త శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. రోబోటిక్ శాస్త్రవేత్తగా గౌరవాన్ని పొందారు. అందులో భాగంగానే నోబెల్ బహుమతికి సమానంగా భావించే, కంప్యూటర్ రంగంలో అత్యుత్తమమైనదిగా తలచే ట్యూ రింగ్ అవార్డును ఆయన అందుకున్నారు. ఆసియా దేశాలకు చెందిన వారెవరికీ దక్కని పురస్కారం రాజ్‌రెడ్డికి దక్కింది.

ప్రస్తుతం రాజ్‌రెడ్డి, ఆయన బృందం ప్రతిష్ఠాత్మకమైన యూని వర్సల్ డిజిటల్ లైబ్రరీ ప్రాజెక్టుపై పనిచేస్తోంది. ఇది మానవాళికి అందిస్తున్న సమాచార నిధి. ఇంతవరకు ఇలాంటి ప్రయత్నం జరగ లేదు. సమాచారమే ఆయుధంగా, సాధికారతకు వనరుగా భావిస్తున్న తరుణంలో అంతగా చదువుకోనివారు సైతం తిలకించే తమ జ్ఞాన చక్షువులకు పని కల్పించే రీతిలో దీన్ని రూపొందిస్తున్నారు. మానవుడి సృజనాత్మకత అంతా ఇందులో రాశిపోసినట్లు కనిపిస్తుందని భావిస్తు న్నారు. కొత్త తరాలకు ఉత్ప్రేరకంగా, ఉత్తేజకరంగా, నూతన ఆవిష్క రణలకు ప్రేరణగా నిలుస్తుందని, సమాచార భండాగారంగా నిలుస్తుం దని నిపుణులు చెబుతున్నారు.

ఈ సమాచార నిధికి రోబోకు సంబంధంలేదని భావించరాదు. ఇదంతా డేటాగా ఉపకరించనున్నది. దీనితో పాటు రాజ్‌రెడ్డి వెస్ట్‌కోస్టు క్యాంపస్ డైరెక్టరుగా మనిషి – కంప్యూటర్ (రోబో) మధ్య సంభాషణ, కృత్రిమ మేధను మరింత మెరుగు పరిచే ప్రాజెక్టుపై పనిచేస్తున్నారు.

త్వరలో విప్లవాత్మకమైన రీతిలో స్వయంచోదిత (డ్రైవర్లు లేని) కార్లు, ట్రక్కులు రోడ్లపైకి రానున్నాయి. దీని వెనుక కృత్రిమ మేధ, మెరుగైన రోబోటీకరణ పద్ధతులున్నాయి. ఇప్పటికే కార్ల తయారీలో, ఇతర కర్మాగారాల్లో రోబోలు పెద్ద ఎత్తున పనిచేస్తున్నాయి. ఈ అద్భుత మైన ఫలితాల అనంతరమే మొత్తం పారిశ్రామిక రంగం "ఆటో మేషన్" వైపు మొగ్గుచూపుతోంది. ఆటోమేషన్‌కు రోబోలకు అవినా భావ సంబంధమున్నదన్న విషయం మరవరాదు. ఆ బంధాన్ని మరింత చిక్కబరుస్తున్నవారు రాజ్‌రెడ్డి.


ఆయన హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటికి ప్రాణప్రతిష్టచేసి తెలుగు వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన తలుపులు తెరిచారు.

రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ నిపుణులు ప్రపంచంతో కలసి నడిచేందుకు వీలుగా ద్వారాలు ఏర్పాటు చేశారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు.

రాజ్‌రెడ్డి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2001లో పద్మభూషణ్ అవార్డును ప్రదానం చేసింది. ఫ్రాన్స్ నుంచి ఆదేశ అత్యున్నత పౌర పురస్కారం పొందారు. వివిధ ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యా లయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశాయి. ఎన్నో ఫౌండేషన్స్ ఘనంగా సత్కరించాయి. అవార్డులను అందజేశాయి. ఇలా విశ్వమానవుడిగా ఎదిగిన తెలుగుబిడ్డ రాజ్‌రెడ్డి ప్రస్తుతం అమెరికా లోని పిట్స్‌బర్గ్‌లో నివసిస్తున్నారు. ఆయన సంవత్సరానికోసారి పుట్టిన గడ్డ చిత్తూరును, బంధువులను, బెంగుళూరును సందర్శిస్తూ వున్నారు. ఆయనతో పాటు ఆధునిక రోబో ఆలోచనలను వెంట తెస్తారు. అవి తెలుగు మెదళ్ళకు పదును పెడుతుంటాయి.

ఎం.వి.శాస్త్రి
94414 27977

సంపాదకశిల్పి పద్మశ్రీ డా॥ఎ.ఎస్.రామన్



రచన:అవధానం నాగరాజారావు
పేజీలు:170, వెల:120/-
ప్రతులకు :శ్రీమతి అవధానం గౌరమ్మ, 13-1-525/2
శ్రీవిద్యానగర్ లెక్చరర్స్ కాలనీ
ఎమ్.జి.కాలనీ శివారు.
అనంతపురం - 515001
చరవాణి : 9866498310

పత్రికా రంగంలో విశేషకృషి చేసి లబ్ధప్రతిష్ఠులైనవారు ఎందరో ఉన్నా, వారి జీవిత విశేషాలను తెలియజేసే స్వీయ చరిత్రలుగాని జీవిత చరిత్రలుగాని తెలుగులో ఎక్కువగా రాలేదు. ఆంగ్ల పత్రికలలో ప్రధాన లేదా సహాయ సంపాదకులుగాను, విలేఖరులుగాను ప్రసిద్ధికెక్కిన ఆంధ్రులు చాలమంది ఉన్నారు. సర్ చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి, ఖాసా సుబ్బారావు, కుందూరి ఈశ్వరదత్తు, కోటంరాజు సోదరులు, డా.భోగరాజు పట్టాభి సీతారామయ్య, చావలి వెంకట హనుమంతరావు, జి.వి.కృపానిధి, కోలవెన్ను రామకోటేశ్వర రావు, వైద్యుల రమణారావు, డా॥ ఎ.ఎస్.రామన్ మొ॥వారు. కోటంరాజు సోదరులలో ఒకరైన రామారావుగారి 'ది స్ట్రీట్ ఆఫ్ ఇంక్' - ఇవి స్వీయ చరిత్రలుగా వారి జీవిత విశేషాలను తెలియజేసే రచనలు. అయితే, వారి తరువాత అంతటివాడుగా ప్రసిద్ధిచెందిన డా॥ఎ.ఎస్. రామన్‌గారి జీవిత చరిత్రను, అట్టి మహనీయ, వరిష్ఠ సంపాదకునిగ పత్రికా రంగంలో అత్యంత ఉన్నత శిఖరాలను అందుకొన్న మేధావిని గురించి, వారి జీవిత చరిత్ర లేని లోటును తీర్చారు డా॥ అవధానం నాగరాజారావు. డా॥ రామన్ యొక్క ఉన్నతమైన 'ఉత్తమపురుష ప్రవృత్తికి అక్షరాకృతి' కల్పించి పై పుస్తకాన్ని ఈ తరం వారు తెలుసుకోటానికి, క్రిందటి తరంవారు ఆ అనుభూతులను నెమరువేసుకోటానికి మన ముందుకు తీసుకువచ్చారు.

కడప జిల్లా, ప్రొద్దుటూరు దగ్గర ఒక కుగ్రామంలో జన్మించిన 'అవధానం సీతారాముడు', సర్ బిరుదాంకితుడు, రామన్ ఎఫెక్ట్ రూపకర్త, భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత సి.వి.రామన్ అంటే ఎనలేని గౌరవం, భక్తి, ప్రేమ, ఆరాధ్యభావం ఉండటంతో తన పేరును ఎ.ఎస్. రామన్‌గా మార్చుకున్నారు. విద్యార్థి దశనుంచే ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యాలపై అపారమైన ప్రావీణ్యం ఉండటంతో, కథలు, పద్యాలు, వ్యాసాలు, ఏకాంకికలు అప్పటి ప్రసిద్ధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. ఆంగ్ల రచనలు 'ట్వంటీయత్ సెంచరీ' 'త్రివేణి' పత్రికలలో వెలువడ్డాయి. 'అవర్ ఇండియా' అనే మాసపత్రికను (ఢిల్లీ) స్థాపించి, సంపాదకత్వం వహించారు, 'లండన్ రివ్యూ', 'కాంటెంపరరీ రివ్యూ' పత్రికలకు భారతీయ వ్యవహారాల వ్యాసకర్తగాను, 'స్టేట్స్‌మెన్' పత్రిక, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికకు, 'లండన్ స్టూడియో మాగజైన్‌కు - యిలా ఎన్నో పత్రికలలో వారి ఆంగ్ల వ్యాసాలు ప్రచురింపబడ్డాయి. అన్నిటినీ మించి భారతదేశపు పత్రికా రంగంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 'ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా' కు మొదట సహాయ సంపాదకునిగా తరువాత ప్రధాన సంపాదకునిగా (1963-1968) పనిచేసిన మొదటి భారతీయుడు, తెలుగు బిడ్డ డా॥ ఎ.ఎస్.రామన్, అటు పాశ్చాత్యులను ఇటు భారతీయ చదువరులను అమితంగా ఆకర్షించి ఉన్నత శ్రేణి పత్రికగా ఈ వీక్లీని రామన్ తీర్చిదిద్దారు. వార్తా రచనలో నవ్యత, భారతీయ సంస్కృతి సాహిత్యాలు, కళలు, రాజకీయాలను గురించిన విమర్శ, విశ్లేషణ తెలుగుతోపాటు ఇతర భారతీయ భాషల్లోని సాహిత్యాన్ని కళాంశాలను ఆంగ్లంలోకి అనువదించి ప్రచురించారు.

'కియరొస్క్యురొ' అనే శీర్షిక - పేరుతో కళా సాంస్కృతిక రాజకీయ అంశాలనెన్నిటినో ఈ శీర్షిక క్రింద వ్రాసి అమిత ప్రశంసలు అందుకున్నారు. సంపాదకీయాలకు నగిషీలు అద్ది కొత్త ఒరవడిని కలిగించారు. వార్తలలో నిష్పాక్షికత, నిర్భీతి, నిజాయితీ, విశ్వసనీయత, - ఆలోచనా ప్రేరణా ఉండాలని నమ్మిన వారు.

ఇదంతా ఒక ఎత్తయితే, రామన్ బహుముఖీనంగా ప్రజ్ఞాపాటవాలు కలిగిన విశిష్టవ్యక్తి. ఆయన సంగీత చిత్రకళా ప్రేమికుడు. మంచి కళా విమర్శకుడు. మంచి కవితా ప్రీతి కలవాడు. భావ కవిత్వ ధోరణికి ఆకర్షితుడై కృష్ణశాస్త్రి రచనలకు ప్రభావితుడైనాడు. పింగళి - కాటూరి రచించిన 'సౌందర నందము' ఖండకావ్యాన్ని మూడు రంగాల నాటికగా మలిచారు. రాయప్రోలువారి 'స్నేహలతా దేవి' భావ కవిత్వ ఖండకావ్యాన్ని కూడా అదే పేరున ఏకాంకికగా వ్రాశారు. ప్రబుద్ధాత్మ, అభాగిని మొ॥న పద్య ఖండికలు రచించారు. కవి ప్రశంసలను అందుకున్నారు.

ఈ పుస్తకంలో డా. ఎ.ఎస్.రామన్ గురించిన జీవిత విశేషాలు, వారు మరణించిన సందర్భంలో ముగ్గురు ప్రముఖుల సంతాప సందే శాలు, సాహిత్య కృషిలో భాగంగా 'సౌందరనందము' స్నేహ లతాదేవి (ఏకాంకిక), ప్రబుద్ధాత్మ మరియు అభాగిని పద్యఖండికలు, 'కియరొ స్క్యురొ' శీర్షిక క్రింద వ్రాసిన మూడు ఆంగ్ల పద్య ఖండికలు, 'కియరొ స్క్యురొ' శీర్షికక్రింద వ్రాసిన మూడు ఆంగ్ల వ్యాసాలు, వాటికి ముందుగా తెలుగులో వ్యాఖ్య, మూడు ఆంగ్లవార్తా వ్యాసాలు - వాటికి తెలుగులో పరిచయం, భారత ప్రథమ ప్రధాని నెహ్రూతోను మరియు కంచి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామితోను జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు, రామన్‌కు సన్నిహితులు, స్నేహితులు అయిన నలుగురు ప్రముఖుల విశేషాలు చివరగా 19 అరుదైన ఛాయాచిత్రాల మాలిక ఇవ్వబడ్డాయి.

ఇంతటి విశిష్టమైన పుస్తకాన్ని పత్రికారంగంలోనివారు, సాహిత్యాభిమానులు అందరూ చదవాలి.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

ప్రపంచ తెలుగు మహాసభల్లో కొన్ని వేదికలపై దృశ్యాలు












అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
January 2018 **Vol.3, Issue 11**
Date of publication : 1st of every month
Date of posting : 3rd&6th of every month
RNI-APTEL/2015/62362
Postal Reg. NO.TEN\13\2018-20



If not delivered, please return to : 'The publisher, AMMANUDI monthly,
8-386, Jivaka bhavanam, ANGALAKUDURU (po), TENALI- 522 211, Guntur (dt) A.P. Cell: 9440 448244